సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక



171

జనవరి 1990

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

171 మాసపత్రిక జనవరి 1990

ఈ సంచికలో

నిర్వహణ

సాహితీ మిత్రులు

సంవత్సర చందా రు. 40 ఈ సంచిక రు. 4

Edited, Printed and Published by P. Hemalata, and printed at Nagendra Press, Vijayawada-520 002.

సృజనపై విరసం జెండా

ఆధునిక సాహిత్యవేదికగా ప్రారంభించిన సృజన ఆధునికతమీద, ప్రయోగం మీద దృష్టి నిలిపినంతగా ప్రజాసంస్కృతీ సాహిత్య అవసరంమీద, సామాజిక ప్రయోజనం తొలిరోజుల్లో స్పష్టమైన చూపు పెట్టలేదు. శాస్త్రీయ దృక్పథం తన ప్రయోగంలో ఒక అంశంగా గణనలోకి తీసుకున్నప్పటికీ భారత ప్రజల జీవితంలో నక్సల్బరీ ప్రయోగం జరిగేదాకా కూడా ఆ శాస్త్రీయదృష్టి ఏమిటో సృజన అనుభవానికే కాదు ఇక్కడి భౌతిక పరిస్థితుల అనుభవానికికూడా రాలేదు. ఒక అశాంతికి, ఒక ఆకాంక్షకు నూతన విలువలకోసం తపనకు ఎక్కడో మేల్కొంటున్న పొలాల వేడి తాకుతున్నదని తెలుసుకానీ ఆ వేడి వెలుగు ఏ దిక్కునుంచి ఏ దిక్కువైపు ప్రసరిస్తున్నదో అది ఏ రెండు శిబిరాలమధ్య ఏ సరిహద్దు గీస్తున్నదో అది ఏ బరిమీద నిలిచి ఒక సత్యాన్ని ఒక అభాసనుంచి వేరుచేస్తున్నదో ఆ వాతావరణంలో ఆ పరిసరాలలో అదే కాలంలో కళ్ళు తెరిచిన సృజనకు అప్పటికింకా తెలియదు.

1966 నవంబర్‌లో సృజన ప్రారంభమయ్యేనాటికి చైనాలో శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం ప్రారంభమవుతున్నది. వ్యవసాయమూ, పరిశ్రమలనే రెండు కాళ్ళమీద నిలిచిన ఒక నూతన ప్రజాస్వామిక సమాజం ఒకగొప్ప గెంతు ముందుకు (Great leap forward) వేయాలని ప్రయత్నించినపుడు ఏర్పడిన ఘర్షణలోంచి వచ్చింది ఈ విప్లవం. ఇది పునాదిని కుదిపిన ఉపరితలం. ఉపరితలాన్ని స్పృశించిన పునాది. అందుకే అటు నక్సల్బరీలో జోతేదార్లకు వ్యతిరేకంగా భూమికొరకు సంతాలులు చేపట్టిన సాయుధపోరాటంగా మాత్రమే కాకుండా సాంస్కృతిక రంగంలో చదువులనూ. సాహిత్యాన్నీ, సంస్కృతినీ ప్రశ్నించి "విగ్రహ విధ్వంస" ను ప్రకటించిన కాలమది. అందుకే తెలుగు సాహిత్యంలో దిక్కులను ప్రశ్నించిన దిగంబర కవులు యాదృచ్ఛికంగా రాలేదు.

1970 ప్రారంభానికి సృజనమార్గం సుగమమైపోయింది. నక్సల్బరీ పంథా శ్రీకాకుళంలో, సృజన భావోద్వేగ జన్మస్థలమయిన వరంగల్‌లోని ములుగు అడవుల్లో ఒక భౌతిక వాస్తవికత అయింది. సృజన సాహితీ మిత్రులలో కొందరు కొండల్లో కోనల్లో పోరాడుతున్న ప్రజలకు తమ సాహిత్య హస్తాలందించారు. 70 ఫిబ్రవరిలో సృజన తరఫున శ్రీశ్రీని ప్రశ్నించిన ఇరవైమంది సాహితీమిత్రుల్లో ఎవరి పక్షం ఏమిటో పటాపంచలుగా బయటపడ్తూనే వచ్చింది. "నిన్న విడిచిన పోరాటం

నేడందుకోక తప్పద"ని సృజన సరిగానే గ్రహించింది. భౌగోళికంగా సృజన వరంగల్ తిరిగి చేరుకున్న అనతి కాలంలోనే "ట్రిగర్ మీది వేళ్ళతో" ఆహ్వానం అందింది. విశాఖలో విద్యార్థులు మేధావులను ప్రశ్నించేనాటికే సృజన ఈ మరో ప్రపంచపు యజ్ఞానికి సమిధనొకటి సమకూర్చుకునే వెళ్ళింది.

అయితే ఇదంతా ఒక సన్నాహం, సంరంభం మాత్రమే. 'అభ్యుదయ సాహిత్యవేదిక'ను బహిష్కరించి ప్రత్యామ్నాయ సాహిత్యవేదికను రూపొందించుకోవాలనే తపనతో నాలుగువైపులనుంచి యువతరం ఉవ్విళ్ళూరినపుడు కొ. కు. మాటల్లో ఇది "వెయ్యి నక్సల్బరీలు వికసించడం"గా వుండాలా, ఇవన్నీ ఒకే ఒక సమాహారంలో చేరిపోవాలా అనే విచికిత్సలోనే సృజనవుంది. ఎక్కడా సాయుధ పోరాట రాజకీయాలకు ఒక కేంద్రీకృత సంఘటిత బహిరంగ వేదికలేని సమయంలో ఎక్కడికక్కడగా ఈ చేతులు పోరాట ఉప్పునందుకొని ఆ లావణ్యకాంతిని అనుసృజన చేయాలా, ఒక లాక్షణికవాద రచయితల సంఘం(లావారసం ఈ కాలపు లాక్షణికవాదం మార్క్సిజమే-శ్రీశ్రీ)ఏర్పడాలా అనే విచికిత్సను పరిస్థితులూ,సంఘటనలూ ఒత్తుకొని వచ్చిన కాలం, శ్రీశ్రీని ఎత్తుకొని వచ్చిన విప్లవకెరటమే పరిష్కరించాయి. ప్రజలే చరిత్ర నిర్మిస్తారు కానీ వాళ్ళుకూడా వాళ్ళ ఇష్టానుసారం నిర్మించలేరన్నట్టుగా కాలం సవాలుకు తల ఒగ్గిన కలంయోధుల సంఘంగా విరసం ఏర్పడింది.

అప్పటిదాకా త్రైమాసిక పత్రికగావున్న సృజన విప్లవ సాంస్కృతిక, సాహిత్య అవసరాలకోసం మాసపత్రికగా మారకతప్పలేదు. సాహితీ మిత్రులందరూ సృజన విరసం అధికార వాణిగా మారడం అంగీకరించకపోవచ్చు, కానీ అది విరసం అనధికార పత్రికగా నలుగురిలో చెలామణి కావడాన్ని స్వీకరించక తప్పలేదు. అస్పష్ట, అరూప అనుభూతి భావాలనుంచి విస్పష్ట వర్గపోరాట సారంగల విప్లవానుభూతిలోకి సృజన మారింది. ఆధునిక సాహిత్యవేదిక విప్లవమాసపత్రికగా మారిందని అభియోగం చేసినవాళ్ళూ వున్నారు. అభిమానించిన వాళ్ళున్నారు. 'జాగృతి'ని సాహిత్య పత్రికగా భావించి సృజనను రాజకీయ పత్రికల జాబితాలో చేర్చిన వాళ్ళూ వున్నారు. ఇదివరకటిలా కాకుండా సృజనలో రాజకీయాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని లోగా అభిమానించి ఇపుడు ఇబ్బంది పడ్తున్నట్లు కన్పించిన వాళ్లూ వున్నారు. వీళ్ళందరూ శ్రీకాకుళ రైతాంగ పోరాటంవలన మొదటిసారిగా ప్రజాజీవితంలోకి ప్రజల రాజకీయాలు అందువలన దానికనుసంధానమైన ప్రజల సంస్కృతి ప్రవేశించిందనే విషయాన్ని తాము గ్రహిస్తున్నట్లు తెలుసుకోలేకపోయారు. సృజన

మాత్రం తనమీద కాలం ఒక విప్లవసాహిత్య ప్రచార బాధ్యతను మోపిందని సకాలంలో గ్రహించింది.

1970 జులై 4 న విరసం ఆవిర్భవించిననాడు వరంగల్‌నుంచి విప్లవకవులు 'ప్రజను సాయుధం చేస్తున్న రెవల్యూషనరీ నేడుకవి' అని 'మార్చ్' చేసి విరసంలో చేరిపోయారు. 70 అక్టోబర్‌లో కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహినగర్‌లో (ఖమ్మం) విరసం జెండా ఎగిరింది. నాలుగు నెలల్లోనే అంటే 71 ఫిబ్రవరి నాటికి సృజన మాసపత్రికగా మారి విరసం జెండానెత్తుకున్నది.

ఈ మార్పువల్ల ఏ మార్పులొచ్చినవి ?

ప్రయోగవాదం ప్రయోజనవాదంలో అంతర్లీనమైపోయింది. సాంస్కృతిక విప్లవకాలంలో అన్నిరంగాల్లో అమలుచేయడానికి ప్రయత్నించిన ఉత్పత్తి అభివృద్ధి, ప్రయోగం, వర్గపోరాటం అనే మూడు అంశాల్లో వర్గపోరాటం గీటురాయి అనే అంశాన్ని సృజన సాంస్కృతిక రంగంలో స్పష్టంగా అవగాహనకు తెచ్చుకున్నది.

అందుకే నిర్వహణకు సంబంధించిన వివరణగానో ప్రత్యేక సంచికల పనిగానో వుంటూ వచ్చిన సంపాదకీయాలు మాసపత్రికలో సమకాలీన తాజా అవసరాలైనవి. సామాజిక సంఘటనలు విధిగా సంఘటనలుగానే కాకుండా చరిత్ర నిర్మాణంలో భాగమవుతున్న సమయంలో సృజన సామాజిక వ్యాఖ్యాత బాధ్యతను చేపట్టాల్సి వచ్చింది. నిజానికి ఆ సాంస్కృతిక ఆచరణలో పాల్గొంటూ వ్యాఖ్యానిస్తున్న పాత్ర విరసం నిర్వహిస్తున్నది. ఇంకెన్నో సాహిత్య సాంస్కృతిక వ్యక్తీకరణలతో పాటు సృజన కూడా ఈ సాంస్కృతిక ఆచరణకు ఒక అనుసృజన అయింది.

తొలి రోజుల్లో కళాశాల విద్యార్థుల కోసం వచన కవితలో పోటీలు పెట్టిన సృజన విరసంవలెనే విప్లవ సందేశం విప్లవ ప్రజానీకం దగ్గరకు వెళ్ళాలంటే పాట వంటి కళా రూపాలను ప్రోత్సహించాలని గ్రహించింది. చెరబండరాజు, జనసేన, శివసాగర్ పాటలు మొదలుకొని గద్దర్ పాటలదాకా విరసం ఏర్పడిన తొలి రోజుల్లోనే సృజన ప్రచురించింది.

'అంపశయ్య' వంటి చైతన్య స్రవంతి నవలలు ఆరంభించిన సృజన 'నా కుటుంబం', 'ఉప్పెన' వంటి విప్లవ నవలల అనువాదం మాత్రమే కాకుండా 'కాలిమంటుకున్నది' వంటి కరీంనగర్ పోరాట ప్రతిఫలనాసాహిత్యాన్నికూడా ప్రచు

రించింది. నోటి పాటవలె వినడానికి నవలా రచన సాధ్యమేనా, ఒక నవల పోరాట ప్రజల మధ్యన చర్చింపబడి ఆ పాత్రలచేతనే రచింపబడడం సాధ్యమేనా, ప్రజలు తమ జీవన్మరణ పోరాటాన్ని సేదదీరేవేళ లేదా సేద్యం చేసేవేళ తామే సృజనాత్మక కళారూపాల్లో చదువుకుంటారా, అది ఆధునిక సాహిత్యరూపమైన నవలలో సాధ్యమేనా, వంటి ఎన్నో ప్రశ్నలను ఈ ప్రయోగం రేకెత్తించింది అన్నిటికన్నా ముఖ్యంగా, ప్రజల భాష మాండలికాల్లో తప్ప ప్రజాజీవితమూ పోరాటమూ సహజంగా చిత్రించబడవా అనే చర్చకూడా తీవ్రంగానే సాగింది. ఈ కాలంలోనే సృజన అల్లం వాసన వేస్తున్నదని, సృజన మాండలిక భాషాపత్రిక అయిపోయిందని, తెలంగాణా పత్రిక అయిపోయిందని అభిప్రాయాలు వచ్చాయి. ఈ అభిప్రాయాలకు పరిమితులూ వున్నాయి. ఈ అభిప్రాయాల్లో ప్రశంసా వుంది. ఏది సరిఐంది, ఏది కాదు అని కాకుండా విప్లవ సాంస్కృతికోద్యమం పరిష్కరించుకోవాల్సిన ఒక సమస్యను లేదా ఆవిష్కరించుకోవల్సిన ఒక వినూత్న అవసరాన్ని సృజన ప్రతిఫలించిందనేదే ఇక్కడ ప్రస్తుతం.

విప్లవ రచయితల సంఘం మార్క్సియన్ సోషలిజాన్ని శాస్త్రంగానేకాక శస్త్రంగా స్వీకరించి తన ప్రణాళికలో చేర్చుకొన వచ్చునా, అని సి.పి.ఐ., సి.పి.ఎమ్.ల నుంచి వచ్చిన విమర్శలకు జవాబుగా కొ. కు. కెవిఆర్‌లు ఇచ్చిన సమాధానాలు మొదలుకొని మార్క్సిజంపై ఆర్. ఎస్. సుదర్శనం, గుంటూరు శేషేంద్రశర్మ, ఏటుకూరి బలరామమూర్తి చేసిన వక్రీకరణలదాకా ఖండించి విరసం దృక్పథాన్ని విస్పష్టం చేసేపని త్రిపురనేని మధుసూదనరావు, బాలగోపాల్ వంటివాళ్ళు సృజన వేదికనుంచే నిర్వహించారు. కవిత్వం తర్వాత విరసం జెండాను సృజన సమున్నతంగా ఎగరేసింది సాహిత్య విమర్శ రంగంలోనే.

విప్లవోద్యమానికి సంబంధించిన ఉపరితల అంశాల పై విధ్యానికి సృజన తన పరిధిని విస్తరించాల్సి వచ్చింది. చరిత్ర, విద్య, కార్మికరంగం, జాతుల సమస్య, తత్వశాస్త్రం, ప్రజాతంత్ర ఉద్యమం - విరసం తన సాంస్కృతిక కార్యకలాపాలలో ఎన్ని రంగాలలో చొరవ చూపిందో సృజనకూడా అన్ని రంగాలకు విస్తరించింది. విరసం కార్యకలాపాల రిపోర్టులు, నివేదికలు, సమాచారం అందించడంలో ఒక్కొక్కసారి విరసం పత్రికలు ఎంబరాస్ అయి ఇబ్బందిపడేలా సృజన ఉత్సాహం చూపింది.

విరసంలో వచ్చిన ఒడుదొడుకులు విరసం వేసిన తప్పటడుగులు సృజనలో కూడా వచ్చాయి. సృజన కూడా వేసింది. విప్లవోద్యమంలోని ఆటుపోట్లకు విప్లవ సాహిత్య సాంస్కృతికోద్యమం అతీతంకానట్లే సృజన కూడా అతీతంకాదు.

వరంగల్‌లోనూ ఉత్తర తెలంగాణాలోనూ నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా నిండా నాలుగేళ్ళకాలం సృజన వెలువడలేదు! ఇరవై యేళ్ళ విరసం చరిత్ర ప్రగతికి సృజన నాలుగేళ్ళపాటు ఒక సృజనాత్మక సాక్షిగా నిలువలేకపోయింది. ఈ వెలితి సృజన సాంస్కృతిక ఆచరణలో ఒక అనివార్యమైన వెలితిగానే ఉండి పోతుంది. ఇరవై యేళ్ళ మహాసభలు జరుపుకుంటున్న విప్లవ రచయితల సంఘానికి ఆ జెండా నీడన ఎదిగిన సృజన విప్లవాభినందనలందిస్తూ పునరంకితమవుతున్నది.

ఈ నాలుగేళ్ళ కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో బీభత్సరాజ్యం అమలయింది. ఎందరెందరో పోరాటయోధులు, సామాన్య ప్రజలు నేలకొరిగారు మరెందరో ప్రజలు బాధలకూ, నిర్బంధాలకూ గురయ్యారు. కాని ఇవేవీ ప్రజల పోరాట పటిమను దెబ్బతీయలేదు. సరికదా, ఇవాళ నక్సల్బరీ పంథా ప్రత్యామ్నాయ ప్రజల రాజకీయ ప్రజా పంథాగా ప్రజల్లో విస్తృత ప్రచారాన్నీ ప్రాముఖ్యాన్నీ పొందింది. ఇదివరకెన్నడూ లేనంతగా అన్ని సెక్షన్ల ప్రజల జీవితాల్లో అవసరంగానూ అనివార్యంగానూ, నక్సల్బరీ రాజకీయాలు ఇంటింటా మాట్లాడుకొని చర్చించుకొని పట్టించుకొని, పాల్గొనే రాజకీయాలయిపోయాయి.

ఈ పోరాట సంస్కృతికి అగ్రభాగాన నిలచిన విరసం ఇవ్వాళ చేసుకునే ఇరవయ్యేళ్ళ సమీక్షలో సృజన తన సంఘీభావ హస్తాన్నందిస్తున్నది. విప్లవ సాంస్కృతికోద్యమంలో విరసం మరింత పదునెక్కి పనిచేస్తుందని ఆకాంక్షిస్తూ ఆ లక్ష్యం కోసం సాగే కార్యాచరణలో తన అండదండలనందిస్తున్నది.

విప్లవం వర్ధిల్లాలి !

విప్లవ రచయితల సంఘం వర్ధిల్లాలి !

1990-జనవరి 11 — సంపాదకుడు.

సృజనను ఆదరించండి

నాలుగు సంవత్సరాల పైగా నిర్బంధంనుండి విముక్తమై సృజన మళ్ళీ మీ ముందుకు వస్తున్నది. ఏ ఇతర ఆధునిక సాహిత్య పత్రికకంటే ఎక్కువగా సృజన తన ఆవిర్భావంనుండీ అనేక నిర్బంధాలకు లోనవుతూనే వచ్చింది. కొన్ని సృజన సంచికలను నిషేధించడం దగ్గరనుండి సంపాదకులమీద, సృజన రచయితలమీద, ప్రెస్‌మీద అరెస్టులు, సోదాలు, కేసులు, జైళ్ళు మొదలైన ఎన్నో రూపాలలో నిర్బంధాలు కొనసాగాయి. దేశమంతా చీకట్లో తారట్లాడిన చట్టబద్ధమైన ఎమర్జెన్సీలో సృజన ఇప్పటిలాగే నిలిచిపోయింది. అయితే ఇప్పుడు మన రాష్ట్రంలోని పోరాట ప్రాంతాలలో అమలవుతున్న అప్రకటిత ఎమర్జెన్సీ దాన్ని మించిపోయింది. అది చట్టబద్ధం కాకపోవడంలోనే దాని బీభత్సమంతా ఇమిడి ఉంది. చాపకింది నీరులా ఫాసిజాన్ని ప్రవేశపెట్టే ఈ విధానం భయంకరమయింది. చట్టం దృష్టిలో అంతా సజావుగానే ఉంటుంది. కాని మన నోరు నొక్కివేయబడి వుంటుంది. మనం కళ్ళ ముందు ఇనుపతెరలను దించుకోవాలి.

అందుకే గీతంలో ఎన్నడూలేనంత ఎక్కువకాలం సృజన మౌనం లోకూరుకు పోవలసి వచ్చింది. నాలుగు సంవత్సరాలకింద సృజన నిశ్శబ్దమైపోయిన పరిస్థితులు ఇంకా మరిచిపోయి ఉండకూడదు. ఉత్తరతెలంగాణాలో ఎన్‌కౌంటర్లు, చిత్రహింసలు ఇళ్ళకూల్చివేత నిరాఘాటంగా జరిగిన కాలమది. వరంగల్‌లో రాజ్యం నగ్నంగా తన విషపుకోరలను విప్పి పసిడి మనసును కాటువేసిన కాలమది. ఎన్నికలు అధికారానికి సోపానమైన వాడికి, మాటలు చిలుక పలుకులయిన వాడికి, ప్రజల హక్కులు కంటగింపయిన వాడికి ప్రజల హక్కులను నినదించే కంఠాన్ని ఉత్తరించవలసి వచ్చింది. నిర్బంధంవలెనే నగరమంతా విషాదం కమ్ముకున్నది. చీకటి రాక్షసి కరాళ నృత్యం ఆరంభించినవేళ ప్రజల సృజన మూగవోయింది. 'కళాకారుని' 'రాజ్యం' లో ఆధునిక సాహిత్యవేదికకు ఊపిరి సలపని పరిస్థితులు ఏర్పడ్డాయి.

అయితే సృజన మౌనం అనంతం కాదు. సృజన ఆవిర్భావమే సంచలనమైనది. శ్రామికవర్గ సాంస్కృతిక మహావిప్లవ నినాదంలో సృజన శబ్దించింది. కాలం తన మీద పెట్టిన బరువునూ, బాధ్యతనూ వినమ్రంగా మోసింది. నక్సల్బరీ వసంత మేఘ గర్జనతో చలించిన శ్రీకాకుళం మొదలుకొని పోటెత్తిన కరీంనగర్, ఆదిలాబాద్‌ల వరకు ప్రజల పోరాటాలతో సృజన అడుగులువేసింది.

ప్రజల పోరాటాలకు సృజన సాహిత్య సాంస్కృతిక ప్రతిఫలనం. నిన్నటి గతాన్నీ, నేటి వర్తమానాన్నీ, రేపటి భవిష్యత్తునూ అది సమాజపు నాడిని పట్టుకుని చెప్పింది. సృజన సాహిత్య సంస్కృతికి సామాజిక అధ్యయనం పునాది. గతి తార్కిక చారిత్రక ప్రాపంచిక దృక్పథం కంటి వెలుగు. గత రెండు దశాబ్దాలుగా సృజన ఈ పునాదిమీద నిలబడి తెలుగు సమాజపు ఉపరితలాన్నంతా తన కంటి వెలుగుతో స్పృశించింది. క్లిష్టమైన సామాజిక సమస్యల అవగాహనలో సృజన సూక్ష్మదర్శినిగానూ, దూరదర్శినిగానూ పనిచేసింది.

నాలుగు సంవత్సరాల దుర్భరమైన మౌనానికి చరమగీతం పాడుతూ సృజన గళం విప్పుతున్నది. సమకాలీన సాహిత్యంతో, సమాజంతో పెనవేసుకుని ముందుకు సాగడానికి సృజన పూనుకున్నది. నిర్మాణమవుతున్న చరిత్రను అక్షరీకరిస్తూ చరిత్ర నిర్మాణంలో పాలు పంచుకోవడానికి సృజన ప్రజల్లోకి వెళుతున్నది. సృజన లక్ష్యం ప్రజలు. సృజన గమ్యం ప్రజలు. సృజన ఎల్లప్పుడూ ప్రజలపైపున నిలిచింది సృజన ఎల్లప్పుడూ ప్రజల గుండెల్లో నిలిచింది.

ఆధునిక తెలుగుసాహిత్యానికి కొలమానం అయినట్లుగానే సృజన సమాజంలో ప్రజలమీద రాజ్యం ప్రయోగిస్తున్న హింసకు, నిర్బంధానికి గీటురాయి. రాజ్యం దన్నుతో ప్రజలమీద హింసాదౌర్జన్యాలు ప్రయోగించబడుతున్నట్లుగానే విప్లవ సాహిత్యంమీద, సాంస్కృతిక కళారూపాలమీదకూడ నిర్బంధం అమలవుతున్నది. వ్యాపారం లక్ష్యమైన సాహిత్యం వేస్తున్న వెర్రితలలన్నీ సినీతారల ముఖాల తొడుగులలో జిగేలు మంటున్నాయి. 'భవిష్యత్తు చిత్రపటం' మీద తెరలుదించిన రాజ్యం చీకటిలోకపు 'కామోత్సవాన్ని' తిలకిస్తున్నది. జననాట్య మండలి కాలి గజ్జెని చిదిమివేసి 'భారతి' ప్రజాదేవత'లను వ్యవస్థ ఊరేగిస్తున్నది.

సృజన మౌనం వహించడానికి ఏ దారుణ రాజ్యాంగ యంత్రపు హింస కారణమో, ఆ హింస కలిగించిన భీతావహ వాతావరణమే తెలుగునాట సాహిత్య, సాంస్కృతిక రంగాలలో అవాంఛనీయ ధోరణుల్ని పెరిగేలా చేసింది. సాహిత్య రంగంలో అస్పష్టతా వాదనలు, అనుభూతి వాదనలు, 'జాతీయ' వాదనలు, ఏవేవో పేర్లతో కొనసాగినప్పటికీ మొత్తంమీద ప్రజాజీవనాన్ని సాహిత్యం, సాంస్కృతిక రూపాలు ప్రతిఫలించనవసరం లేదనే ఒక దురభిప్రాయం వ్యాపించింది. సామాజిక జీవనంనుంచి పలాయనం, కీర్తికాంక్ష, మొదలయిన అపలక్షణాలు తలెత్తడం ప్రారంభమయింది.

రాడికల్ల బిడ్డలార

గద్దర్

వందనాలు వందనాలమ్మో మా బిడ్డలు
వీరులార వీరులార రాడికల్ల సూరులార
రాడికల్ల శూరులార రైతుకూలీల బిడ్డలార

ఒక్కరొక్కరు వొరిగిపోయి సుక్కలల్లో కలిసినారు
సుక్కలల్లో కలిసి మీరు సూర్యులయ్యి మొలిసినారు
ఏ దిక్కూ లేనోళ్ళకూ మా బిడ్డలు
మీరు దిక్కుసూపే సుక్క అయ్యింద్రా మా బిడ్డలు

కాపుకాపున కాకులరిసితె తలుపు తెరిసి పలుకరిస్తం
ఎప్పరొస్తరో చెప్పమాని తొవ్వ చూస్తూ నిలుచుంటం
మీరు కాకమ్మలయ్యి వొస్తారా మా బిడ్డలా
మా కడుపు తీపి తీర్చిపోతారా ,,

(మిగతా 3వ కవరులో)

సాంస్కృతిక రంగంలో గద్దర్‌ను, జననాట్యమండలి తదితర విప్లవ సంస్థలను అదృశ్యం చేసిన రాజ్యహింస అపసంస్కృతినీ, హీన సంస్కృతినీ ప్రజలమీద రుద్దేందుకు శాయశక్తులా ప్రయత్నించింది.

తన జీవితం మొత్తం లోనూ సాహిత్య కళా రంగాలలో ప్రజానిబద్ధతకోసం నిలబడిన సృజన ఈ అవాంఛనీయ వాతావరణంలో తన పాత్రను నిర్వహించలేక పోయింది. ఈ పరిస్థితే సృజన ఆవిర్భావాన్ని ఆకాంక్షిస్తున్నది.

ఈ పాలకవర్గ సంస్కృతిని నిలదీయడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలనే సంకల్పంతో సృజన ముందుకు వస్తున్నది. దేన్నయినా అంతిమంగా నిర్ణయించేది ప్రజలు, వారి పోరాటాలే. ప్రజా పోరాటాల పట్ల అచంచలమైన విశ్వాసంతో ముందుకు వస్తున్న సృజనను కంటికి రెప్పలా కాపాడవలసింది ప్రజలే.

—సాహితీ మిత్రులు.

ఉ సు రు

నందిని సిధారెడ్డి

ఇల్లు ఖాళీ చేసినంత సులభంగా
జీవితం ఖాళీ చెయ్యలేం కదా -

ఎంత భద్రంగా సర్దుకున్నప్పటికీ
ఏదో ఒకటి మరచిపోయినట్టు
గుర్తురాని ఏనుగు బొమ్మేదో వెంటాడుతుంది
దువ్వెనముక్కో
విరిగిన పెన్సిల్ ముక్కో
కొంతదూరం వెళ్ళాక గుర్తొస్తుంది
వదిలిపెట్టలేమూ
తెచ్చుకోనూలేం

ఆయినవాళ్ళంతా ఎవరి పనులమీద వాళ్లు వెళ్లిపోయినప్పుడు
గోడమీద ఊడిరాని మేకులా
తనొక్కతే మిగిలి పోయింది

ఇన్నాళ్ళూ మండీ మండీ
ఇవాళ బూడిదెత్తి అలుకు పిడుచెయ్యని పొయ్యిలా
ఆమె దిగాలుగా ఉండిపోయింది

ఒంటరి వంటిల్లు దుఃఖపెడుతున్నప్పుడు
కిటికీలోంచి దూకొచ్చిన ఊరపిచ్చుక
అందమైన ముక్కుతో పలకరించి సందడి సందడి చేసేది
ఇప్పుడదీ లేదు-
బతికుందో లేదో కూడా తెలియదు

2)

ఇల్లు ఖాళీచేసినంత సునాయాసంగా
జీవితం ఖాళీ చెయ్యలేం!

ఇల్లు ఖాళీ చేసినంత సుతారంగా
ఊరు కూడా ఖాళీ చెయ్యలేం !

పల్లెటూర్లో పచ్చటి బాల్యాన్ని
వీపులమీద ఆడించిన
వీథుల తాతయ్యల్ని ఖాళీ చెయ్యలేం
తీరొక్క ఆటలు నేర్పి
తీయని పండ్లొలిచిపెట్టిన
మూడుగుండ్లకాడి మర్రిచెట్టును ఖాళీ చెయ్యటం కష్టం !

కళ్లముందు కలల బతుకమ్మలు పేర్చే
పూలతోటలు ఖాళీచెయ్యటం కష్టం

అన్నిటికంటే
అన్నీ అయి
తలచిక్కులు తీసిన
అమ్మఒడి ఖాళీచెయ్యటమంటే
సన్నటి గునపంతో గుండెను తొవ్వుతున్నట్టుంటుంది

నేరమూ ఉండదు
నెత్తురూ మిగలదు

అప్పుడప్పుడు కుర్రాళ్లు ఊళ్లు ఖాళీ చేస్తుంటారు
బూట్లు టకటక లాడించుకుంటూ
ఖాళీ గుర్రాలొచ్చినప్పుడల్లా
ఊళ్లు ఖాళీచెయ్యటం వాళ్లకు తప్పనిసరైంది
జీవితం ఖాళీ చేయిస్తామన్నప్పుడల్లా
రోజులకు రోజులు ఊళ్లు ఖాళీచెయ్యటం వాళ్లకు తప్పనిసరైంది

చీకటి పడేవేళ
తలుపుమీద లాఠీతో దబదబా బాదిన చప్పుడైతే
తలెల అన్నం వదిలిపెట్టి
పరిగెత్తటం కుర్రాళ్లందరికీ అలవాటే
నిద్రలోంచి ఉలిక్కిపడిలేచి
దౌడు తీయటం వాళ్లందరికీ అలవాటే

మంచమ్మీంచి లెవ్వలేని ముసలమ్మలకే కష్టం !
లాఠీలు ఊపుకుంటూ లోపలికొచ్చినప్పుడే
ప్రాణాలు పోతాయి
బాలింత తల్లుల మానాలు పోతాయి
కేరుతున్న తల్లిలేని కోడిపిల్లల్ని
మాంసం ముక్కల కింద కోసుకెళ్లటం పోలీసులకలవాటే

రంగులేసిన కడ మీద
రామచిలుకలు కిలకిలలాడ్తుంటే
ముక్కులు ఎర్రగా ఉన్నాయని
చెక్కి ఇంటరాగేషన్‌కి తీసుకెళ్లటం పోలీసోళ్లకలవాటే

ఊడ్చి సాన్పు జల్లిన
వాకిళ్లలోని ముగ్గుల్ని కత్తిరించి
వ్యాన్‌లో వేసుకెళ్లటం పోలీసుల కలవాటే

పోలీసులొచ్చి వెళ్లిన ఇల్లు – ఇకంతే!
మనిల్లు మనమే పోల్చుకోలేం
పోలీసులొచ్చి వెళ్లిన ఇల్లు
కలప నరక్కుపోయినాంక
చెట్లు పారిపోయిన అడవిలాగుంటుంది

పోలీసులొచ్చి వెళ్లిన ఇల్లు
ఎండాకాలం పూట

చేపలు పట్టినప్పటి చెరువుని తలపిస్తుంది
పోలీసులొచ్చి వెళ్లిన ఇల్లు
లేగదూడ నెడబాసిన ముసలి ఆవు కనుగుడ్డులా
కలతపడుతుంది

ఎడ్లు వెళ్లిపోయిన దొడ్డిలా ఎలితి పడుతుంది

పోలీసులొచ్చిన ఊళ్లో
ఆకాశమ్మీది చంద్రుడుకూడా
హఠాత్తుగా మాయమవుతాడు
పూలమేఘాలు దళాల్ని రాలి
ఏమూలో దాక్కుంటాయి
గాల్లో తేలి వచ్చే కోయిలపాట
చెట్టు తొర్రలో దూరుతుంది

ఎక్కడా ఏమీ మిగలదు
ఎవరైనా ఎంత బాధయినా
ఇగం పట్టించే డిసెంబర్ చలిరాత్రులయినా
ఉన్న ఫలాన ఊరు ఖాళీ చెయ్యాల్సిందే—
ఊరడించటానికి ఊరపిచ్చుకారాదు
చెట్టంత కొడుకూ రాడు

ఎన్ని రోజులయినా తల్లి దుఃఖం వొడవదు

ఇల్లు ఖాళీచేసి, ఊరు ఖాళీ చేసి
అడవులపాలైన ఆ కుర్రాళ్ల
ముసలి తల్లుల ఉసురు ఊరకేపోదు
ముసలి అవ్వల ఉసురు ఊరకేపోదు

తల్లి తల్లినే వర్షిస్తుంది!

కె. శివా రెడ్డి

రెండు చేతుల్తో దీపాన్ని రక్షించుకున్నట్టు
ఆ తల్లి ఆ పిల్లని పదిలంగా కాపాడుకుంటుంది.
ఎగిరిపోబోయే గాలిని ఎలాగైనా బంధించాలని ఆమె తాపత్రయం.
ఏ నయంకాని జబ్బో దుష్టరాజకీయంలా ఆ పిల్లని పట్టుకుని వుంటుంది
బహుముఖంగా పక్షులగుంపులా పస్వారాల్సిన ఆ పిల్ల శరీరం
ఇంతై, చీడపట్టిన మొగ్గై, చీకటిమొక్కై క్రమంగా కుంచించుకుపోతోంది.
కన్నతల్లికదా, నవమాసాలు మోసిన ప్రేమకదా
నిర్దాక్షిణ్యంగా నిర్బధ్యతగా ఎక్కడైనా ఎల్లా పారేస్తుంది?

ఆ తల్లి ముఖం చూడండి, ఎంత దయ, ఎంత ప్రేమ
ఎన్ని కష్టాలయినా ఎంత దుఃఖాన్నయినా లోనే అదిమిపెట్టి
శరీరం మొత్తాన్ని ఒక కారుణ్యం చేసి, ఒక లాలిత్యం చేసి
మహామృదువైన పడకచేసి, రెక్కలొచ్చీ రెక్కలురాని ఆ చిట్టితల్లి కోసం
తనో గూడు - అన్ని గాడ్పుల్నీ. అన్ని రుతువుల్నీ, మార్పుల్నీ, తట్టుకుని నిలబడే
గూడు—

గూడులేని పిల్లలకి తల్లే గూటివిలువ
రక్షించే చేతుల్లేని అనాథలకి తల్లే చేతుల వెచ్చదనం—
ఏ సందర్భంలోనైనా ఎవరయినా యిలా కని అలా ఎలా పారేస్తారో అర్థంకాదు
తన్లోంచి పొడుచుకొచ్చి, తన కలల పొడిగింపైన సంతానంకోసం
సమస్త ప్రపంచాన్నీ దాని విలువల్నీ ధిక్కరించి పోరాడాల్సిన తల్లి ధర్మం వుందికదా

ఆమె ఆదికదా—అన్నింటికంటే గొప్పదైన తల్లికదా
మనకి దొరికిన తొలి స్పర్శ ఆమేకదా — మన నోట్లో
తొలిదొల్త ఇన్ని అమృత బిందువుల్ని చిలికింది ఆమెకదా—
ఆమె ద్వారానే ప్రపంచాన్ని కనటం, వినటం నేర్చుకున్నాం

బహుశ ఆమెనుంచే మనల్ని మనం మఱచుకోవటం ప్రారంభించిందీ-
లోకాన్ని ముట్టుకోవటం, అనుభవించటం, అర్థం చేసుకోవటం ఆమెతోనే మొద
లెట్టాం గదా

సమస్తాన్ని ధిక్కరించే హక్కువున్న తల్లికదా
సమస్తానికీ మూలమైన అంశకదా — భూమికదా
రేపు మనం చనిపోయినప్పుడు మన ముఖాలమీద
ఇంత మట్టె రాలిపడే అమ్మకదా - సర్వప్రకృతిలోవి
మృదుత్వాన్ని, కాఠిన్యాన్ని ధరించిన తల్లికదా - మనందరి అమ్మకదా
అందుకే రెండు చేతులడ్డుపెట్టి పోయే ప్రాణాన్ని కూడా కాపాడాలని
చీరకొంగు తెరడిగేసి ఏ విషపాశాన్నీ దరికిరానీకుండా—
అన్ని అబద్ధాల మధ్య బహుశ ఒకే ఒక్క నిజం ఆమె
జన్మ జన్మల సౌరభాన్ని మోసుకొచ్చిన మట్టి ఆమె
ప్రవహించే స్మృతుల నదిలో ప్రాణప్రదమైన జలం ఆమె
ఆమె చేతుల్లో పండిపోయినా, ఎండిపోయినా, రాలిపోయినా గొప్ప భాగ్యమే కదా.

నా ఎదురుగ్గా ఆ తల్లి
కృశించిన ఆ పిల్ల శరీరాన్ని పళ్ళో పెట్టుకుని ప్రమిదలా
అప్రమత్తంగా జీవన కారుణ్యాన్ని వర్షిస్తూ.

డాక్టర్, ఏమమ్మల్ని వాళ్ళు వైద్యం చేయనివ్వలేదంతే!

సుధాకిరణ్

రాత్రి
కొంతవెన్నెల్లో
కొంత వెన్నెల సోకని చీకట్లో
మరికొంత కరెంటు స్తంభాలకి వురితీసిన దీపాల వెలుతురులో
నగరం తగలబడిపోతూ పెగ తగులుతున్నట్లు—

గాలి
నెత్తుటి చారికలని ఒరుసుకొని
వస్తున్నట్లు కరుకుగా, గరుకుగా —
వెన్నెల
రాత్రి పావాలకు దెబ్బతగిలి చీము పట్టినట్లు —
వైద్యం కావాలి ఒక వైద్యుడు కావాలి
అడవుల కురిసిన వెన్నెల ఇక్కడ లేదుకదా —
అడవులు కదిలివస్తున్న దృశ్యం ఇంకా కనిపించడం లేదుకదా —

అడవి అమృతహస్త స్పర్శ చల్లదనపు వైద్యం కావాలి

* * *

డాక్టర్ మీరొచ్చి తలుపు తట్టారు —
కిట్ సర్దుకొని మీరొచ్చి చల్లగా నవ్వేరు
దిగాలుగా మొఖం వేలాడేసుకొన్న
రోగిష్టి ఆకాశానికి
సూర్యుణ్ణి మీరొక మందుబిళ్ళని చేశారు —
చంద్రుణ్ణి ఒక సెలైన్ బాటిల్ చేశారు —
డాక్టర్ మీరొచ్చి పలకరించారు

వసిపిల్లల నవ్వును దోచిన
రాక్షసత్వానికి ప్రశ్నలు వేశారు-
పసిపిల్లల రోగాలనే కాదు
వాళ్ళ బాల్యాన్నొక గాయం చేసిన
వాళ్ళ బాల్యాన్నే ఒక వ్యాధి చేసిన
ఒక వూడలు దిగిన మర్రిచెట్టును మీరుచూపారు

ఆస్పత్రి బయటే జరగాల్సిన ఆపరేషన్‌కు
మీరు థియేటర్ని సిద్ధం చేశారు—
మీరొక కూలిపోయిన గుడిసెని పలకరించేవారు —

మీరొక రాలిపోయిన ఆశని ఓదార్చేవారు —
డాక్టర్ మీరొక పచ్చినెత్తుటి హత్యను ఖండించేవారు —

* * *

డాక్టర్ వాళ్ళొచ్చారు
డాక్టర్ వాళ్ళొక మూకతో వచ్చేశారు
వాళ్ళొచ్చి అద్దాలు పగలగొట్టారు-
పక్క టెముకల మీద ఎక్కి తొక్కి
బూటుకాళ్ళతో అడుగులేస్తూ వాళ్ళొచ్చారు —

డాక్టర్
చంకలో పిల్లాడి గురించి ఆందోళనతో
అర్థించే చేతుల్తో రాలేదు వాళ్ళు
నయమైపోయి కృతజ్ఞతతోనో
ఫీజు ఇచ్చుకోలేని అభ్యర్థనతోనో రాలేదు వాళ్ళు —

వాళ్ళు ఆయుధాలతో వచ్చారు ఆసుపత్రిలోకి
విషపు కత్తులతో నెత్తురంటిన చేతులతో వచ్చారు-
డాక్టర్ వాళ్ళు ఏడుస్తూనో సంతోషంతోనో మనుషుల్లాగా రాలేదు-
కసితో బుస కొడుతూ పాముల్లాగా వచ్చారు —

* * *

డాక్టర్ వాళ్ళు వ్యాధిని నయంచేసే
మీ వూపిరి పూవుని తెంపి చిదిమేసి వెళ్ళిపోయారు —
అద్దాలు పగలగొట్టి మందులని చెదరగొట్టి
గుండెచప్పుళ్ళు విననీకుండా స్టెత్‌ని తెంపేసి వెళ్ళారు
డాక్టర్ వాళ్ళు పగిలి ముక్కలైన
అద్దాలమీద మీనెత్తుర్ని చల్లి ఆపరేషన్ థియేటర్ని ధ్వంసం చేశారు.

* * *

ఇంతా చేసి
వాళ్ళు తమ వ్యాధిని కప్పిపుచ్చుకోలేక పోయారు
వాళ్ళు చేయగలిగిందల్లా
డాక్టర్- వాళ్ళు మిమ్మల్ని వైద్యం చేయనియలేదంతే

స్వర్ణలత కోసం......

ఎ వు అ

చీకటి వనము నడుగుదునా
చినబోయిన జాబిలి నడుగుదునా?
క్రుంగిన నింగి నడుగుదునా
బండబారిన కొండల గుండెల నడుగుదునా.

చెల్లెలా! ఓ చెల్లెలా!
నీవెక్కడ తల్లీ!
గలగలల సెలయేటి నడుగుదునా
కొమ్మపై కూయు కోయిలమ్మ నడుగుదునా
రివ్వున వీచు గాలినడుగుదునా
ఘోరుమన్న కడలి హోరు నడుగుదునా?

చెల్లెలా! ఓ చెల్లెలా!
నీ పాట ఎక్కడమ్మా?
సన్నజాజివో సుకుమారివో
అబలవో, ఆడుదానివో
శతృవులెవ్వరేమందురో మరి-

పిడికిలెత్తిన దానా
ఎర్రజెండా నిలిపినదానా
తెగువ జూపిన దానా
తుదిపోరు నడిపినదానా
ఉద్యమాన విరిసిన
స్వర్ణమా!

వెలలేని త్యాగాల నక్షత్రమా
మనిషీ! ఓ కామ్రేడా!
నీవులేని దెక్కడమ్మా!
నిన్ను తలపోయని దెక్కడ!

నీపాట పరుగులిడని దెక్కడ
నీ గానం అనితరం
అడవి చెట్లను మీటి
రణన్నినాదమై మ్రోగు
బావుటాయై బాటచూపుచు
గుండె గుండెను తట్టిలేపుచు

చెల్లెలా! ఓ చెల్లెలా!
నీవు వినిపించని దెక్కడ తల్లీ
లలితవో, పద్మవో, పంచాది నిర్మలవో
జ్యోతివోలె వెలిగిన దానవో
ఈ నాడిక
నీ అడుగుల వాడి వారవడియగు

చెల్లెలా! ఓ చెల్లెలా!
కన్నీట నీరూపు చెదర
కనుల కుడుచుకు నిను నిలుపుకుందు
కొసరాని నిన్నిక పోడుదారిన చూతు.

ఏడాదికొకరోజు

కృష్ణారావు

ఏడాది ఏడాదికీ
ఒకరోజు లోలోపలిదారుల్లో
మారుమూల
ఒక మూలుగు వినిపిస్తుంది.
ఆకాల శిశిరం ఒక శిరస్సును
టపీమని రాలుస్తుంది.

ఏడాదికొక రోజు
వనవాసం నుంచి
అజ్ఞాత జ్ఞాపకం ఒకటి
గాయం చేస్తూ
సైగల్ పాటలా తొలుచుకువస్తుంది

ఏడాదికొక రోజు
పల్లెటూళ్ళో కాలం చేసిన
నా బాల్యం గుర్తుకొస్తుంది
చెరువు దగ్గర తారట్లాడుతున్న
నా ఆత్మ నను
పరిహాసం చేసి వెళ్ళిపోతుంటుంది.

ఏడాదికొక రోజు
అమ్మ పిలుపు వినపడుతుంది
గడ్డకట్టిన నా అహంకారపు
నెత్తురును తుడిచేసి
బొడ్డుపేగుతో నన్ను
మళ్ళీ గర్భాశయంలోకి లాక్కుంటుంది.

ఏడాదికొక రోజు
అమరుడైన నా మిత్రుడి స్మృతి
నా చీకటి కవాటంలో
వెలుగు పుంజాల్ని చిమ్ముతుంది

అపుడు
ఏడాది ఏడాదికీ
ఒకరోజు నాకు కొత్తప్రాణం వస్తుంది
అన్ని గేట్లూ తెరుచుకొని
ప్రాణం ప్రవాహమై
నిర్జీవాన్ని కడిగేస్తుంది.

ఏడాది ఏడాదికీ
నేను వినూత్న మానవుడినై
మానవత్వ నవత్వంతో ప్రకాశిస్తాను
అమరత్వం సందేశాన్నందుకొని
నలంద్ర సంగీతం పాడుతూ
ఉదయ రాగ చంద్రికలు వెదజల్లుతాను.

ప్రేమనగర్

వరవరరావు

ఎవరూ మనల్ని విడదీయలేరు
ఎవరూ మనల్ని విడదీయలేరు

మనమేమిటి మనిషీ మట్టీ
మనమేమిటి మనమూ జనమూ
మన యిద్దరిలో నువు తోటవైతే నేను మారుతాన్ని
నువు కోట వైతే నేను కేతనాన్ని
నువు నగరానివైతే నేను నీ నరాన్ని నీ నగారాను
ఇపుడు ప్రవాసంలో సొంపకుండావున్న నీ గరమ్‌హవాను

మనకయిన స్నేహగాయాల్ని
వియోగంలో గేయాలుగా (కా)పాడుకుంటున్న ఏకశిలాశకలాన్ని
నాకు చదువు నేర్పుతూ నా దగ్గర చదువుకున్న నగరమా
నాకు మాటనేర్పుతూ నా మాటల్ని నలుదిక్కుల వినిపించిన నగరమా

నాకు పాట నేర్పుతూ నా బాటపై సాగిన నగరమా
నన్ను ప్రేమించి నా ప్రేమలో తూగిన నగరమా
ఓ నా వరమా శాపమా ఓ మై ఫస్టలవ్
ఓ మై పారడైజ్ లాస్ట్........ మళ్ళీ నినునే పొందగలనా

కన్నతల్లితోనూ పుట్టిన ప్రూళ్ళోనూ
నాతిచరామి అని ఒప్పుకొని చేసుకున్న సహచరితోనూ

కన్నబిడ్డలతోనూ
నీతో గడిపినంత కాలం గడపలేదు
నా రక్తంలో ప్రవహించేవి నీ నీళ్ళు
నాకు నీ నీళ్ళు ఒంటినవి
నా శ్వాసలో స్పందించేది నీ గాలి

నాకింకే గాలీ పడదు
నా అన్నంలోని ప్రతి గింజా నీ ఒడిలోదే
నా తిండీ తిప్పలూ నువ్వే
నా బండికి కందెన నువ్వే

బెజవాడ సైడు మా చిన్నమ్మ చెప్పినట్లు
నువ్వు మా వైపు తెలంగాణావు
మనం చెప్పుకొంటున్నట్లు ఉత్తర తెలంగాణా పోరాటానివి
ఇప్పుడు నాకు ఊహలో గూడు కట్టిన ఆకారానివి

మన ప్రజలు ఉద్యమాలై ఊరేగితే
మనం చెయ్యీ చెయ్యీ కలిపి నడిచిన రోజులు
మన జనం త్యాగాల దారిలో
మన కన్నీటితో పూలు కడిగిన తోవలు
మన సాహసాలు కథలు కథలుగా
మనమే విని పులకించిన వేళలు

ఇవ్వాళ నీ గురించి ఏం విన్నా
విన్న మనం రాసుకొన్న డైరీ హృదయాన్ని తీసి
అరచేతిలో పెట్టుకొని
ఆలకించినట్లుగా ఉంటుంది

మన చరిత్ర నువు చెప్తుంటే
నీ జ్ఞాపకాలపై మనసు పెట్టి వింటున్నట్లుగా వుంటుంది
మన పనులు చేస్తూ నువు కదులుతుంటే
నీ కాళ్ళల్లోనే నేను నడుస్తున్నట్లుగా వుంటుంది

నీ పయనం ఆగదుగానీ
ఒకసారి తల తిప్పి ఇటు చూడకుండానే
నను పిలవవూ
నాకు ఊపిరి పోసి నా ఊపిరితో రగిలిన పిలుపు
నన్ను ఊపిరి సలపనీని పిలుపు !

నేలతల్లి ఒడిలో రామనాథం

చైతన్య

రింగు జానో ఒళ్ళో - నాయన్నలారా !
శంబుదానా ఒళ్ళో - నాయక్కలారా !
మండేటి ఎండలున్న - మబ్బుల్ల నీడో
ఆడిన చిట్టితల్లి - అలసిపోయిందో
చల్లని తల్లిఒడిన - కునుకుతీసింది
కునుకులో చిట్టితల్లి - ఉలికి పడ్డాదో
కలవరింతాల తోని - గడ బిడ చేసే
డాక్టరూ రామ నాథం - దండివాడనో
దావ ఖానకు బోతే - తాళాలు తల్లో ॥ రింగుజానా ॥

ముసిరేటి మబ్బుల్లు - ముంచుకరాగా
కుండలతో కుమ్మరించి - పోయిందివానా
వానల్లో తడిసినా - బంగారుబాబూ
మూసిన కన్నులూ - తెరవదేమమ్మా
డాక్టరూ రామనాథం - దండివాడనో
దావ ఖానకు పోతే - తాళాలు తల్లో ॥ రింగుజానా ॥

కుస కుస దగ్గుతో - కునుకు తియ్యాడు
పాలన్న తాగాడూ - బంగారు తండ్రి
పిడికిల్లు బిగపట్టి - బిగిసిపోతాడే

ఆటలాడే బాబు - వాడిరిపోయాడే
డాక్టరూ రామనాథం - దం వాడనో
దావఖానకు పోతే - తాళాం తల్లో ॥ రింగుజానా ॥

ఎందుకో ఏడుస్తాడు - ఊరుకోడమ్మా
చంకలో నిలవడూ - గుక్కపట్టేడూ
ఉగ్గు పెట్టిన గాని - కక్కుతున్నాడు
పక్కంతా తడిపేసి - పారుతున్నాడు
డాక్టరూ రామనాథం - దండివాడనో
దావ ఖానకు పోతే - తాళా ల్లో ॥ రింగుజానా ॥

నోరన్న విప్పరాదే - నా తల్లి నువ్వు
మారన్న పలకవే - మా అక్క నీవు
డాక్టరూ రామనాథం - ఏడబోయిందే ॥రింగుజానా ॥

పిల్లల్ల పిల్లడు — పసిపిల్లకమ్మా
నవ్వుల ఆ బాబు - నాకు తెలుసమ్మ
ఇకనుంచి ఆ బాబు - మనకు లేడమ్మ
పువ్వుల దండాలు - పొడిగిన వేళ
కన్నీరు వరదలై — పారిన వేళ
చల్లని చూపుల్ల - దయగల్లవాడు
తెల్లని నవ్వులు - తెలిసినవాడు
పిల్లల డాక్టరూ - మా రామనాథం
దావఖానమూసి - ఏడబోయిందే ॥ రింగుజానా ॥

ప్రాణాలు కాపాడు - మా డాక్టరమ్మ
పగవారినేమన్న - మాటలన్నాడా
పాలకులకేమన్న - కీడుజేసిండా
పేదోల్ల కడుపుల్ల - చిచ్చురేపిండ్లు
పిల్లల బతుకుల్ల - మన్నుబోసిండ్లు

తూటాలు గుప్పించి - తప్పుకున్నారు
నేల ఒడిలో తండ్రి - తూలిపడ్డాడు
కాలమే చెప్పాలి - ఈ కథనంతా
కసాయి నాజీల - గురుతులనుండి
రింగుజానా ఒళ్ళో - నాయన్నలారా
నేలతల్లి ఒళ్ళో - నా తండ్రి రామనాథం.....

పంజాబీ కవిత

ప్రమాదకరం

అవతార్ సింగ్ పాష్

శ్రమ ఫలితం దోపిడవడం
ఏ మంత ప్రమాదకరం కాదు

పోలీసు వా దెబ్బ
ఏమంత ప్రమాదకరం కాదు

దురాశ సిండిన దురాగతం వల్లకూడా
అంత ప్రమాదమేమీ లేదు

ఉన్నట్టుండి మనిషిని ఎత్తుకు పోవడం తప్పే
నిరాశామయ విశ్శబ్దం లో బంధించడం అన్యాయమే
అయినా అవేవీ అంత ప్రమాదకరం కాదు

కపటత్వపు హోరులో పడి
నిజాలు నలిగి పోవడం
దీపాన్ని ప్రేమించి
పురుగు ఆహుతై పోవడం
వేళ్ళ సందుల్లోంచి
కాలం జారి పోవడం
అన్నీ అన్నీ భయంకరమే
కానీ ఇవేవీ అన్నిటి కంటె ప్రమాదకరం కావు

శ్మశాన శాంతితో నిండిపోవడం
అన్నిటికన్నా ప్రమాదకరం

ఆందోళనను సహనం మింగేయడం
ఇంటి నుంచి పనికీ
పని నుంచి ఇంటికీ
గానుగెద్దులా తిరగడం
అన్నిటికన్నా ప్రమాదకరం

మన కలలు చనిపోవడం
అన్నిటి కన్నా ప్రమాదకరం

మీ చేతి మీద ఆడుతూనే
మీ కళ్ళకు మాత్రం ఆగిపోయిన
ఆ గడియారం చాల ప్రమాదకరం

అన్నీ చూస్తూనే నిశ్చలంగా
మంచు గడ్డగా మారిన మీ కళ్ళు
అన్నిటి కన్నా ప్రమాదకరం
ఆ చూపు ప్రపంచాన్ని ప్రేమతో ముద్దాడడం
మరచి పోతుంది

చుట్టూ ఆవరించిన అంధకారంలో ఒదిగిపోయి
రోజువారీ పనుల్ని అలవాటుగా మింగుతూ
లక్ష్యం లేని తలకిందుల మార్గంలో మాయమైపోతుంది

భయానక హత్యాకాండ తర్వాత
దోసిపోయిన వాకిళ్ళలో పరచుకుని
మీ కంట్లో కారం జల్లిపోయే
ఆ వాటిల్లి కూడ అత్యంత ప్రమాదకరం

మీ చెపులదాకా రావడానికి
ఎన్నో హంగులు చేసుకుని
శత్రువు వాకిట ఎల్లప్పుడు గూండాలా
పహరా కాసే ఆ పాట
అన్నిటి కన్నా ప్రమాదకరం

సూర్యుడి లాంటి ఆత్మ
అస్తమించే ఆ దిశ
అన్నిటి కన్నా ప్రమాదకరం
అస్తమించిన నీ ఆత్మ
మృత్యువుతో నిండిన ఎండలా
నీ శరీరాన్ని తూర్పును ని గాయపరుస్తుంది

శ్రమఫలితం దోపిడవడం ఏమంత ప్రమాదకరం కాదు
పోలీసువాడి దెబ్బ ఏమంత ప్రమాదకరం కాదు
దురాశ దురాగతం ఏ మంత ప్రమాదకరం కాదు

* [అను : అనురాధ]

[1967 నుంచీ కవిత్వం రాస్తూ వస్తున్న పంజాబీ విప్లవ కవి అవతార్ సింగ్ పాష్‌ను ఖలిస్తాన్ వాదులు 1988 మార్చ్ 23న కాల్చి చంపేసారు. ఆయన మరణానికి ముందు రాసిన అసంపూర్ణ కవిత ఇది. ఆయన గురించి 1972 సృజనలో రాసిన వాక్యాలను కూడ పునర్ముద్రిస్తున్నాం. 'పంజాబీ కవిత్వంలో కొత్తధోరణులు.' శీర్షికతో ఫ్రాంటియర్‌లో జగతార్ రాసిన వ్యాసాన్ని అప్పుడు కె. రమీబాబు అనువదించారు.

"కత్తులతో నిండిన కఠినారణ్యాలు దాటి వచ్చినకవి పాష్. పంజాబీ కవిత్వ రంగంలో పేర్కొనిన సంప్రదాయాన్ని విచ్ఛిన్నం చేసిన ప్రథమకవి ఇతను రాజకీయ కవిత రాయడంలో తనదంటూ ఒక శైలిని రూపొందించుకున్నాడు. దోపిడీవర్గాల పతనమౌతున్న సంస్కృతికి చెందిన చెత్తకుండీలను నాశనం చేయడం అవసరమంటాడీయన. ఆత్మ స్థైర్యం, ఆత్మత్యాగంకు చెందిన బలమైన భావచిత్రణ ఇతని కవిత్వంనిండా కనబడ్తాయి. ఇతని తొలి కవితలో వివిధ

కథ :

గొడుగు

పి. మురళీధర్

ఉదయం ఎనిమిదిగంటలౌతున్నది. అప్పటిదాకా ఎండకాసి అప్పటికప్పుడే మేఘాలు కమ్ముకొని కుండపోతగా వర్షం కురవ నారంభించింది. క్వార్టర్ మీది సిమెంటు రేకులు వర్షానికి ధనధనలాడుతున్నాయి. క్వార్టర్ల ముందు నీళ్లు బొలబొల పారుతున్నాయి.

సాంస్కృతిక శక్తులకు చెంది నూతన, అర్థాలను స్ఫురింపజేసే పదాలను సృష్టించడం చేత యితని భావచిత్రణకు స్తబ్ధత, క్లిష్టత యేర్పడింది. కాని ఇటీవలి కవితల్లో ఈ అలవాటు నుంచి తప్పించుకొని చాల సులభశైలిలో పాఠకునికి తేలికగా అర్థమయ్యేట్లు రాస్తున్నాడు వర్గ విద్వేషంతో కళ్ళు మూసుకొనిపోయి కొత్త సత్యాల నంగీకరించక పోవడం అణచేవర్గాలవారి సహజగుణం.

మీరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా సత్యం సత్యమే !
సత్యం - జనజీవిత కాలమంతా బాధామయంగా గడిచింది;

ప్రతి సత్యమూ - ఒక బాధామయ జీవిత కాలం పిమ్మట
ఒక నూతన యుగంగా మారుతుంది
ఈ నూతన యుగం
పొలాలనూ, ఫ్యాక్టరీలను కౌగిలించుకోడమే గాక
మిలటరీ ట్రూప్స్‌ను గూడా ప్రభావితం చేస్తుంది.
రేపు
ఈ యుగం
ఎర్రకోటపై కిరీటం ధరించి
కాలంయొక్క శాల్యూట్‌ను అందుకుంటుంది.
అప్పుడు
మీకు సత్యం అంటే సరియైన అర్థం తెలుస్తుంది.

(సృజన- 39-డిసెంబర్, 72)

శ్యామల ఆడపిల్లలిద్దరికి జడలు వేసి దువ్వెన నెత్తిలో వెంట్రుకలకు చెక్కు-కొని గడప దగ్గరికొచ్చి ఆకాశంలోకి చూసింది.

అప్పటికే తయారైన కొడుకు శ్రీకాంత్ లెదర్ బూట్లు డోరీలు కట్టుకొని పుస్తకాల బ్యాగు వెన్నుకు తగిలించుకున్నాడు.

"మమ్మీ నా పుస్తకాలు తడిసిపోతయి." అన్నాడు ఏడుపు గొంతుతో—

"కాసేపాగరాదుర వాన వెల్సినంక పోరాద?" శ్యామల వాన వెలవదని తెలిసి కూడా.

"ఫస్టుబెల్లయిపోతది సిస్టర్ కొడతది." తపత బూటుకాళ్ల నేలకేసి బాదుతూ

"మరినేనేం జెయ్యాలే-వానల తడిసిపో" శ్యామల కోపంగా.

శ్రీకాంత్ వానలో తడవడానికి సిద్ధపడ్డాడు.

"ఆగురా! ఆబూట్లు వానల తడుస్తే ఏడికాడికి ఊసిపోతయి. అయింక బూట్లు బూట్లవి ఏడిస్తే మీ అయ్యరంతడు" అన్నది.

ఇద్దరు ఆడపిల్లలు కూడా తయారై సిద్ధంగా ఉన్నారు.

శ్యామల కోపంగా అడుగులు నేలమీద గుద్దుతూ బెడ్‌రూంలోకి వచ్చింది. శ్యామల భర్త కిష్టయ్య రాత్రి బదిలీకి (షిఫ్టుకు) పోయివచ్చి డ్యూటీ బట్టలు విడువకుండానే మంచం మీద అడ్డదిడ్డంగా పడి నిదురపోతున్నాడు.

"శద్దర్లన్ని సత్తెనాశనం. సాతర్లాన్ని నేమున్నగదా! పండెటోడు డ్యూటీ బట్టలన్న విడిచిపండడు. ఎవలుజేత్తలేరు డూటీ ఈనేజేత్తండు మాదంచి డూటీ- ఆవ కగ్గిదగ్గ పిల్లలు స్కూలుకు పోయేటప్పుడే అందుకుంటది పగబట్టినట్టు చెత్రీలు కొనవయ్యా అని కాలం పూరైన దగ్గరినుంచి మొత్తుకుంటున్న బోనస్ రానియ్యానే, జీతం రానియ్యానె—ఆఖరుకు కాలం బోయిందిగదా వచ్చేయేడు కొంటననే—అన్నిటికిలేకిడే- ఇసొంటోడు ఇంగ్లీషు మీడియమంట సదిల్నివియ్యవట్టె" శ్యామల గులుగుతూ మంచం కింద వెతికింది.

మూడుచెత్రీలు తీసుకొని పిల్లలదగ్గరికి వచ్చింది మూడు గొడుగుల్లో ఒకదానికి మధ్యలో చిరిగింది. ఇంకోదానికి పుల్లలు విరిగాయి. ఇంకొకటి మధ్యలో తీగ విరిగిపోయింది. మూడు గొడుగులు విప్పితీసి చూసింది ఏది పనికొచ్చేలాగునలేదు.

ఏమిచేయాలో పాలుపోక బజార్లోకి చూస్తూ నిలుచున్నది.

వర్షం కుండపోతగా కురుస్తూనే ఉన్నది. పక్క క్వార్టర్‌లోని ఏజంటు మేనేజరు ఆఫీసులో పనిచేసే క్లర్కు పిల్లలు రంగురంగుల గొడుగులు పట్టుకొని నీళ్లను చిమ్ముకుంటూ వెళ్లుతూ 'శ్రీకాంత్ నువ్వు స్కూలుకు రావా?" అని అడిగారు.

శ్యామలకు కోపం నపాలానికెక్కింది.

ఆపక్క ఇంట్లోని సర్దార్ (చార్జ్‌హాండు) పిల్లలు ఓవరుకోట్లేసుకొని పోతున్నారు.

"మమ్మీ మాకు స్కూలుకు టైమైతందే?" బిడ్డ శ్రీదేవి గునిసింది.

"నన్నేం చెయ్యమంటవే ఓ చీర తలమీద కప్పుకొని పోండి అగో మీ డాడీ పడుకున్నడు ఆయన్ను అడుగుపోండి" శ్యామల ముఖం కందగడ్డజేసుకొని కుర్చీలో కూలబడిపోయింది. నిద్రపోయిన తండ్రిని లేపుతే కసురుకుంటాడని పిల్లలకు తెలుసు.

చిన్నపిల్ల నిర్మల "మాసిస్టర్ కొడుతది." అని ఏడ్వసాగింది.

శ్యామల కోపం పట్టలేక చిన్నపిల్లను రెండు చరిచింది.

చిన్నపిల్ల ఏడుపు ఎక్కువ చేసింది.

ఈ గడబిడలో వంటగదిలో హీటర్ మీద పెట్టిన పాలు పొంగిపోయాయి. సుర్రుమన్న శబ్దానికి అటుకేసి పరుగెత్తిన శ్యామల ఆ చిన్నగదిలో గోడకు తల కొట్టుకొని పడబోయి నిలదొక్కుకొని అదరాబాదరగా హీటర్ మీది గిన్నె దింపబోయి పాలు ఒలకబోసింది. మీగాలు మీద వేడిపాలు పడి చురుక్కుమన్నది – ఆదేకోపంలో ముందుగదిలోకి వచ్చేసరికి మిగతా ఇద్దరు పిల్లలు చప్పుడు కాకుండా ఏడుస్తున్నారు. శ్యామల దబదబ వాళ్లిద్దరికీ రెండు అంటించింది. వాళ్లు పెద్దగా ఏడువ సాగిండ్లు.

నిమిషంలో ఇల్లంతా యుద్ధవాతావరణం ఏర్పడేసరికి ఉలిక్కిపడి కిష్టయ్య మంచంలో లేచి కూర్చున్నాడు. అతనికి మొదట ఈ పెడబొబ్బల కర్థమేమిటో తెలియలేదు.

"పోరగండ్లారా! ఏందిరా లొల్లి." లేచి పిల్లలు ఏడుస్తున్న గదిలోకి వచ్చాడు.

"నోటికి మంచిమాటరాదు గదా!" శ్యామల గడగడ ఉరిమే మేఘంలాగా ముఖం చేసుకొని కుర్చీలో కూర్చున్నది కాలిన కాలు కన్పిస్తూనే ఉన్నది

"అయ్యో కాలిందా?" అంటాడేమో అనుకున్నది. ఆ మాట అంటే ఆమె కోపం సగం దిగిపొయ్యేదే.

కిష్టయ్యకు అలాంటి కృత్రిమ మాటలు మాట్లాడటం ఇష్టంకాదు. కిష్టయ్యకు పాతగొడుగులు కనిపించాయి. భార్య పిల్లలను కొట్టడంతో కోపం వచ్చింది. ఏమనాలో తోచక వచ్చి తనో కుర్చీమీద కూర్చున్నాడు.

"ఇగ అడుగుండ్లి - మీడాడీనే అడుగుండ్లి" శ్యామల ఎత్తిపొడిచినట్లుగా.

కిష్టయ్య పండ్లు కొరుకుతూ కూర్చున్నాడు.

"తోటి ఆడవాళ్ళు చీరలు కొనుక్కున్నరంటే వాళ్ళకు పై ఆందాని అంటడు అదంటె ఇదంటడు. ఈనే ఉన్నడు లోకంల సత్యవంతుడు. పిసరంత బంగారం కొన్నడా? ఆడిపోరగండ్లు పెరుగుతున్నరు" శ్యామల వానలోకి చూస్తూ.

"మాట్లాడకు. మాట్లాడితే నాది చిన్న కోపంకాదు" కిష్టయ్య.

"మాట్లాడితే ఏంజేస్తవు? తన్నుతవు. మల్ల మీదికెల్లి అందరు సమాన మంటవు" శ్యామల

"ముందు నువ్విక్కణ్ణుంచిపో." కిష్టయ్య దాదాపుగా అరిచిండు.

"పక్కవాళ్ళు వింటరు." అన్నది శ్యామల.

ఆ మాటకు కిష్టయ్యకు మరీ కోపం వచ్చింది

పిల్లలు బిత్తర పోయి చూస్తున్నారు ... అక్కడుంటే మరీ గొడవ ముదిరి పోగలదని కిష్టయ్య లేచిపోయి బెడ్ రూంలో మంచంమీద కూర్చున్నాడు.

శ్యామలకు కోపం పెరిగిపోయింది కాని వాన హఠాత్తుగా తగ్గిపోయింది. రోడ్డుమీద సైకిల్లు, ఆటోలు, స్కూటర్లు బర్రు బర్రున పరుగెత్తసాగినయ్ పిల్లలు ఆవర బాదంగా రోడ్డుమీదికి వెళ్ళిపోయారు.

శ్యామల మౌనంగా చాలాసేపు కుర్చీలో కూర్చున్నది. కాలు కాలిన మంట కన్నా లోపల లెక్కడో తీవ్రమైన మంట మండుకుంటోంది రోడ్డుమీద బొక్కటోపీల వాళ్ళు, చప్పిడి దవడల వాళ్ళు ముఖం శరీరం మొత్తం మసితో మాసిపోయినవాళ్ళు పోతున్నారు. వాళ్ళందరి ముఖాలు చూస్తుంటే శ్యామలకు బాధకలిగేలా అసహ్యం కలుగుతోంది. తనభర్త అట్లాగే వస్తాడు. పక్కింటి క్లర్కు ఎర్రగా బుర్రగా ఇన్ షర్టు చేసుకొని స్కూటర్ మీద వస్తాడు తనకు లోలోపల ఎక్కడో పక్కింటి సువర్చలలాగే ఉండాలనే కోరిక పెరిగి పెద్దదౌతోంది

శ్యామల తల్లిగారు కిష్టయ్య కన్నా కొంచెం స్థితిపరులు. శ్యామల అన్న ఒకడు ఎలక్ట్రిషనిగా గల్లో చేరి వర్కుషాపులో వేయించుకొని డిప్లొమా పాసై

జూనియర్ ఇంజనీరయ్యాడు. పైగ అతను యూనియన్‌లీడర్ బాగా సంపాదించాడు. చిట్టీల వ్యాపారం, వడ్డీవ్యాపారం చేస్తాడు. బ్రాందిషాపులో సగం వాటా ఉన్నది. ఇంకో అన్న హెడ్ వోర్‌మెన్‌గా చేస్తాడు. కిష్టయ్య తమలాగే పైకి రాగలడని శ్యామల నిష్ఠూరు. తన అన్నలు కష్టపడి పైకి వచ్చారమకుంటుంది శ్యామల.

కిష్టయ్య అదోరకం మనిషి - వర్కుషాపులో ఉంటే కార్మికులతో కలిసి బతికినట్టు ఉండదని గనిమీద వేయించుకున్నాడు. కిష్టయ్య "ఊఁ" అంటే తన అన్నలు కిష్టయ్యకు సహాయం చేస్తారు. కిష్టయ్య "ఊ" అనడు పైగా తన ఇంజనీరు అన్న అంటే అతను మండిపడతాడు.

మరింత కిష్టయ్యతో శ్యామల ఎదుగు బొదుగు లేకుండా ఇంతే ఉండగలడని శ్యామల విశ్వాసం....ఫలితంగా శ్యామల ప్రచ్ఛన్న యుద్ధం చేయతలపెట్టింది.

కిష్టయ్య మంచంలో పడుకున్నాడేకాని అతని మనసంతా కకావికలై పోయింది తన బతుకు దినదినం నరకంలాగా తయారౌతోంది. సినిమాలకు భార్య తిరుగుతుంటే ఇంట్లో కట్టిపడేసినట్లుగా ఉంటుంది. పోనియ్య అనుకున్నాడు. కాని ఆ సినిమా తాలూకు నటన కుటుంబంలో చొరబడింది ప్రతిదీ చెప్పుతేకాని అర్థం కాదు. "నేను నిన్ను ప్రేమిస్తున్నానని" నోటితో చెప్పాలి. సదా సానుభూతి చూయించాలి. అంత తన్నా చావు మరోటి ఉండదు. పిల్లలను శ్యామల ఇష్టంమీదనే ఇంగ్లీషు మీడియంలో వేసి వాళ్ళను తనకిష్టంలేని సంస్కృతికి అప్పజెప్పాడు. ప్రతిరోజు ఇదే గొడువ - రెండు రకాల జీవితాలై పోయాయి. తనకు స్వచ్ఛమైన బతుకు కావాలి. శ్యామలకు పై పై మెరుగులు కావాలి....శత్రువు ఎక్కడున్నాడు? భార్యాభర్తల మధ్య ఏర్పడ్డ ఈ 'చేదు' ఎట్లా మింగాలి? తను కార్మికులందరిలాగే సాధారణ కార్మికుడు తను తన ఆత్మను అమ్ముకొని....కిష్టయ్యకు పూర్తిగా విరక్తి కలిగింది.

"కిట్టన్నా! ఓ కిట్టన్న" క్వార్టర్ బయట భూమయ్య పిలుస్తున్నాడు.

శ్యామలలేచి ఇంట్లోకి పోబోయింది.

అంతలోనే భూమయ్య లోపలికి వచ్చేసాడు.

"ఏందక్కా పువ్వులు కమ్మిన వెలుగులు తిరుగున్నవ్?" అన్నాడు చొరవగా

శ్యామల జవాబు చెప్పకుండా లోపలికి నడిచింది.

కిష్టయ్య బయటకు వచ్చాడు.

"నైటుజేసినవా? పగటీలివద్దామనుకున్న - కాని ఉండబుద్దిగాలే" భూమయ్య చెప్పుకపోతున్నాడు

"నేనే అటు అత్తమనుకున్న- రాత్రి త్రీ సీమ్‌ల ట్రబులిచ్చింది, తెల్లందనుక ఓసావు వచ్చిన- కాసేపు అట్ల ఒరిగేటాల్లకు కన్నంటుకున్నది" కిట్టయ్య అంటూనే-

"అట్ల కూర్చో- పేపరు సూడు. నేను చిడిమెల తానంజేసి వత్త" లోపలికి నడిచి శ్యామలతో ఛాయ్ పెట్టుమన్నాడు.

అంటించిన బొగ్గుపొయ్యి భగభగ మండుతున్నది. దానిమీద ఏమీ పెట్టలేదు. శ్యామల మండే పొయ్యినే చూస్తూ కూర్చున్నది కాని లేవలేదు.

భూమయ్య పేపరందుకొని పైకే చదువుతున్నాడు.

శ్యామల లేవనేలేదు. కిట్టయ్య చన్నీళ్ళు కుమ్మరించుకొని శ్యామలనేమన కుండా తనే మూడు కప్పుల ఛాయ్ చేసి ఒక కప్పు శ్యామల దగ్గర పెట్టి - రెండు కప్పులతో భూమయ్య దగ్గరికి వచ్చాడు.

"అక్కకు బాగలేదా ?" భూమయ్య

"కాదు గొడుగులంత పొద్దున్నే చిన్న గొడవ మామూలే" కిట్టయ్య.

"ఇంటింటికి మంటి పొయ్యేగాని మాకు పొయ్యిగాదుగదా!" భూమయ్య.

"మనం ఇనుప పొయ్యిలల్లున్నం" కిట్టయ్య నవ్వుతూ

భూమయ్య ఛాయ్ తాగి కప్పు కడుక్కొచ్చి పెట్టి-

"నిన్న బండి ఆశాలుకు ఎప్పటిదో కువారం బెట్టుకొని యాభయి తిల్లు (రంధ్రాలు) కోయలేదని చార్జ్‌షీటిచ్చిండా ? రామసామి ఆశాలును ఎంటబెట్టుకొని అండర్ మేనేజరు దగ్గరికి పోయిండు. ఆ రొయ్యి పొట్టుగాడు చార్జ్‌షీటు వాపసు తీసుకోలే. మాషిట్టోల్లం బాయిలకు దిగలే- పోలీసోల్లను బాయిమీదికి పిలిపిచ్చిండు. ఇగజూస్కో లేబరోల్లకు అట్ల కోపమొచ్చింది. పోలీసోల్లంటరు రామసామిని పట్టుకు పోతమని- మేమంత అడ్డందిరిగినం రామసామి చేసిన తప్పేందోంట అందరు లొల్లి బెట్టిండ్లు- పోలీసోల్లు మంటర మంటర కొట్టినట్టిండ్లు - అప్పటికే సెదిరి పోయిండ్లు - రామసామిని టేషన్‌కు పట్టుకు పోయిండ్లు-పొద్దటి బజిలీ బందుపెట్టినం మల్ల మనం టేషన్‌కు పోవద్దా?" భూమయ్య చెప్పుకపోతున్నాడు.

"నాకైతే, మనకన్నా అండర్ మేనేజరే పోలీసుల పిలిసిండు గనక అయినే రామసామిని ఇడిపించుక రావలె. లేకపోతే మొత్తం బాయిలన్ని బందుపెట్టియ్యాలె నిపిస్తుంది" కిట్టయ్య చెప్పులేసుకొని బయలుదేరిండు.

శ్యామలకు భూమయ్యమీద, కిష్టయ్యమీద పట్టరాని కోపం కలిగింది.... ఆ కోపంలోనే లేచి బియ్యం కడిగి పొయ్యిమీద వేసింది. "ఇంట్లో పిళ్ళ గంగల కలువనియ్యిగని మందంకె ఉరుకుతరు" శ్యామల కసిగా అనుకున్నది.

* * *

"పాత చెత్రీలు బాగుచేత్త-- పాత చెత్రీలు" ఒక బొంగురు గొంతు వీధిలో విన్పించింది. అప్పుడు మధ్యాహ్నం ఒంటిగంటవుతున్నది.

శ్యామల వార పత్రిక చదువుతున్నదల్లా దిగ్గున మంచంలోనుండి లేచింది. మళ్ళీ ఆమాట విన్పించలేదు. పేపురికార్డర్లో అర్థంపర్థంలేని పాట పాడుతూ ఎల్ ఆర్ ఈశ్వరి గొంతు చించుకుంటోంది. శ్యామల పేపునాపి దరువాజ దగ్గరికి వచ్చి నిలుచున్నది. మబ్బు తొలిగిన ఎండ చిత్తు బొత్తుగా దంచుతోంది కుండలో ఉడుక బెట్టినట్టుగా ఉడుకుతోంది.

పిల్లలకు టిఫిన్ క్యారియర్ పక్కింటి కుర్కతో పంపింది. ఇంకా కిష్టయ్య రాదలేదు.

"బయటకు వెళ్లితే ఇల్లు ధ్యానలేదు" శ్యామల మన లో అనుకున్నది. "నాకోసం చూడవద్దు నీకెప్పుడు సమయమైతే అప్పుడు తిను" అంటాడు కిష్టయ్య.

"గొడుగులు బాగుచేసే వాడెక్కడ చచ్చాడో? ఇప్పుడే మునిగి పుత మాయమైపొయాడుగదా! శ్యామల కొంగుతో గాలి విసురుకుంటూ వంట ఇంటిలోకి పోతుండగానే మనసులో అన్న ఇంటిదగ్గర ఏర్ కూలర్ మెరిసింది

"చెత్రీలు బాగుచేస్త: చెత్రీలు" మళ్ళీ అదే గొంతు.

శ్యామల మళ్ళీ బయటకు వచ్చేసరికి తమ క్వార్టర్ ముందునుండి మాసిన గుడ్డలతను పోతున్నాడు:

"ఇగో ఇటురా" శ్యామల పిలిచింది.

ఛత్రీలతను ఎందకు మనకళమ్మి "పిలుస్తున్నారా అమ్మా?" అన్నాడు అనుమానంగా.

"ఔనయ్యా?" శ్యామల అసహనంగా.

చత్రీల రిపేరర్ సన్నగా పీలగా ఉన్నాడు, నెత్తిమీద నుండి చెమట కారు తోంది. అతని ఎడమ చేతిలో చిన్న సంచీ కుడి భుజ మీద చెత్రీ సామాను కొద్దిగా ఉన్నాయి.

అతను వచ్చి బురద బురదగా ఉన్న వాకిట్లో ఎక్కడ కూర్చోవాలో తెలియక దిక్కులు చూస్తున్నాడు.

అతను బతికి చెడ్డవానిలాగా ఉన్నాడు. కళ్ళల్లో ఏవో నీలినీడలున్నాయి. అతనికి ఈపని కొత్తలాగున్నది.

"అ మెట్లమీద కూర్చో" అని శ్యామల లోపలికి వెళ్ళి మూడు చెత్రీలు తెచ్చి ముందు వడేసింది.

అతను అ మూడు చెత్రీలు పరిశీలించి -- సంచీలో నుండి సామాను తీసి బయట పడేసి బాగుచేయడానికి సిద్ధపడ్డాడు.

"ఇగో ముందే చెప్పుతున్న మూడింటికి కలిపి అయిదు రూపాయలిస్త- అయింక కిరికిరి చేస్తె బాగుండదు" శ్యామల.

అతను ఒకమారు శ్యామల ముఖంలోకి చూశాడు.

"అమ్మా నోరెండుకపోతంది కాసిన్ని నీళ్ళియ్యి" అన్నాడు.

తను చెప్పిన కాడికే బేరం కుదిరినందుకు శ్యామలకు ఆశ్చర్యంగా వున్నది. నిజానికి శ్యామల పదిరూపాయలు ఇస్తాననుకున్నది. అందులో సగం చెప్పితే బేరం పదికి కుదురుతుందనుకున్నది. "ఏదెవ్వడో తన భర్తలాగే ఎడ్డిమాలోకం లాగు న్నాడు" అనుకున్నది

నీళ్ళు తెచ్చి అతనికి ఇచ్చింది అతను గటగట తాగి దాదాపు గంటపాకా కష్ట పడి మూడు గొడుగులు బాగుచేశాడు సాయంత్రంపూట బడిలేదని పిల్లలు వచ్చారు. పిల్లలను చూస్తూనే అతని కళ్ళల్లో నీళ్ళూరాయ్ - శ్రీకాంత్‌ను "ఏం చదువుతున్నావ్ బాబు" అన్నాడు

శ్రీకాంత్ "ఏడవ తరగతి" అని చెప్పాడు.

శ్యామల అయిదు రూపాయలనోటు తెచ్చి అతనికి ఇచ్చింది

"సారు ఏం పని చేస్తడమ్మా...." అతను.

శ్యామలకు తన భర్త హోదా ఎలక్ట్రిషనని చెప్పుకోవడానికి నామోషీ అని పించింది. ఫోర్‌మన్ అని అబద్దం చెప్పింది.

"అట్లనా?" అన్నాడు అతను సామాను సమురుగొని పోబోతూ....

శ్యామల ఆశ్చర్యంతో నోరుతెరిచి నిలుచున్నది. అతని ముఖంలో భావం చూసి ఆ భావం తనకు పరిచయమైందే. తన అన్నల ప్రస్తావన వచ్చినప్పుడు కిష్టయ్య ముఖంలో చాలాసార్లు అలాంటి భావమే చూసింది

"ఎందుకడిగినవయ్యా!" శ్యామల పోబోతున్న అతన్ని ఆపి అడిగింది.

అతను తలవంచుకొని నిలబడి "మా అసోటివాళ్ళేమోనని అడిగిన అమ్మా! మీరు పెద్దలోకులు మా తిప్పల్లు ఏం తెలుస్తయి? నా కడుపుల చెప్పరాని దుక్క- మున్నది. ఒకప్పుడు ఇగో ఇంతకన్న పెద్ద క్వార్టరు కంపినీ ఉద్యోగముండేది. మీ పిల్లల తీరున్న నా ముగ్గురు పిల్లలు ఇంగ్లీషు చదువులే చదివెటోల్లు" అతను విట్టూ ర్చాడు. అతని గొంతులో గురగుర. "నా కొడుకిప్పుడు డబల్ రోట్టెలమ్ముతండు"

శ్యామలను ఏదో అడుగాలని పుస్తకాల బ్యాగులు ఇంట్లోపడేసి బయటకు వచ్చిన పిల్లలు తల్లిముఖం చూసి ఏమి అడుగకుండానే నిలుచున్నారు.

"మరి గీపనెందుకు చేస్తున్నవ్?" శ్యామల.

"నేను కాగజ్‌నగర్‌ల సర్‌సిల్క్ బట్టల మిల్లుల ఇరువైఏండ్లు వెల్డర్ పని జేసిన మేనేజుమెంటు మిల్లు మూసింది. ఇగో నేను గీ అవతారమెత్తిన" అతను.

"అట్లనా? వెల్డర్‌వైతే మరింకేడనన్న పనిదొరకదా?" శ్యామల.

"ఏడదొరుకుద్దమ్మ! అంతటా గిట్లనే ఉన్నది గిప్పుడు పనిజేసేటోని అక్కెర

తీరింది. మిషన్లు అన్నిపనులు చేస్తున్నయి. మీ సింగరేణిల ఆఫీసులసుట్టు తిరిగి తిరిగి సచ్చిన- ఏడనన్న చిన్న కొల్వునాలల్లజేత్తామంటే పొద్దున ఎనిమిదింటికి పనిల కెక్కుతె రాత్రి తొమ్మిదింటిదాక పని-ఇచ్చేటియి ఇరువై రూపాయలు- గీకాలంల బతుకుడు కష్టం".

శ్యామలకు సర్ సిల్కు మూతపడటం-అందులో పనిచేసే ఎనిమిది వేలమంది ఉద్యోగాలు కోల్పోవడం తెలుసు. తన భర్త కిష్టయ్య అతని మిత్రులు అనేకమార్లు బిగ్గరగా చర్చించుకోగా విన్నది....

"ఇరవైఏండ్లు ఉద్యోగం చేసినంటున్నవ్. ఉద్యోగం ఉండగానే ఏమన్న సంపాయించుకుంటే గిసోంటి కష్టకాలంల అక్కెరకు రాకపోవునా?" శ్యామల అమాయకంగా అడిగింది.

"ఎవడన్న అచ్చే అందాని కాదంటాడా? కంపినోడు చేతికి మూతికి అంటకుంటనే జీతాలిత్తడు."

"మరి మీ కంపిన్ల సంపాయించుకున్నోడే లేడా?" శ్యామల మనసులో తన అన్నలు మెదిలారు.

"మంచిని ముంచెటోడు ఏడనైన సంపాయిత్తడు. అవ్వా నెత్తురు తాగాలె- అడ్డీలకియ్యాలె కంపినోనికి లేబరోనిమీద సాడీలు సెప్పాలె-గట్లాంటి తుక్కుబతుకు బతికే బదులు...." అతను కాండ్రకిచ్చి ఉమ్మేశాడు.

శ్యామల విశ్వాసం దెబ్బతిన్నది. నిజానికి శ్యామలకు సంపాదనంటే ఎవరినో ఒకరిని ముంచడమేననే విషయం తెలియనిదికాదు. భర్త ఈమాట చెప్పితే వెంటనే అంగీకరించేది, భర్తముందు తన ఓటమి ఒప్పుకోదు. శ్యామల ముఖంలో మొదట కోపం ఆ తరువాత ఓటమి కనిపించాయి.

చెత్రీల రిపేరర్ ఉద్విగ్నమైఉన్నాడు అతన్ని కదిలిస్తే అంతూపోతూలేకుండా మాట్లాడతాడు గతరెండు సంవత్సరాలుగా అతను కప్పించిన వారికల్లా తనవీన స్థితిని చెప్పుకుంటూనే ఉన్నాడు

"కోప్పడకమ్మా....మన ఒంట్లె నెత్తురున్నంతవరకు ఇగోగిసొంటి క్వార్టర్లు, ఉద్యోగాలిస్తరు. ఒంట్లెనెత్తురు జుర్రుకుంటరు వాళ్లకు ఈదునియల కన్నబిడ్డలు కట్టుకున్న పెండ్లాల కాడకూడ లాభంగావాలె-మా కంపినోడు అందినకాడికి కంపినిలయి తిన్నడు ఈదుకాణం ఎత్తేసి ఇంకోరెండు కార్ఖానాలు కడుతడు గవర్నమెంటు లైసెన్సులిత్తది. మవుననిన్న తప్పులెత్తిరా నాలేసతన్నే గవర్నమెంటు గిట్ల కోట్లకు కోట్లు ముంచుతే గొప్పోడంటది. యూనియన్లు దొంగలు....అమ్మా! నాకిప్పుడైతే గీదునియల ఒకన్నొకడు పీక్కతినుడు తప్పమరింకేది కనిపిత్తలేదు. ఇగో గీవ అరటిపండ్లు కూరగాయలు, డబల్ రొట్టెలు అమ్మెటోల్లంత మావోల్లే—మీతీరుగనే క్వార్టర్ల ఉరిడెటోల్లు—ధైర్నం చెడ్డోల్లు ఉరిబెట్టుకచ్చిండ్లు — కన్నబిడ్డల అమ్ము

'జులూస్'
దర్శన్

"అబ్బ ! ఏం ఎండ ?" అనుకున్నాడు కృష్ణ పాపయ్యపేటచమన్ దగ్గరికి రాగానే, అక్కడ మూడురోడ్లకూడలివుంది. చమన్ ఎప్పుడో రూపుమాసి పోయినా పేరింకా అలాగేవుంది. అప్పుడు సమయం తొమ్మిదిన్నర అవుతుంది. సూర్యుడు అప్పుడే మేడలపై నించి తలెత్తాడు. ఐనా ఉక్కగావుంది. సెప్టెంబర్ మాసంలో ఉండాల్సిన చెమ్మ, చలీలేవు ఉక్కగా వుంది.

అక్కడ ఒకవిమిషం ఆగి జేబులోంచి కర్చీఫ్ తీసి ముఖాన్ని తుడుచుకుని రోడ్డునిదాటి ఎల్లమ్మబజార్ వైపువెళ్ళే సందులోకి దూరాడు కృష్ణ చేతిలో న్యూస్ పేపర్ చుట్టివున్న వస్తువేదో ఒకమూరెడు పొడుగువుంది దాన్ని ఆ చేతినుంచి ఈ చేతికి మార్చుకుంటూ రెండోచేత్తో అప్పుడేవస్తున్న నూనూగు మీసాల్ని తడుము కుంటూ పెద్దపెద్ద అంగలు వేస్తూనడుస్తున్నాడు,

మట్టెవాడ హైస్కూలు పక్కనించి నడుస్తూ ఎందుకైనా మంచిదని అతడు పక్కనే వున్న మసీదు సందులోకి తిరిగాడు. అతని అనుమానం నిజమే. సూటిగా వెళితే ఎల్లమ్మ బజారు సారాదుకాణం దగ్గర పోలీసులో వాళ్ళతొత్తులో ఉండితీరుతారు. అతను దారిమార్చి ముస్లిం వీధిలోకి ప్రవేశించటం కొంతనయం. ఆవీధిలో ఇళ్ళన్నీ

కున్నరు. కోపమానసోడు సెట్లు గుట్టలు పట్టుకపోయిండు" అతని గొంతు ఖంగు మని మోగింది

చెప్పడం మధ్యలోనే ఆపేసి అతను ఎర్రటెండలో రోడ్డుమీది కెక్కాడు. ఇప్పుడతను చెత్రీలు బాగు చేయడం గురించి పూర్తిగా మరిచిపోయాడు. "పాపంపం డుతది....అప్పుడు హరిహరాదులు అడ్డంవచ్చినా దొంగల పనిపడ్తరు." పెద్దగా అనుకుంటూపోతున్నాడు.

శ్యామల మనసుపూర్తిగా చెదిరిపోయింది. ఆర్ద్రతతో, కోపంతో తన మిత్రులతో కిష్టయ్య పదేపదే చెప్పి మాటలు గజిబిజిగా – ఇప్పుడామెకు రెండుమోహరించిన ప్రపంచాలు కన్పించాయి. తనభర్త చెత్రీలు బాగుచేసే అతను ఒకే ప్రపంచంలో నిలుచున్నారు. వీళ్లిద్దరు తమ శత్రువులతో రాజీ పడదలచుకోలేదు. అంటే – తన పిల్లలు, తనకలలు– అన్నికుప్ప కూలిపోతాయా?

ఆకాశం కుప్పకూలి తనమీద తనపిల్లలమీద పడుతున్నట్లుగా శ్యామలకు తోచింది. పిల్లలను దగ్గరికి తీసుకొని కుర్చీలో కూలబడ్డది.

"కుప్పకూలే ఆకాశానికి ఎవరు చేతులడ్డం పెట్టలేరా? " శ్యామల మనసు మూలుగుతోంది.

చిత్రంగా కూలిపోతున్న ఆకాశానికి తనభర్త తన మపి చేతులు అడ్డం పెట్టాడు కిష్టయ్య మిత్రులంతా కిష్టయ్య చేతులతో చేతులు కలుపుతున్నారు. వాళ్ళంతా అదేపనిలో ఉన్నట్టుగా శ్యామలకు అర్థమైంది.

తలుపులు మూసివుంటాయి. వీధుల్లో జనం ఎవరూ ఉండరు. ఐతే అది ఒకందుకు ప్రమాదం గూడా ఏ ఇంటి తలుపైనా అకస్మాత్తుగా తెరుచుకుని ఏ పోలీసువాడో ప్రత్యక్షమైతే ? కృష్ణ కుడిచేతిలో వున్న వస్తువుని గట్టిగా పట్టుకుని నడుస్తున్నాడు.

అతని తలకిందికేవుంది గానీ చూపులు వెనక్కి తప్ప అన్ని దిక్కుల్నీ కని పెడుతున్నాయి. అతని చెవులు చీమచిటుకు మన్నా పట్టుకుంటున్నాయి. అప్పుడప్పుడు వెనుదిరిగి చూస్తూ చకచకా అడుగులేస్తున్నాడు,

అతని మనసు ఎంత ఉద్వేగంగా వుందో చెప్పలేం, అతని మనసుఎంత నిమ్మళంగా వుందో అదీ చెప్పలేం ఎవడన్నా పయాసుని అంటి పెట్టుకున సాహసం ఉంటుందంటే వాణ్ణిదొరకబుచ్చుకుని తన్నాలి. కృష్ణ వయసు అతని చర్యలకి ఏ మాత్రమూ చాలదు. ఐనా అతడు తనది సాహసమని అనడు. అది అవసరం అంటాడు

అతడిప్పుడు నడుస్తూ ఒక విషయం ఆలోచిస్తున్నాడు గతరాత్రి కాజీపేట మార్కెట్‌లో రాత్రి ఎనిమిది గంటలతర్వాత అకస్మాత్తుగా కోళ్ళన్నీ ఎందుకు అయి పోయాయో, బార్లలో, బ్రాందీషాపుల్లో ఎందుకు రద్దీపెరిగిందో అని సామాన్యంగా కార్మిక ప్రాంతాల్లో పండగరోజున తప్ప అలా జరగదు. మరి నిన్న ఏం పండగ ?........

అతడు తవలో తాను నవ్వుకుని కుడిచేతిలో పేపర్ చుట్టి వున్న వస్తువుని ఓసారి ఎగరేసి అందుకుని ఎడంచేత మొలక మీసాల్ని నిమురుకున్నాడు సందు మూల తిరిగేచోట ఒక చెత్తకుండీవుంది. దాని చుట్టూ పందులగుంపొకటి విదానంగా పడుకునివుంది.

అతను ఆ గుంపుని అతి జాగ్రత్తగా గంతేసి దాటి మెయిన్ రోడ్డెక్కాడు. అది మహబూబియా పంజెతన్ కాలేజీ. అక్కడ ఒక్కనిమిషం ఆగి రెండువైపులు చూశాడు. ఒకవైపు ఎంచుకుని అటుసాగాడు. ఆరోడ్డు ఎల్లమ్మ బజారు మార్కెట్ వైపు సాగుతుంది చాలా రద్దిగా వుంది. ఒకర్నొకరు తోసుకుని పోవాల్సిన రోడ్డు అది.

"కలకత్తా రోడ్లిలాగే వుంటాయేమో!" అనుకుంటూ నడిచాడతను. సోమ వారం కావటం వల్ల కాలేజీ పిల్లల రద్దీ, మార్కెట్ జనం రాకపోకలు, సామాన్య జనం-అంతా ఇరుగ్గావుంది. రోడ్ల మీదే కూరగాయలు కుప్పలుగాపోసి అమ్ముతున్నారు మాంసందుకాణాలు ముక్కలవల మీనే పెట్టుకుని కూచున్నారు. ఎండుచేపలు, పచ్చి చేపలు కంపుకొడుతూ వుండేవాటిని తప్పించుకోటానికి ముక్కు మూసుకుని నడుస్తున్నారు జనం. అంత ఇరుకులోనూ చాయ్‌వాలా దగ్గర నిలబడి టీ తాగు తున్నారు కొందరు. కృష్ణ బాణంలా దూసుకుపోతూ ఆ జనాన్నించి బయటపడి మండీ బజార్ వైపు తిరిగాడు.

పొద్దున్నే బయల్దేరాడు గదినుంచి అప్పటి నుంచీనడకే, విశ్రాంతిలేదు.

కనీసం టీ ఐనా తాగలేదు. ఎక్కడికి వెళదామన్నా ముందూ వెనకా ఆలోచించాల్సి వస్తోంది. రాత్రినుంచీ ఊరంతా అట్టుడికి పోతూంది ఎన్నడూ ఆవూరి చరిత్రలో జరగని విషయం అది.

ఒకపోలీసు యస్సయిని రద్దీగా ఉన్న రైల్వే ప్లాట్‌ఫారం మీద కాల్చి చంపటం మాటలా? పైగా చంపిన వాళ్ళెవరూ దొరకలేదు. ఈ పరిస్థితిలో తనలాంటి వాడు కనిపిస్తే ఇంకేమన్నా వుందా ? ఆదేదో తన మీదికి తోసేసి కసితీర్చుకోరూ? అసలు పోలీసులు ఇప్పుడెంత కోపంగా ఉన్నారో ? ఎవర్ని అరెస్టు చేశారో, ఎవర్ని హింసిస్తున్నారో తెలిస్తే బాగుండును.

అతడు మండీబజారు వేపచెట్టు దగ్గరికి వచ్చేసరికి జనమంతా గగ్గోలు పడుతూ కన్పించారు. అది అసలే మెయిన్‌రోడ్డు కావటం వల్ల గోలగావుంది, రోడ్డెక్కదామనుకున్న వాడల్లా ఆగిపోయాడు. ఎందుకైనా మంచిదని పక్కనే వున్న పాకల హోటలు వైపు నడచి సింగిల్ టీకి ఆర్డరిచ్చి ఓ పక్కగా నిలబడ్డాడు. అతనికి ఎడమ ప్రక్కగా రిక్షాలవాళ్ళు రిక్షాలు ఆపుకుని టీలు తాగుతూ చెప్పుకుంటున్నారు.

"అబ్బ ఎంత పెద్ద జులూస్ అనుకున్నవ్ ? ఊర్లె ఉన్న పోలీసులంత ఆ ఊరేగింపుల్నే ఉన్నరు ముందట ఏస్పీ, డీ ఎస్పీ నడుస్తాంటె వాళ్ళ ఎనుక వ్యానుమీద నచ్చినోని పీనుగ బెట్టిన్రు. దానికి దండలు గిండలు ఏసి ఇంతకుంకుమ జల్లిన్రు జై జై అంటాన్రు" అన్నాడొకతను.

'నీయవ్వ ! వీడు సరీగా ఇనలేదురా. మాయస్సయిని జంపిన రాడికల్సును నాశనం జేస్తం. ఓ ప్రజలారా సూడున్రి రాడికల్స్ దౌర్జన్యం దీనికి మీరే సాక్షం అనుకుంట లొల్లి బెట్టిన్రు' ఇంకొకతను సరిదిద్దాడు

'కని ఈ పోలీసుల జులూస్ దీసుడేంది-! గమ్మతుగున్నది. మనవూరు ఏమయి పోతాందో అర్థమైతలేదురా వారీ !' ఒక ముసలతను అన్నాడు

ఇంతలో హోటలువాడు కృష్ణకి టీ అందించాడు అతడు టీ తాగుతూ వారి మాటలు వింటున్నాడు. వాళ్ళు చెప్పుకునేది వింటే అతని గుండెలు వేగంగా కొట్టుకున్నాయి

"అసలు ఆ పోలీసుల్ని ఎవరు జంపిన్రట ?"

'ఎవరేంది ? రాడికల్సేనట గదా ! వాల్లకూ వీల్లకూ పడదు. వాల్లను వీల్లు జంపుతురు వీల్లను వాల్లు జంపుతరు.'

'అనుకునుడేగని రాడికలోల్లు పోలీసుల నెప్పుడు జంపిరి ? రాడికలోల్లనే పోలీసులు శానమందిని సంపి అవుతల పారేశిన్రు. మొన్న మొన్న సుదర్శన్ అనెటోన్ని సారంగపాణి అనెటోన్ని కొట్టి సంపలేదా ? అప్పట్నుంచి వాల్లు పగబట్టిన్రు.'

"మరి ఎంతకని ఊకుంటరు? ఏదన్న ఉంటె కేసెట్టాలె కొట్టాలె జేల్ల పారెయ్యాలె గని సంపుడేనా?"

ఇంతలో ఒక రిక్షా అతను వేగంగా రిక్షా తొక్కుకుంటూ వచ్చాడు. ఒక్క ఉదుటన రిక్షాను ఆపి పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"ఆరేయ్ ఇన్నర్రా ఎంత కతైందో!" అన్నాడు ఎగపోస్తూ.

"ఏందిరా ఏమయింది?"

"మన డాక్టరుసాబును పోలీసులు సంపేసిన్రు. ఇప్పుడే ఐంది."

"ఏహె! నిజంగనా?" అక్కడున్న వాళ్ళంతా ఆశ్చర్యపోయారు. వాళ్లకది నమ్మశక్యం కాలేదు.

"నిజమేరా! నేను అక్కన్నే అడ్డమీద ఉంటిగద. జులూస్ వస్తాందని కొంత మందివచ్చి మమ్ములందర్ని అడ్డమీది నుంచి రిక్షాలన్ని తీసెయ్యిమన్నరు. పోలీసుల తోటి లొల్లి ఏందని అందరం అక్కన్నుంచి అటేటు పోయినం. కొద్దిగ దూరం పోయినం గని మాకంత కనబడ్తనే ఉన్నది."

చెపుతున్న వాడికి ఏడుపే తక్కువగా ఉంది. వింటున్న కృష్ణ గుండెలు గుబగుబలాడాయి. అతని కళ్లముందు చీకటి కమ్మినట్టయింది. నిలబడలేక అక్కడ బెంచీమీద కూలబడ్డాడు అంతవరకూ ఫ్రీగా మాట్లాడు తుంటున్న రిక్షావాళ్లు గొంతులు దగ్గర పడ్డట్టుగా మౌనం వహించారు. వారిముఖాల్లో భయం తాండవించింది. ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. కృష్ణకి టీ తాగబుద్ది కాలేదు. గ్లాసును టేబులు మీద పెట్టేశాడు.

వీళ్ళు చెప్పుకుంటున్న విషయం నిజమేనా ? వివరాలు తెలుసుకోవడం ఎలా అతనికే మార్గమూతోచలేదు పట్టరాని ఉద్వేగంతో అతని శరీరం కంపించింది. ఏదో గ్రహణం సంభవించి ఆకాశంలో సూర్యుడు మాయమైనట్టు తోచింది. చెవులకు ఏదో మహాశిలాపాతాల ధ్వని వినిపించినట్టుగా తోచింది క్షణంలో ఒక నిర్ణయానికి వచ్చాడు. లేచి టీ డబ్బులు చెల్లించి ట్రిగర్ విడిచినతూటాలా ఎల్లమ్మబజార్ సందులో పడి దూసుకుపోయాడు. జ్వరం వచ్చిన వాడిలా వున్నాడతను. అతని శరీరం శ్వాసిస్తోందో లేదో తెలియదు. అతనిలో రక్తం పారుతోందో పొర్లుతోందో తెలియదు.

రెండే రెండు నిమిషాల్లో దుర్గేశ్వరస్వామి గుడిసందులోంచి డాక్టరుగారి ఆస్పత్రిని చేరాడు. అక్కడంతా జనం గూమికూడి ఉన్నారు. ఎవరి ముఖంలో చూసినా భయం, మృత్యువు పరచిన నల్లని ఛాయలు ఉన్నాయి. గొంతు విప్పి ఎవరూ మాట్లాడటంలేదు రాత్రింబగళ్లు ట్రాఫిక్ ఆగని ఆ రోడ్డుమీద జనంతో పాటు కాలం గూడా స్తంభించి పోయింది. డాక్టరుగారి ఆస్పత్రి తలుపులు మూసి ఉన్నాయి. ఆస్పత్రి ముందు ఎవరూ జనంలేరు. అవతలి పక్క బస్‌స్టాప్‌లోనూ, ఎదురుగా బ్యాంకులోనూ పెట్రోలు పంపు దగ్గరా దూరంగా కిళ్ళీకొట్ల దగ్గిరా జనం తమతమ పనుల మీద ఉన్నట్టుగా ఉన్నారు:

ఆస్పత్రివైపు ఎవరూ చూడటంలేదు. కానీ అందరి చెవులూ, కళ్ళూ ఆస్ప

త్రినే గమనిస్తున్నాయి. కృష్ణకూడా ఏమీతోచక ఒక కిళ్ళీకొట్టు దగ్గరికి చేరాడు. అల వాటున్నవాడిలాగా ఒక సిగరెట్టు ముట్టించి తాగుతున్నట్లు నటిస్తూనిలబడ్డాడు. ఆ కిళ్ళీకొట్టు దగ్గర పది మంది దాకా ఉన్నా ఎవరూఏమీ మాట్లాడటంలేదు. కృష్ణ మనస్సు ఉద్వేగంతో ఊగిపోతోంది. అతనిలో ఉత్సుకత ఆగటంలేదు, సిగరెట్టు పీలుస్తున్న అతని వేళ్ళు వణుకుతున్నాయి. ఆందోళనని అణుచుకునే ప్రయత్నంలో అతడు ఉన్నాడు. కానీ నిశ్శబ్దమైన రోడ్డు ఆ ప్రయత్నాన్ని సఫలం కానివ్వటంలేదు పజిల్ ముందు పెట్టుకొని కూచున్నవాడిలా ఉన్నాడు కృష్ణ. అతనికి ఏమీ అర్థం కావటంలేదు ఆ సమయంలో దూరంనించి వస్తూ రాజయ్య కన్పించాడు. అతన్ని ఎలా పిలుద్దామా అని కృష్ణ ఆలోచిస్తుండగానే రాజయ్య అతన్నిచూశాడు. చూసి చూడనట్టుగా నటిస్తూ రాజయ్య అతనిదగ్గిరిగా వచ్చాడు కిళ్ళీకొట్లో ఒక సిగరెట్టు కొనుక్కొని తానుగూడా పీలుస్తూ కృష్ణ పక్కన నిలబడ్డాడు,

కృష్ణ అతణ్ణి ఓరకంట చూశాడు. రాజయ్య అది గమనించి "ఎంత ఘోరం" అన్నాడు అతనితో. కృష్ణకి డాక్టరుగారి హత్య నిజమే అని అర్థమై పోయింది. అతని కాళ్ళు గజగజలాడాయి. నిలబడలేక పక్కనేవున్న పోస్టుడబ్బాని ఆనుకొన్నాడు. అతని చేతిలోని సిగరెట్టు జారి పోయింది రాజయ్య అతనికి సైగ చేసి పక్కనేవున్న బ్యాంకులోకి దారితీశాడు. కృష్ణ అతణ్ణి అనుసరించాడు.

* * * *

ఆ ఉదయం ఒక రాకాసి నీడలాగా ఊరిమీద పరుచుకుంది. ఆకాశంమీద బూడిదరంగు చారలు మేఘాలుగా ఆక్రమించుకున్నాయి. ఆ చారలు దగ్గిరౌతూ గాఢంగా, గట్టిగా, ఒక విషకుంజంలాగా ఊరిమీదకి జారాయి.

అప్పుడు సరిగ్గా సమయం ఉదయం తొమ్మిది గంటల పదినిమిషాలు ఆసమ యంలో చీమకూడా నడవ సందు లేనంత రష్‌లో ఆ రోడ్డుమీద ఒక వూరేగింపు అది అల్లాటప్పయ్యది కాదు- తీవ్రవాదుల చేతుల్లో హతం చేయబడ్డ ఒక యస్సైు శవం వూరేగింపు. ఆ వూరేగింపు రెండుగజాల వెడల్పుతో ఫర్లాంగు పొడవుతో వుంది.దాని మొదలు డాక్టరుగారి ఆస్పత్రి దగ్గర వుండే కొనలక్ష్మీటాకీసు దగ్గర వుంది. ఊరేగింపులో రెండువ్యాన్లూ, ఒక జీపూ, చివరా మొదట మరో రెండు వైర్లెస్ జీపులూ వున్నాయి. ఆ వూరేగింపులోని జనమంతా యూనిఫారంలో వున్నారు. అంచేత అందరూ పోలీసులే అన్నది నిశ్చయం. ఐతే ఆ వూరేగింపుకి నాయకత్వం వహించిన ఎస్పీ, డీఎస్పీలు ముందు నడుస్తుంటే కొందరు పోలీసు ఆఫీసర్లు వాళ్ళని అనుసరిస్తున్నారు. వాళ్ళలో కొందరు మఫ్టీలో ఉన్నారు ఐతే ఊరేగింపులో పాల్గొన్న ప్రతీ అనామకుడు ఆయుధ ధారే అన్నది వేరే చెప్పాల్సిన పనిలేదు.

ఊరేగింపు డాక్టరుగారి ఆస్పత్రిని చేరేముందు ఆస్పత్రిదగ్గరున్న రిక్షాలన్ని టినీ ఎవరో తరిమేశారు. డాక్టరుగారి ఆస్పత్రికి వెనుక ఒక సందు వుంది. మెయిన్

రోడ్‌మీద వున్నదుకాణాలన్నిటికీ వెనుక దర్వాజాలు ఆసందులోకే వుంటాయి. అలాగే ఆస్పత్రి వెనుక దర్వాజాగూడా.

శవం వూరేగింపు ఇంకా ఆస్పత్రిదాకా రాకముందే కాంపౌండరు వచ్చి డాక్టర్ని హెచ్చరించాడు.

"సార్! పోలీసులు ఊరేగింపుగా వస్తున్నారు. ఆసుపత్రి మూసేద్దామా?"

పేషెంటుని పరీక్షిస్తున్న డాక్టరు తలెత్తాడు. అతని మొహంమీద ఎన్నడూ చెరగని చిరునవ్వుతో అన్నాడు. "పోలీసులు వస్తే మనకేమిటయ్యా! వాళ్లు మనల్నే మంటారు?"

కాంపౌండరు తటపటాయించాడు "అదికాదు సార్! చాలామంది ఉన్నారు. పైగా ఊరేగింపునిచూసి షాపులన్నీ మూసేస్తున్నారు. మనం గూడా మూసేస్తే మంచిది" అన్నాడు.

"సరే, ఇప్పుడు లోపలున్న పేషంట్లని మాత్రం ఉంచి తలుపులు వేసెయ్యి. వీళ్ళని చూసి పంపెయ్యాలిగదా!" డాక్టరు అనటంతో కాంపౌండర్ బయటికి వెళ్లి పోయాడు.

రెండు గదుల క్లినిక్ అది. ముందుగది వెయిటింగ్‌రూం గానూ రెండోగది కన్సల్టింగ్ రూంగానూ ఉంది. పరీక్ష చేయించుకున్న తర్వాత రోగులు వెనక గుమ్మం నించో లేక పక్కనేవున్న వరండాలోంచో బయటికి వెళ్లిపోతారు.

ముందుగదిలో కిట కిట లాడుతూ ముప్పై నలభైమంది పేషెంట్లు ఉన్నారు. ఆ గదంతా పిల్లల కేకలు, ఏడ్పులతో మారు మోగి పోతోంది. పేషెంట్లు కొందరు కాలంగడపటం కోసం ఒకళ్ళతో ఒకళ్లు కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఏవూరు మీది?" ఒకావిడ పక్కనున్నావిడ నడిగింది. ఆమె ఒడిలో చిన్న పిల్లాడొకడు చిక్కిశల్యమైనట్టుగా ఉన్నాడు. ఆవిడ పక్కన భర్తకాబోలు కూచు న్నాడు.

"బెల్లంపల్లి." రెండో ఆమె జవాబిచ్చింది. ఆమె ఒడిలో గూడా ఒక పిల్లా డున్నాడు. "అబ్బో! అంతదూరంనుంచి వచ్చిన్రా? ఏమైంది పిలగానికి?"

"ఒకటే వాంతులు విరేచనాలు. పదిరోజులైంది. ఎందరు డాక్టర్లకు సూపె ట్టినా తగ్గలేదు. ఎవరో చెప్పిన్రు, ఓరంగల్లుల ఈ డాక్టరుకు సూపెడితె బోద్దంకె వచ్చినం".

"అవు నిజమే చెప్పిన్రు. మాదిగూడ ఈ వూరుకాదు హంస్నాబాద. మాపోర గాడు రొండునెల్లాయె. తిం తింటలేడు, రోజురోజుకు బక్కగయితాండు. ఎంత ఖర్చు బెట్టినా పైసలతొవ్వ పైసలదే మందు తొవ్వ మందుదే. మనిషి మీద ఆశ వదులు

కున్నం. ఈ డాక్టరు చెయ్యిబెడితే సాలు లేశి తిరుగుతడంటె ఆకరు ప్రయత్నం ఈడికి వచ్చినం"

ఇంతలో బయట ఊరేగింపు గోల వినవచ్చింది. పేషెంట్లలో కొందరు మగ వాళ్లు లేచి బయటికి వెళ్ళారు

"ఏందది లొల్లి?" ఒకతను పక్కనున్నతనితో అన్నాడు.

"అరె! గిదేందిరో? పోలీసులే ఊరేగింపు దీశ్రు?"

ఊరేగింపు క్లినిక్ ముందుకు వస్తుంటే లోపల్నించి కాంపౌండరు వచ్చాడు. "లోపలికి రండి. తలుపులు వేస్తున్నం అందరు లోపలికి రండి," అన్నాడు. బయట వున్న వాళ్ళంతా లోపలికి రాగానే తలుపులు వేసేశాడు. ఇంతలో ఊరేగింపు వచ్చి క్లినిక్ ముందు ఆగింది యస్సయి శవాన్ని ఉంచిన వాహనాన్ని క్లినిక్ ముందు ఆపారు.

"ప్రాణానికి ప్రాణం, రాడికల్స్ ! ఇక మీకు మూడింది జాగ్రత్త, ప్రజలారా రాడికల్స్ దౌర్జన్యం చూడండి" అని నినాదాలిస్తున్నారు. కాంపౌండర్ ఆ ఊరేగింపు చూద్దామని పక్క తలుపు తెరుచుకుని మేడ మెట్లు ఎక్కి పైన బాల్కనీలో నిలబడ్డాడు. లోపల గదిలో డాక్టరు మామూలుగా పేషెంట్లని పరిశీలిస్తున్నాడు బయట నిలబడ్డ ఊరేగింపులోని నినాదాలు అతని చెవులకి లీలగా సోకుతున్నాయి. వాటిని పట్టించుకోకుండా అతడు పరీక్షిస్తున్నాడు.

"ఏమైందమ్మా పాపకి?" తల్లిని ప్రశ్నించాడు అతడు.

"రాత్రి నుంచీ జ్వరమండీ !" ఆమె జవాబిచ్చింది. అలా ముగ్గురు నలుగురు పేషెంట్లని చూసి పంపేశాక బేసిన్‌లో చెయ్యికడుక్కుందామని వెనక్కి వచ్చిన అతడు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాడు. ఊరేగింపు తన క్లినిక్ ముందే నిలిచి పోయింది. పదినిమిషాలయినా కదలటంలేదే ? అతని మనస్సు కీడుని శంకించింది.

గబగబ చేయి కడుక్కుని టవల్‌తో తుడుచుకున్నాడు. ముందుగది తలుపుతెరచి పేషెంట్లు ఎంతమంది ఉన్నారో చూశాడు. చాలామందే ఉన్నారు. "మీరంతా కాస్సేపాగండి. తర్వాత చూస్తాను" అని వాళ్ళతో చెప్పాడు. మళ్ళీ తలుపు దగ్గరగా వేసి బోల్టు బిగించాడు. టేబిల్ మీదున్న కళ్ళద్దాలు తీసితుడుచుకుంటూ వుండగా అకస్మాత్తుగా నీడలు కమ్మినట్టయింది. తల ఎత్తిచూస్తే వెనక గుమ్మంలోంచి నలుగురు వ్యక్తులు వస్తూకన్పించారు. నలుగురి మొహాల్లోనూ భయంకరమైన కసి వెలుగుతోంది. మామూలు దుస్తులు ధరించి వున్నప్పటికీ వాళ్ళు సివిలియన్స్ అయివుండరని వాళ్ళ మొహాలే చెబుతున్నాయి. ఇద్దరువ్యక్తులు అరడుగుల ఎత్తు ఎత్తుకు తగ్గ లావులో బుంగమీసాలతో ఉన్నారు. మూడో వ్యక్తి ఎత్తుగానేవున్నా అడ్డ బలుపు

ఎక్కువగా ఉండటంతో కొంచెం పొట్టిగా కన్పిస్తున్నాడు. అతని మొహం నున్నగా వుంది. పెద్దపొట్ట. నాలుగో అతను ఎత్తుగావున్నా సన్నగా వున్నాడు అతని మొహంలో ఎవర్నీనమ్మని కుక్క తనం కనిపిస్తోంది. వాళ్ళు దుడుకుగా డాక్టరుకేసి అడుగులేశారు.

డాక్టరు ఒక్కసారి అదిరిపడ్డాడు. "ఏమిటిది? ఎవరు మీరు?" అంటూ వాళ్ళను నెట్టుకుని బయటకి వచ్చే ప్రయత్నంచేశాడు వాళ్ళు అతణ్ని వెనక్కితోశారు. ఆతోపుడుకి డాక్టర్ టేబిల్ మీదికి తూలాడు. చేతిలోని అద్దాలు కింద పడ్డాయి. పరిస్థితి విషమిస్తోందని గ్రహించాడు. లేచి వాళ్ళని తోసుకుని గుమ్మంలోంచి బయటికి పరుగుతీశాడు.

డాక్టర్ తోసిన తోపుకి ఆ నలుగురూ వెనక్కి తూలారు అద్దాల బీరువాలు పగిలి మందుల సీసాలు కిందపడ్డాయి. వాటిని కసాపిసా తొక్కుతూ బయటికి పరిగెత్తాడు. గుమ్మంలోంచి బయటికి వచ్చిన డాక్టరు తోచిన దిక్కుకి పరిగెత్తాడు. ఏషాపన్నా వెనకనుంచి తీసి ఉంటుందేమోనని చూశాడు అన్నిటి తలుపులు మూసి ఉన్నాయి. వెనక్కి తిరిగి చూస్తే నలుగురూ వేటకుక్కల్లా పరిగెత్తుకొస్తున్నారు. వెనక్కి చూస్తూ ముందుకి పరిగెత్తటం వల్ల జారి మురిక్కాలవలో పడ్డాడు. ఒక్కకి దెబ్బతాకింది. పాంటు మీద మురికి నీళ్ళు చిందాయి అరక్షణంలో లేచి ముందుకిపరిగెత్తాడు కనిపించిన తలుపునల్లా తట్టాడు, ఎవరూ తియ్యలేదు. అసలెవరికీ వినపడలేదు. ఒక తలుపు తీసి కన్పించింది. చటుక్కున లోపలికి దూరాడు అతని వెనకే ఆ నాలుగు వేటకుక్కలు గూడా దూరాయి. అతను లోపలికి ఐదారు అడుగులయినా వెయ్యకముందే ఆ నలుగుర్లో ఒకడు రివాల్వర్ తీశాడు.

డాక్టరు కళ్ళు వెడల్పయ్యాయి. "వద్దు నన్ను చంపవద్దు. తొందరపడుతున్నారు" అని అరిచాడు. సైలెన్సర్ ఉన్న రివాల్వర్ పళ్ళు బిగించి 'టుప్-టుప్' మని జవాబిచ్చింది డాక్టరుగారి పొట్టలోనికి, మెదడులోకి బులెట్లుదూరాయి. అయన స్పృహకోల్పోతూ నేలకొరిగాడు నలుగురు వ్యక్తులూ వచ్చిన పని పూర్తి కావటంతో వెనక్కి తిరిగి పారిపోయ్యారు

షాపు ముందు నిలబడి ఊరేగింపుని చూస్తున్న వ్యక్తులు తమ షాపు వెనక గదిలో గోల ఏమిటా అని వచ్చేసరికి డాక్టరుగారు రక్తపుమడుగులో దొర్లుతున్నారు. వాళ్ళు భయంగా అరుస్తూ డాక్టరుగారి కాంపౌండర్‌ని పిలవటానికి పరిగెత్తారు ఊరేగింపు అప్పటికే కదిలి వెళ్ళిపోయింది.

గొల్లున ఏడుస్తూ అందరూ డాక్టరుగారి చుట్టూ చేరు రక్తంలో తడిసిన అతని శరీరం మంకెన పువ్వులా తయారైంది వేలాది మంది పిల్లల ప్రాణాలు అవలీలగాకా పాడిన వాడు తన ప్రాణాలు నిలుపుకోవటానికి శతథాప్రయత్నిస్తున్నాడు

కనీ డాక్టరు కావటం వల్ల తానిక బతకనని తెలిసిపోయింది. ఐనా తక్షణ సాయం అందింతే బతకవచ్చు.

"నన్ను తొందరగా గాంధీ ఆస్పత్రికి తీసుకుపోండి!" అస్పష్టంగా అన్నాడు. ఐనా అక్కడవారికి అర్థమైంది కొంచెం దూరంలో వున్న మరో డాక్టర్‌ని కారు అడగటానికి ఒకరిద్దరు పరిగెత్తారు. వాళ్ళు వచ్చేలోపల డాక్టర్‌గారి స్థితి మరింత క్షీణించింది. అసలే ఆయన డయాబిటిస్ రోగి. రక్త స్రావం ఆగటం లేదు, "మా అమ్మాయినీ, అబ్బాయినీ పిలిపించండి." మగతలోనే అన్నాడు. డాక్టర్. మరో పదిహేను నిమిషాల తర్వాత గాంధీ ఆస్పత్రిలో అతణ్ని పరిశీలించిన డాక్టర్లు డాక్టర్ గారు మరణించాడని చెప్పారు.

ం ం ం

ఆ రోజు నగర వాసులకు ఒక పీడకల. పొద్దున్నే లేచి పేపర్లలో యస్సయి హత్యని చదివి విభ్రాంతులై ఇంకా తేరుకోకముందే డాక్టరు గారి హత్య! ఊరంతా దిగ్భ్రాంతపోయింది. అంత మంచి మనిషిని, అందరికీ అవసరమున్న మనిషినెందుకు హత్యచేశారు? ఇరవైఏళ్ళ నుంచి ఊరందరి నోళ్ళలో నానుతున్న పేరు ఈ రోజుతో మాసిపోతుందా?

రాజయ్య చెప్పిందంతావిన్న కృష్ణ మెదడు స్తంభించిపోయింది అతనిచేతిలో ఉన్న వస్తువు మీద పిడికిలి బిగుసుకుంది.

"ఈ హత్య చేసిందెవరో కాదు పోలీసులే!" అన్నాడు రాజయ్యతో రాజయ్య కృష్ణ మొహం చూసి భయపడ్డాడు అతనికి ఎన్నడూ చూడని మనిషి అతనిలో కన్పించాడు

"అవును. అందరూ అదే అనుకుంటున్నారు!" రాజయ్య అన్నాడు.

"సరే! ఇకనువ్వు వెళ్లు! ఇక్కడ ఎక్కువసేపుండటం మంచిది కాదు" కృష్ణ కదిలాడు. రాజయ్య అతన్ని జాగ్రత్తగా ఉండమని చెప్పి వెళ్ళిపోయాడు

కృష్ణ పిచ్చికోపంతో మెయిన్ రోడ్డు మీదనించే నడకసాగించాడు. ఎవడన్నా ఎదురైతే యమలోకానికి పంపేటట్టుగా నడుస్తున్నాడు. రోడ్డుకి రెండు పక్కలా షాపు లన్నీ మూసేసి ఉన్నాయి, అసలు రోడ్ల మీద నడవటానికి గూడా ప్రజలు భయపడు తున్నారు. అందరి ముఖాల్లోనూ భయం, సందేహం తాండవిస్తున్నాయి. అందరూ ఏదో పనులు చేస్తున్నట్టుగా ఉన్నారేగానీ ఎవరి మనసూ మనసులో లేదు. అందరి దృష్టీ డాక్టరు గారి ఇంటివైపే.

కృష్ణ డాక్టరుగారి ఇంటిని చేరుకునే సరికి అక్కడికి అందరూ వచ్చి చేరు తున్నారు. అతను కొట్టుకొంటున్న గుండెలతో గేట్లో అడుగు పెట్టాడు. ఇంటిముందు

కొబ్బరి చెట్టు స్తంభించిపోయినట్టుగావుంది ఇంటి కిటికీల మీదికి పాకిన తీగలన్నీ వాడి నల్లబడ్డాయి. ఇంటి ముందు గుమిగూడుకున్న జనంలో విషాదం. కోపం మిళితమై కన్పిస్తున్నాయి. ఒకరిద్దరు మనుషులు ఏడుస్తున్నారు. కొందరు ఇతర్లని అడిగి విషయం తెలుసుకుంటున్నారు. అక్కడ కాలం - స్థలం స్తంభించి పోయాయి.

లోపలికి వచ్చిన కృష్ణకి ఇంటిముందు గోపాల్ కన్పించడంతో వెళ్ళి అతని భుజం మీద చెయ్యి వేశాడు. గోపాల్ తలవంచుకున్నవాడల్లా తలెత్తి చూసి ఏడుస్తూ అతని భుజం మీద తలవాల్చాడు. లక్కాడలాంటి అతని దుర్బల శరీరం దుఃఖ భారంతో గజగజలాడింది.

కృష్ణ అతని భుజం మీద అనునయంగా నిమిరాడు. "ఎందుకయ్యా దుఃఖం? అన్నీ తెలిసీ ఏందుకేడుస్తావు?" అన్నాడు.

"ఇంత అవుతుందనుకోలేదు." దుఃఖం తెరలు గోపాల్ ఊపిరి తిత్తుల్ని గురగురమని పించాయి.

"ఎవరు మాత్రం ఎలా అనుకుంటారు? ఈపూరిలో నూనూగుమీసాలవస్తున్న ప్రతీయువకుడూ ఎప్పుడో ఒకప్పుడు ఆయన చేత ప్రాణాలు కాపాడబడ్డవాడే. ఆయన చికిత్స చెయ్యని శిశువులు ఇరవైఏళ్ళ నుంచీ ఈ ఊళ్ళో ఎవరూ లేరు. ఆఖరకు తనని చంపిన పోలీసు పిల్లల్ని కూడా ఆయన ఎన్నోసార్లు మృత్యుముఖం నించి తప్పించాడు. అలాంటి వాణ్ని ఎవరైనా చంపుతారని ఎవరన్నా అసలెలా ఊహిస్తారు?" కృష్ణ అన్నాడు

ఇంతలో గేటులోంచి సైకిలు తొక్కుకుంటూ బాజీరావు వచ్చాడు వస్తూనే అతడు సైకిలు అటుపైపు పడేసి కృష్ణనీ, గోపాల్‌నీ కావిలించుకుని ఏడ్చాడు. "ఎంత పని చేశారయ్యా లంజ కొడుకులు !" అని కళ్ళుతుడుచుకుని "బాడీ ఎప్పుడిస్తారట?" అనడిగాడు.

'రేపిస్తారట' అప్పుడే అక్కడికి వచ్చిన పత్రికా విలేకరి ఒకాయన అన్నాడు.

ఎక్కడినుండి వచ్చాయో పాడు మబ్బులు. ఉదయంనుంచీ ఊరిమీద వాలి జల్లుగా కురిసి చికాకు పెడుతున్నాయి. ఊరు గుండెలో గూడుకట్టుకున్న భయం, విషాదం కరిగిపోవటానికి సూర్యోదయం ఇంకా కాలేదు. డాక్టరు గారి ఇంటి ముందు పూరిజనం ఆయన అంతిమ దర్శనం కోసం బారులు తీరారు. మొదట పదులు, తర్వాత వందలు వేలల్లోకి మారింది జనసంఖ్య. యాభై రెండేళ్ళ యువకుడు ఎన్నడూ నవ్వుచెరగని మొహం. విశ్వాసం సడలని నుదురు. అనుభవం పండిన జుత్తు మనుషుల మీద అచంచలమైన ప్రేమ, విశ్వాసం కలబోసుకున్న అంత

రంగం. ఆయన డాక్టరు, ఆయన మిత్రుడు, ఆయన మనిషి, కొబ్బరి బోడెను అనుకుని కృష్ణ ఆలోచిస్తున్నాడు,

తుంపర మొదలై వర్షంగా మారింది, ఒక్కొక్కరూ రావటం మొదలై జన ప్రవాహమైంది. ఊరంతా అక్కడే వుంది. ప్రభుత్వం సైతం అక్కడే వుంది. ఆర్డీవో వచ్చిచూసి వెళ్ళాడు. పోలీసులు చుట్టూ మోహరించారు. వాతావరణంలో గంభీరత మనసుల్లోనూ వుంది.

తాత్కాలికంగా అమర్చిన వేదికమీద డాక్టరుగారి భౌతికకాయాన్ని ఉంచారు. పల్లీసం ఎదురుచూస్తున్నారు. జనంలో కలకలం మొదలైంది. పోలీసు అధికారి ఒకడు డాక్టరు గారి శవాన్ని సమీపించాడు. జనంతోపాటు తానూ దర్శనం చేసుకున్నట్లు నటించాడు. టోపితీసి చేత పట్టుకున్నాడు. క్షణం తర్వాత మళ్ళీ ధరించాడు పక్కకి జరిగి అక్కడున్న ఒక పెద్దమనిషితో అన్నాడు.

“త్వరగా కార్యక్రమం కానిస్తేమంచిది. ఆలస్యమవుతున్న కొద్దీ పరిస్థితులు మారుతాయి.”

వింటున్న కృష్ణ పళ్లుకొరికాడు. బతుకూ వీడిష్టమే చావూ వీడిష్టమేనా ? ఇంతలో పెద్దమనిషి అన్నాడు. “రావల్సిన వాళ్ళందరూ రాలేదండీ! వచ్చాకఅలాగే జరుగుతుంది.”

పోలీసు అధికారి నిట్టూర్చాడు “వచ్చిన వాళ్లు ఏం చేశారని ఇకరాబోయే వాళ్లు వచ్చి చేసేదేముంది? మనిషే పోయాక ఎవరు వచ్చి ఏంలాభం?” వేదాంతం మాట్లాడాడు

కృష్ణకు దుఃఖం పొర్లింది ఐనా కళ్ళ వెంట నీటిచుక్క రాలేదు. కన్నీరు ఇగిరి దుఃఖం నలిపేస్తోంది. ఎదురుగా రాజారావు, బాజీరావు గుండెలు అవిసేట్టుగా ఏడుస్తున్నారు.

డాక్టరుగారి అంతిమ దర్శనం కోసం వచ్చే జనాన్ని భయపెట్టటం కోసం సందు మూలల మీద పోలీసులు జీపుల్నీ, వ్యాన్లనీ నిలబెట్టారు. తుపాకులు చంక నేసుకుని వీధిఅంతా పహరా ఇచ్చారు జనం భయపడలేదు. రావటం మానలేదు.

బాజీరావు కళ్ళు తుడుచుకుంటూ కృష్ణ దగ్గరికి వచ్చాడు, ‘ఊరు తగలబడి పోతుందని అందరూ అనుకుంటున్నారు’ అన్నాడు

'ఎవరు తగలబెడతారు ?'

'డాక్టరుగారి హత్యకు ప్రతీకారంగా రాడికల్స్ ఆపనిచేస్తారని అనుకుంటు న్నారు"

కృష్ణనవ్వాడు. "ఇది పోలీసులు సృష్టించిన కట్టుకథే అయివుంటుంది. ఆ వుద్దేశమేవుంటే ఇరవై నాలుగ్గంటలు ఆగుతారా ? అన్నాడు.

"ఊరు ఉనికిని మరచింది. మనుషులు నిద్రని మరిచారు. అరే ! ధర్మరక్షకుడు నీకునీవే వూహుకున్న దురహంకారీ! నీకు తెల్లవారింది గమనించు. దురన్యాయ పూరితునపై దురాగ్రహంతో అంధుడవై నువు బరితెగించి, కత్తితో, దోపిడీతో ఏనాటి హైనావలె జనంమీద విరుచుకు పడ్డావు, నీచేత గల కత్తి రక్తదాహంగల రేచుకుక్క నాలిక. ఇప్పుడు నువు కుక్కవు. ఇక నీగతి అధోగతి'— అను కుంటున్నాడొక భావుకుడు

'బిడ్డా! నువునాకు పితృత్వం కలిగించిన క్షణాన్ని నేను మరచిపోలేను. కానీ నాపితృత్వాన్ని కాపాడిన మనిషిని గూడా మరచిపోలేను. నువు ఆరోగ్యంగా, చైతన్య వంతంగా ఉన్నది కొద్దిరోజులే. కాని తర్వాత నువునాకిచ్చిన ఆనందంకన్నదుఃఖమే ఎక్కువ. కానీ నీవయసు ఈనాడు ఇరవై ఏళ్లు. నిన్ను మృత్యువు నోటలోంచి చిటికెన వేలితో బయటికి లాగిన ఆ మనిషి ఈనాడు....' అనిపలవరిస్తున్నాడొక తండ్రి.

'నా బిడ్డను కాపాడితివి. నీ ప్రాణం చూసుకోలేకపోతివా? వాళ్ళ బిడ్డల్ని నీ దగ్గర బతికించుకున్నారు. నిన్నే చేతులారా చంపేశారా ? మేమంతా నీ మనుషులమే నిన్నుకాపాడుకోలేక పోతిమే. ఊరంతా నీ బిడ్డలే. మా బిడ్డలందరికీ నువుపోసిన ఊపిరే. ఇప్పుడెవరూ మా బిడ్డలకు దిక్కు ? నీలాంటి వాడెవడున్నాడు? అసలు న్నాడా? అసలుంటాడా?' అని ఘోషిస్తోందొక తల్లి.

* * * *

రెండు రోజుల్నించీ ఊరు మొత్తం స్తబ్దంగా వుంది. ఎవరు చెప్పకున్నా జనం బంద్ పాటించారు. ఇంటిచుట్టూ దిట్టంగా పోలీసు బందోబస్తు, పైగా సీక్రెట్ ఏజెంట్ల హడావిడీ ఉన్నప్పటికీ ఆయన భౌతికకాయాన్ని దర్శించని పురజనుడులేడు కంటతడి పెట్టని లక్ష్మీకొడుకులేడు. ఆరోజంగూడా తనవంతుగా అరగంటసేపు జల్లు కురిసింది.

ఆఖరికి-రెండవ రోజు శవయాత్ర మొదలైంది. వందమంది పోలీసులు రైఫిళ్ళు పిస్తోళ్ళు ధరించి రెండు వందలమంది ఉన్న ఊరేగింపుని సూపర్వైజ్ చేస్తుంటే ఊరంతా ఇండ్లెక్కి చూసింది. మిద్దెలెక్కి చూసింది. మేడలు, డాబాలు అన్నీ ఎక్కి ఊరు కళ్ళు రిక్కించింది. జనం నినాదాల్ని దిగమింగి ద్వేషాన్ని కళ్ళ లోంచి కక్కారు.

మహాత్మాగాంధీ రోడ్డుమీద హింసకు బలైన డాక్టరుగారి శవం వెనక అహింసా పోలీసుల బూట్ల చప్పుడులో విప్లవ నినాదాలు అణిగిపోయాయి. కోపంతో గొంతులు పెగలకపోతే అది భయంగా భ్రమించారు. భయం జనాన్ని రెచ్చగొట్టింది. కొత్త వాడలోకి శవయాత్ర చేరేసరికి జనం రెండింతలయ్యారు. కొత్తవాడదాటి ఆటోనగర్ స్మశానం చేరేసరికి నాల్గింతలయారు. శ్మశానం గేటు దగ్గర పోలీసుల కాపలా. మను షుల మొహాల్ని చూడటం, వదలటం, ఏమాత్రం పనికి వచ్చే మనిషైనా లాగి వ్యానో ఎక్కించటం, పోలీసులు స్మశానం చుట్టూ వలయంగా ఏర్పడ్డారు. ముఖ్యులిన తప్ప ఎవర్నీ లోపలికి పోనీయలేదు. లోపల ముళ్ళ కంపలు, కాలినచితుల బూడి దలు, వర్షానికి చిత్తడిగా మారిననేల. స్మశానం బీభత్సంగా వుంది. ఎక్కడినుంచి పుట్టుకొచ్చారో తెలియదు. ముళ్ళపొదల చాటునించీ, సమాధుల వెనకనించీ జనం వచ్చి చేరుతున్నారు. ఎవడు ఎక్కడ ఎవర్ని ఆపితేనేం? ఎవరు ఎక్కడికి రావాలో వాళ్ళంతా అక్కడికి వచ్చి చేరుతూనే వున్నారు. అంతదాకా గంభీరంగా వున్నవాళ్లు కూడా అక్కడికి వచ్చాక ఏడవకుండా ఉండలేక పోయారు.

కృష్ణ ఒక సమాధినానుకుని నిలబడ్డాడు. ఎదురుగా చితిమీద డాక్టరుగారు. ఎక్కడెక్కడి జనమో, ఏనాటి జ్ఞాపకాలో, ఏతీరు కృతజ్ఞతో వచ్చి చితికి నమస్క రిస్తున్నారు. ఆయన పాదాలకి దండంపెడుతున్నారు. శత్రువు చక్రవ్యూహం జనం ప్రేమని ఆపలేకపోయింది మఫ్టీలో ఉన్న స్పెషల్ బ్రాంచి ఏజెంట్లు బిత్తరపోయి చూస్తున్నారు. ఎంత రహస్యంగా కనీసం పరిమితంగానైనా దహనకార్యక్రమం జరి పిద్దామనుకుంటే చివరికి ఇంత పెద్దగా తయారైంది. ప్రహరీ గోడచుట్టూ పోలీసులు దూరంగా ఇళ్లు ఎక్కిచూస్తూ జనం.

ఎదురుగా ప్రాణదాత ప్రజ్వలిస్తున్నాడు. ప్రాణదాత నుంచి చెలరేగుతున్న మంటల కొసలమీద విషాద వర్తమానమూ, ఆశావహ భవిష్యత్తూ సంఘర్షిస్తున్నాయి.

కుల సమస్య - రాజకీయ దృక్పథం

కె. బాలగోపాల్

కుల సమస్య ఇవాళ కొత్తగా వచ్చింది కాదుగానీ ఇవ్వాళ గతంలో కంటే ఎక్కువగా చర్చకు వచ్చింది. అది చర్చకు రావడానికి గల కారణం సమకాలీన చరిత్రే.

కారంచేడు నుండి వరసగా జరుగుతూన్న అత్యాచారాలు ఒక కఠినమయిన వాస్తవాన్ని మన ముందు చర్చకు పెట్టాయి. ఈ దాడులలో ముద్దాయిలు అగ్రకులాలకు చెందిన వారే అయినా ఎక్కువగా సామాన్య రైతాంగమే. వాళ్ళు ఆర్థికంగా తమతో ఎక్కువ తేడా లేనటువంటి హరిజన పేద రైతాంగం కూలిజనాలపైన కులం పేరిట దాడులు చేస్తున్నారంటే కులం అనేది వర్గాన్ని రెండుగా చీల్చి శత్రుబృందాలను మార్చ గలుగుతుందా అనే ప్రశ్న వస్తుంది.

ఈ అత్యాచారాలకు ప్రతి స్పందనగా ఏర్పడిన దళిత ఉద్యమం మరొక ప్రశ్నను ముందుకు తెచ్చింది. అగ్ర కులాలలో పుట్టిన ప్రజాస్వామిక వాదుల మీద కక్ష గట్టినట్లు దాడులు చేసే తెలివి తక్కువతనాన్ని అటుంచి, సహేతుకమైన విమర్శకు తావు ఉందన్న సంగతి దళిత ఉద్యమం గుర్తు చేసింది. కులం అనేది ఒక ఉపరితల అంశమనీ, వర్గ పోరాటం ఫలితంగా పునాదిని ముందు విప్లవీకరిస్తే ఆపైన ఉపరితలంలో అని వార్యంగా (లేక ప్రయత్న పూర్వకంగా జరిగే సాంస్కృతిక విప్లవ పోరాట ఫలితంగా) వచ్చే మార్పులలో భాగంగా కులం అనేది మాయమయిపోతుందనీ భావించడం ఎంతవరకు సమంజసం అనేది ఈ ప్రశ్న. దానికి అనుబంధంగా, విప్లవ ప్రజానీకం చొరవతోనూ చైతన్యంతోనూ సంఘటిత పడడంలో వెనుకబాటుతనాన్ని ప్రదర్శించడానికి, వర్గ సమాజంలో ఎప్పుడయినా వుండే ఆర్థిక సాంస్కృతిక అవరోధాలతో బాటు "కులం" కూడ ఒక కారణం అని గుర్తించి దానిని ప్రతిఘటించనవసరం లేదా అనే ప్రశ్న వస్తుంది. సమస్య తన పరిష్కారానికి తానే అడ్డం అయినట్టు చొరవతోనూ చైతన్యంతోనూ అసమతుల్యం ఉండడానికి కులం ఒక కారణంకాగా దాని ఫలితంగా ప్రజా ఉద్యమాల అగ్రశ్రేణులలో కులం

రీత్యా ఆధిక్యస్థానంలో వున్నవాళ్ళే ఎక్కువ ఉండడం అనేది జరిగితే, అది కుల సమస్య పరిష్కారానికీ అసలైన ప్రజా ఉద్యమ పురోగమనానికీ అవరోధం కాదా అనే ప్రశ్న కూడ వస్తుంది. దళితుల సమస్యలు దళితులే పరిష్కరించు కుంటారనీ స్త్రీల సమస్యలు స్త్రీలే పరిష్కరించుకుంటారనీ, గిరిజనులే సమస్యలు పరిష్కరించుకుంటారనీ, ముస్లింల సమస్యలు ముస్లింలే పరిష్కరించుకుంటారనీ భావించడం ఎవరి సమస్యలూ పరిష్కారం కాకుండ ఉండడానికే ఉపయోగపడ తుంది (అందుకోసమే, కాంగ్రెస్ ప్రభుత్వం తయారు చేసి పార్లమెంటు ముందు ఉంచిన పారిశ్రామిక వివాదాల సవరణ బిల్లులో, కార్మికుల సమస్యలు కార్మికులే పరిష్కరించుకోవాలి, అనే వాదనతో యూనియన్లలో కార్మికేతరుల పాత్రను నిర్బంధంగా తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు) అయితే ఈ ఆలోచనల వెనక వున్న ఒక న్యాయమయిన ప్రశ్నను గుర్తించాలి. అణచివేతకు గురయ్యే ప్రజలు ప్రతిఘటనా చైతన్యాన్ని స్వంతం చేసుకోనిదే అంతిమంగా మార్పురాదు. అది జరిగినప్పుడు, పీడిత ప్రజానీకం తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా చేసే పోరాటానికి అన్ని వర్గాల నుండీ నాయకత్వం సమంగా పుట్టుకొస్తుంది. అది జరగకపోతే ఏదో లోపం వున్నట్టు గుర్తించడం అవసరం. ఉద్యమాల నాయకత్వం అట్టడుగు కులాల నుండీ స్త్రీలనుండీ మైనారిటీలనుండి సమపాళ్ళలో సహజంగానే పుట్టుకు రాకపోవడం ఒకలోపాన్ని సూచిస్తుందన్న వాదనను కొట్టి పారేయడానికి వీలులేదు.

గతంలో కులం ప్రస్తావన తీసుకురావడానికి వెనకాడే పాలక వర్గాలు ఇప్పుడు తమ కొట్లాటలలో కులం ప్రసక్తి బాహాటంగా తీసుకు రావడం ఎందుకు జరుగుతోంది అనేది మరొక చర్చనీయాంశం "తెలుగుదేశం కమ్మకులం పార్టీ" అని కాంగ్రెస్ వాళ్ళూ, "కాంగ్రెస్ రెడ్డి, బ్రాహ్మణ పార్టీ" అని తెలుగుదేశం వాళ్ళూ ఉపన్యాసాలలోనే కాక హైకోర్టు సమక్షంలో చేసే వాదనలలోనూ పరస్పరం ఆరోపించుకోవడం మొత్తం పాలక వర్గాల శ్రేయస్సుకే నష్టదాయకం కాదా? మరయితే ఈ పని ఎందుకు చేస్తున్నారు? కులం శ్రామిక వర్గాన్ని రెండు శత్రుబృందాలుగా చీల్చగలదా అని ప్రశ్నించుకున్నట్టే అది పాలక వర్గాలను కూడ చీల్చగలదా అని ప్రశ్నించుకోవలసి వస్తుంది.

ఈ ప్రశ్నను ఇవాళ చర్చించుకోవాలి. కఠినమయిన సమస్యలు ఎదురయినప్పుడు చర్చించకుండ ఊరుకోవడం ఒక పొరబాటయితే, ఉదారవాద దృక్పథంతో చర్చించి మార్క్సిస్టు ముక్తాయింపును జోడించడం తరచుగా జరిగే మరొక

పొరబాటు ఈ రెండు పద్ధతులో కాకుండ "కుల సమస్య"ను మార్క్సిస్టు దృక్పథంతో చర్చించడం అవసరం అన్ని కోణాల నుండీ పరిశీలించి సమగ్రంగా సమాధానం చెప్పడం ఒక్క వ్యాసంలో సాధ్యం కాదుగానీ ముఖ్యమైన విషయాలను పరిశీలించాలి.

నేపథ్యం

మొదటిగా, కులం కేవలం ఒక ఉపరితల అంశం అనేది ఈ నాడే కాదు, ఏనాడు నిజం కాదు. కులం పునాదికీ ఉపరితలానికీ కూడ సంబంధించిన విషయం **caste is a meterial relation of production as well as an ideology** అదే దాని బలం.

కులానికి గల సామాజిక పాత్రలో మూడు అంశాలున్నాయి. (1) ఒక స్వతంత్రమైన ఆర్థిక జీవన విధానాన్ని అనుసరిస్తూ విడిగా బ్రతుకుతున్న తెగలను నాగరిక సమాజంలో కలుపుకొని పాలక వర్గాల దోపిడీకి లోబరచు కొనడానికి కులం ఒక నిర్మాణ రూపంగా ఉపయోగపడింది ఆ క్రమంలో ఒకవైపు పరసంపర్క నిషేధం వంటి గణ జీవిత లక్షణాలు కులలకు సంక్రమించగా, గణజీవితంలో లేని దోపిడీ అసమానతలు కొత్తగా వచ్చాయి. ఇప్పుడిప్పుడే తెగనుండి కులంగా మారుతూన్న ప్రజలను చూస్తే ఈ విషయం బాగా అర్థం అవుతుంది. (ఉదాహరణకు తూర్పు గోదావరి జిల్లా నుండి శ్రీకాకుళం దాకా తీరప్రాంతంలో అగ్ని కులక్షత్రియులు అనే కులం తటస్థ పడుతుంది. కోనసీమలో వీళ్ళు చాలా చోట్ల ప్రత్యేక గ్రామాలలో వుంటూ చేపలు పట్టుకునే తెగగా జీవిస్తున్నారు అయితే శ్రీకాకుళంలో మట్టుకు గ్రామాలలో స్థిరపడి చిన్న రైతులుగా బ్రతుకున్నారు. తెగ లక్షణాలు పూర్తిగా పోకపోయినా కులవ్యవస్థలో శ్రామికులకు సహజమైన ఆత్మన్యూనతా భావం మొదలయిన లక్షణాలు అలవరచుకున్నారు) (2) ఒక కులంలో పుట్టిన వారికి ఆ కుల వృత్తికి సంబంధించిన సామర్థ్యమే తప్ప వేరే నైపుణ్యంగానీ పనిముట్లుగానీ ఉత్పత్తి సాధనాలుగానీ విజ్ఞానంగానీ లేకుండా చేయడం ద్వారా, నాగరిక సమాజానికి అవసరమయిన విభిన్న ఉత్పత్తులను సరఫరా చేసే శ్రామిక జనాన్ని కులవ్యవస్థ తయారుచేసింది. ముఖ్యంగా అంటరానితనం అనేది కారుచవగ్గా పనిచేసే భూమిలేని కూలి జనాన్నీ భృత్యులనూ సమకూర్చింది. బానిసవ్యవస్థలోలాగా ప్రత్యక్ష బలప్రయోగాన్ని ప్రధాన నిర్బంధ సాధనంగా వినియోగించకుండ, సామాజిక నిర్మాణం ద్వారానే కావలసిన ఫలితాన్ని

సాధించింది కుల వ్యవస్థ ఈ నిర్మాణాన్ని నిలబెట్టడం అధికార యంత్రాంగం బాధ్యత దీనిని సమర్థవంతంగా నిలబెట్టినవాడు "ధర్మప్రభువు" (౯) సామాజిక నిర్మాణంలోవున్న ఈ నిర్బంధానికి తాత్విక సాంస్కృతిక ఆమోదం కల్పించే చైతన్య రూపం కుల వ్యవస్థలోని మూడవ అంశం. భౌతిక శ్రమ అన్ని రకాల శ్రమలోనికీ నీచమయినదనీ, అందులోనూ కొన్ని రకాల శ్రమ మరీ నీచమయినదనీ కుల వ్యవస్థ బోధిస్తుంది. మనుషు పుట్టడమే తమ పూర్వ కర్మలకు ఉచితమయిన కులాలలో పుడతారనీ, తదనుగుణ్యమయిన జీవితాన్ని ఆచరించడమే సన్మార్గమనీ ధర్మవర్తనం అనీ అంటుంది గుణకర్మలను అనుసరించి తానే మనుషులను కులాలుగా విభజించాననీ, పరధర్మం ఎంత ఆకర్షణీయంగా అనిపించినా స్వధర్మాన్ని వదిలిపెట్టి దానిని ఆచరించడం ప్రమాదకరమనీ నారాయణుడు భగవద్గీతలో స్వయంగా అంటాడు అష్టాదశ పురాణాలనుండి వేలాదిగా ఈ దేశంలో ప్రచారమయిన పుక్కిటి పురాణాల దాకా అన్నీ ఈ సందేశాన్నే చెప్తాయి వీటిని ప్రచారంలో పెట్టడం బ్రాహ్మణుల కర్తవ్యం.

భారతీయ ఫ్యూడలిజంలో ఈ విధంగా కీలకమయిన పాత్రను నిర్వహించిన కులవ్యవస్థ ఆ రోజులలోనే అనేక ఒత్తిడులనూ ఎదుర్కొంది ఆర్థిక రంగంలో వచ్చిన మార్పుల ఫలితంగా కొత్త వృత్తులు పుట్టుకొచ్చాయి పాత వృత్తులకు కొత్త ప్రాముఖ్యము వచ్చింది సాంకేతిక పురోగతి వల్ల కొన్ని కులాలు ఆర్థికంగా బలపడ్డాయి. కొందరు వ్యక్తులు వ్యక్తిగతంగా కులవ్యవస్థను ఛేదించుకొని ఉన్నత పదవులను అందుకున్నారు. అయితే ఇవేవీ కులవ్యవస్థను మౌలికంగా మార్చలేదు. కుల వ్యతిరేక ఉద్యమాలు కూడ చాలా జరిగాయి గానీ అవికూడ కులవ్యవస్థను నాశనము చేయలేక పోయాయి. అతికొద్ది మినహాయింపులతో, ఈ ఉద్యమాలలో ఏవీ కూడ కులవవస్థకూ బ్రాహ్మణ భావజాలానికీ కీలకమైన ధర్మం, ఆత్మ, మోక్షం, అనే భావనలనూ కర్మ సిద్ధాంతానీ తిరస్కరించలేదు కులవివక్షనూ బ్రాహ్మణ ఆధిక్యాన్ని మట్టుకే తిరస్కరించాయి. వాటిలో కొన్ని ఉద్యమాలు తామూ ఒక కుల రూపం తీసుకోని కులవ్యవస్థలో కలిసిపోయాయి. కొన్ని అల్ప సంఖ్యాక మతాలుగా స్థిరపడిపోయి కులవ్యవస్థలోని అనేక అవలక్షణాలను తామూ ఒంటబట్టించుకున్నాయి. కొన్ని కేవలం పాఠ్య పుస్తకాలలో పాఠ్యాంశాలగానూ, మన చరిత్రలోనూ అభ్యుదయం లేకపోలేదని గొప్పలు చెప్పుకోవడానికి దృష్టాంతాలగానూ మిగిలిపోయాయి కొన్ని పూర్తిగా నామరూపాలు లేకుండ పోయాయి

"పెట్టుబడి" కూడ కులవ్యవస్థను దెబ్బతీయగలదు. పెట్టుబడి అంటే డబ్బు కాదు పెట్టుబడి అనేది ఒక సామాజిక సంబంధం, ఒక వ్యవస్థ. ఉత్పత్తిసాధనాలనూ పనిముట్లను కోల్పోయి 'బజారునపడ్డ' శ్రామికుల శ్రమ శక్తిని స్వేచ్ఛా వినిమయంలో కొనుగోలుచేసి లాభార్జనదృష్టితో అమ్మకపు సరకులను ఉత్పత్తిచేసి తనను తాను పునర్వ్యాప్తి చేసుకుంటుంది పెట్టుబడి అక్రమంలో ఉత్పత్తి సాధనాలూ, శ్రామికుల నైపుణ్యమూ, విజ్ఞానస్థాయీ సాంకేతికంగా పురోగమనం చెందుతాయి. దీనికి అర్థం వచ్చే ఫ్యూడల్ నిర్బంధాలనుండి ఇటు వనరులనూ అటు శ్రమశక్తినికూడా పెట్టుబడి విముక్తి చేస్తుంది. అందుకోసం తలపడవలసిన ఉపరితల అంశాలతో తలపడుతుంది. మన దేశంలో పెట్టుబడి అనేది అభివృద్ధి చెంది వుంటే శ్రామికులను కులవ్యవస్థనుండి విముక్తిచేసి కార్మికులుగా మార్చివుండేది.

బ్రిటిష్ వాళ్ళు రాకపోతే మనదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ స్వతంత్రంగా అభివృద్ధి చెంది వుండేదా అనేది తెగని చర్చ. మొగలాయీ పాలన కాలంలోనే పెట్టుబడిదారీ సంబంధాలు బలంగా వేళ్లూని విస్తరించాయని మొదట్లో సోవియట్ పరిశీలకులు సిద్ధాంతీకరించారు. అది నిజంకాదనీ, ఒక సిద్ధాంత చట్టాన్ని వాస్తవాల మీద బలవంతంగా రుద్దిన ఫలితంగా చేసిన నిర్ధారణేనని ఇర్ఫాన్ హబీబ్ వంటి భారతీయ చరిత్రకారులు వాదించగా వాళ్ళు కూడ ఈమధ్య తమ అభిప్రాయాలను కొంత సవరించుకొన్నట్టు ఉన్నారు. ఏదేలాగున్నా బ్రిటీష్ వాళ్ళ రాకతో మొదట వర్తక పెట్టుబడి రూపంలోనూ సామ్రాజ్య వాద వర్తక పెట్టుబడి రూపంలోనూ "పెట్టుబడి" మన దేశంలోనికి బయటి నుండి ప్రవేశించింది. కుల వ్యవస్థనూ స్వయం పోషక గ్రామీణ వ్యవస్థను కొంతమేరను దెబ్బతీసింది అయితే సంపూర్ణంగా దెబ్బతీసే అవసరంకానీ సామర్థ్యంగానీ సామ్రాజ్యవాద పెట్టుబడికి లేవని త్వరలోనే స్పష్టం అయింది.

ఫ్యూడల్ దశలో కులవ్యవసకు ఉన్నట్టు చెప్పుతున్న పైమూడు లక్షణాలలో మొదటిది ఎట్లాగూ (పెట్టుబడి ప్రమేయం లేకుండానే) చారిత్రకంగా అప్రధానం అయిపోయింది, రెండవ విషయంలో సుమారుగా మార్పు వచ్చింది. పెట్టుబడి సాంద్రతనూ సాంకేతిక పురోగతినీ ప్రమాణంగా తీసుకొని ఆర్థిక రంగాన్ని సంఘటిత (organised) అసంఘటిత (un rganised) రంగాలుగా విభజిస్తే, ఉత్పత్తి సంబంధాలలో కులానికి చెందిన పాత్ర సంఘటిత ఆర్థిక రంగంలో చాలావరకు నశించింది.

అసంఘటిత ఆర్థిక రంగంలో మట్టుకు ఇప్పటికీ ఉత్పత్తి సాధనాలకూ పనిముట్లకూ నైపుణ్యానికీ అటు మనుషులకూ మధ్యనున్న సంబంధాన్ని నిర్ణయించడంలో కులం ప్రధానపాత్ర కాకున్నా కీలకమయినపాత్ర నిర్వహిస్తోంది. చాకలి మంగలి కుమ్మరి బెస్త మేదరి గొల్ల తదితర కులాలలో పుట్టినవారికి ఇప్పటికీ వేరే వృత్తులకు సంబంధించిన నైపుణ్యంగానీ పనిముట్లుగానీ అందుబాట్లోలేవు. కాపు అనే పేర్లతో పిలవబడే అనేక కులాలలో అత్యధిక భాగానికి చిన్నకారు సేద్యమూ, హరిజనులకు అసంఘటిత శ్రామిక రంగమూ, తప్ప వేరే జీవన మార్పులు అందుబాట్లో లేవు.

కాగా, సంఘటిత ఆర్థిక రంగంలోనూ అసలు కుల ప్రమేయమే లేదనుకోవడం సరయింది కాదు నిజానికి ఆ రంగంలోనే కుల ప్రమేయం కొత్త రూపాలలో - మరింత వికృత రూపాలలో - కనపడుతుంది. సంఘటిత రంగంలో అగ్రకులాలసాంద్రత మొత్తం సమాజంలో కంటే బాగా ఎక్కువగా వుంటుంది. నిమ్నకులాలవాళ్ళు బాగా తక్కువగా కనపడతారు, సంఘటిత రంగంలో ముఖ్యభాగమయిన ప్రభుత్వ ఉద్యోగ రంగంలో రిజర్వేషన్లు లేకపోతే ఆ మాత్రం కూడ ఉండకపోదురేమో! మరింత ఎక్కువగా వాళ్ళు ప్రవేశించాలని ప్రయత్నం చేసినప్పుడల్లా రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాల దుమారం చెలరేగుతుంది. అంతేకాక, కులం సంఘటిత రంగంలో తన సాంప్రదాయిక పాత్రను కోల్పోయినప్పటికీ పెట్టుబడికీ ఉద్యోగాలకూ సంబంధించిన పోటీలో ఒక సాధనంగా ఉపయోగపడుతూ నేవుంది. రుణాలూ లైసెన్సులూ కాంట్రాక్టులూ సంపాదించడంలోనూ ఉద్యోగాల పోటీలోనూ కులం నిర్వహిస్తున్న పాత్ర మనకు నిత్యజీవిత అనుభవమే. ఈ పోటీని బూర్జువా భావజాలం గొప్పగా ఆకాశానికి ఎత్తుతుందిగానీ ఇందులో అభద్రత (insecurity) ఒక ముఖ్యమయిన అంశం. పెట్టుబడిఎక్కడుంటే అక్కడ అభద్రత ఉంటుంది అందులోనూ పెట్టుబడి (మన దేశంలోలాగ) అస్వతంత్రం అయితే మరీ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల కులం కల్పించే కృత్రిమమయిన భద్రతకోసం జనం కులతత్వాన్ని ఆశ్రయించటం సంఘటిత ఆర్థికరంగంలోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఈ కారణంగానే వెనుకబడిన ప్రాంతాలకంటే "అభివృద్ధి చెందిన" ప్రాంతాలలోనే కులతత్వం ఎక్కువ ఉందనిపిస్తుంది.

ఇక మూడవ విషయానికొస్తే, మనుషులు తమ "గుణకర్మలను" బట్టి స్వాభావికంగానే అసమానంగా వుంటారన్న భగవద్గీత ప్రవచనం భారతీయ భావజాలంలో ఈనాటికీ చాలా బలంగా వుంది. అనేక ప్రజాతంత్ర ఉద్యమాలను చూసిన ఈ

దేశంలో కర్మసిద్ధాంతాన్నీ కుల ధర్మాన్నీ బాహాటంగా ప్రచారం చేయడం పాలక వర్గాలకు సాధ్యంకాదుగానీ అణువణువునా ఈ రెండింటినీ జీర్ణించుకున్న బ్రాహ్మణ భావజాలం భారత పాలక వర్గాల భావజాలంతో అతి ముఖ్యమయిన అంశం. అందులో అంతర్లీనంగానే వుంటూ ఇవి రెండూ వ్యాప్తిచెందుతూ వుంటాయి. ఈ విషయంలో మనకేమయినా అనుమానం ఉంటే టి వి ప్రసారాలను దేశంనలుమూలలకూ వ్యాపింపజేసి క్రమం తప్పకుండా చూపిస్తున్న రామాయణ మహాభారతాలలో ప్రసారం అవుతూన్న కథలను కాక సందేశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే అనుమానం తీరతుంది అంత కష్టపడనక్కరలేదు. ఏ టీ బంకు దగ్గరయినా నిలబడి ఘంటసాల భగవద్గీత క్యాసెట్ విన్నా ఈ విషయం అర్ధమవుతుంది.

రాజకీయాలు - కులం

వలస దేశాలలో ప్రజాతంత్ర విప్లవం అంటే భూస్వామ్య సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవం. మన జాతీయోద్యమం కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోకి పోవడం వలన ఈ విప్లవ కర్తవ్యం సంపూర్ణంకాలేదు. కులం అనే సామాజిక అంశానికి సంబంధించి ఈ అసంపూర్తి ఎటువంటిదో పైన వివరించాము. కుల నిర్మూలనం ప్రజాతంత్ర విప్లవాన్ని ముందుకు తీసుకుపోతున్న విప్లవశక్తులకర్తవ్యం. అయితే దాని అర్ధం ప్రజాతంత్ర విప్లవశక్తులు కుల నిర్మూలన పోరాటాన్ని చేపట్టాలనికాదు. మత నిర్మూలన ఉద్యమాలతో కులంపోదు. కులంఅనేది పోనిదే ఈ దేశంలో ప్రజాస్వామ్యంగానీ సోషలిజంగానీ సాధ్యం కావన్న అంబేద్కర్ అభిప్రాయంతో విభేదంలేదు ఐతే ప్రజాస్వామ్యమయినా సోషలిజమయినా రావాలంటే ముందు కుల వ్యతిరేక ఉద్యమాలు నడపాలని దానినుండి అర్ధం చేసుకుంటే పొరబాటవుతుంది. కులసమస్య విప్లవం తరువాత పరిష్కారమవుతుందని వదిలేయడం ఎంత తప్పో ఇదీ అంతే తప్పు.

ప్రజాతంత్ర విప్లవ పోరాటంలో అంతర్భాగంగా కుల సమస్యతో తలపడడం సరయిన వైఖరి. కులసమస్యను విడిగా విశ్లేషించి దానితో విడిగా తలపడటము వలన ప్రయోజనములేదు. దానిని వ్యవసాయక విప్లవ పోరాటములో అంతర్భాగంగా విశ్లేషించి ఆ పోరాటంలో అంతర్భాగంగా తలపడాలి ఈ దృష్టితో విశ్లేషించినప్పుడు ప్రస్తుత దేశ రాజకీయాలలో కులం పాత్ర మూడు రకాలుగా కనబడుతున్నది :

1. పాలక వర్గాల అంతఃకలహాలలో కులం
2. పాలక వర్గాలకూ ప్రజలకూ మధ్యనున్న వైరుధ్యంలో కులం
3. ప్రజలమధ్య సంబంధాలలో కులం

వీటిని విడివిడిగా చర్చిద్దాం

1. గత దశాబ్ద కాలంలో మనదేశ పాలక వర్గాలలో అనైక్యత చాలా పెరిగింది. తన నూరేళ్ళ చరిత్రలో కాంగ్రెస్ పార్టీ సాధించిన ప్రధానమయిన విజయం దేశ పాలకవర్గాలను ఐక్యంగా ఉంచగం. భూస్వాములు, వ్యాపారస్తులు, పెద్ద పెట్టుబడిదార్లు వివిధ సామ్రాజ్యవాద దేశాల కంపెనీలు-అందరినీ అన్నింటినీ ఒక తాటి మీద నడిపి, అందరి అవసరాలూ తీరేటట్లు ఆర్థిక వ్యూహాన్ని కాంగ్రెసు నాయకత్వం రచించింది ఇప్పుడు కాంగ్రెసు పార్టీ పతనంగా మనకు కనపడుతున్న రాజకీయ పరిణామం వెనుకనున్నది. బీటలువారుతూన్న ఐక్యత జాతీయ ఉద్యమకాలంలో గాంధి నాయకత్వంలోనూ ఆ తరువాత నెహ్రూ నాయకత్వంలోను ఈ ఐక్యతను నిలబెట్టడానికి రచించిన రాజకీయార్థిక వ్యూహానికి కాలం చెల్లిపోయింది. అది ఎందుకు జరిగిందని చర్చించడం ఇక్కడ సాధ్యపడదుగానీ, ఇకమీదట ఐక్యత అంటూ సాధ్యం కావాలంటే అది కొత్త ప్రాతిపదిక మీదనే జరగగలదు, ఆ కొత్త ప్రాతిపదికకోసం, దాని సాధించగల నాయకునికోసం, ఇవ్వాళ పాలకవర్గాలు అన్వేషిస్తున్నారు. రాజీవ్ గాంధీ మీద చాలామందికి నమ్మకంపోయిందిగానీ అందరికీ సమ్మతమైన ప్రత్యామ్నాయం ఎవ్వరికీ కనపడడంలేదు. ఈ లోపల పాలకవర్గాలలోని వివిధ సెక్షన్లు ఉమ్మడి ప్రయోజనాలను ఉపేక్షించి ఎవరికి తోచిన దిక్కుకు వారు బండిని లాగుతున్నారు దానితో బాటు అసలు సమస్య సత్వరంగా పరిష్కారం అవుతుందన్న నమ్మకం కూడ పోయేసరికి ఎవరికివారు తామూ తమవారూ ఎంత వేగంగా ఎంత ఆస్తి సంపాదించుకోగలిగితే అంత సంపాదించుకొని బయటపడాలని చూస్తున్నారు, ఈ పరిస్థితిలో అనేక విషయాలను చర్చకు పెడుతున్నారు. అనేక తొందరపాటు చర్యలకు పాల్పడుతున్నారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి, అధికార వికేంద్రీకరణ, ప్రణాళికల వైఫల్యం చర్చకు వస్తున్నాయి. నిన్నటిదాకా జాతికి గర్వకారణం అని అందరూ పొగిడిన ఆర్థిక పారిశ్రామిక విజయాలను ఇవ్వాళ తామే వేళాకోళం చేస్తున్నారు. ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొడుతున్నారు ఒకరి కుంభకోణాలు ఒకరు బయటపెట్టుకుంటున్నారు. కులంపేరుపెట్టి తిట్టుకుంటున్నారు. దీర్ఘకాలిక దృష్టిలో ఇవి తొందరపాటు చర్యలే. అయితే వాళ్ళు ప్రస్తుతం దీర్ఘకాలిక దృష్టితో చూడడంలేదు

కులం పేరుమీద తిట్టుకోవటానికి ఒక హేతుబద్ధమయిన కారణంకూడ వుంది. పాలకవర్గాల అంతర్గత కలహాలలో ఎవరికివారు జనాన్ని తమ వెంట సమీకరించుకోవాలని చూడడం సహజం. అది ఎన్నికలకు ఎంత అవసరమో గూండా దాడులకూ అంత అవసరం. ఈ జనసమీకరణకు కులం చాలా చవకయిన సాధనం. అగ్రకులాలలో పాలకవర్గాలకు చెందినవారు అల్పసంఖ్యాకులే అయినా కులాభిమానం జనసామాన్యంలో విస్తృతంగా ఉంటుంది కాబట్టి "తెలుగుదేశం పాలనలో రెడ్లకు అన్యాయం జరుగుతోంది" అనే ఆరోపణ ధనవంతులైన పెద్దరెడ్లవెనక ఆ కులానికి చెందిన సామాన్య రైతాంగాన్ని సమీకరించడానికి చక్కగా ఉపయోగపడుతుంది. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావానికి కృషిచేసినవారు "కాంగ్రెస్‌పాలనలో కమ్మకులానికిసరయిన ప్రాతినిధ్యం ఇవ్వలేదు" అనే వాదనతో ఆ కులానికి చెందిన సామాన్యజనాన్ని తమ వెంట చాలా చాకచక్యంగా సమీకరించుకున్నారు. వంగవీటి మోహనరంగారావు దేవినేని-మురళి హత్యకేసులో జైలుకుపోయిన తరువాతే కాపునాయకుడయ్యాడు. ముద్రగడ పద్మనాభంకు తెలుగుదేశం నాయకత్వంతో చెడిపిన తరువాతే ఆయనకూడ కాపు నాయకుడయ్యాడు. "కాపునాడు" వీళ్ళిద్దరికీ రాజకీయభద్రత సమకూర్చడం కోసం పుట్టింది. ఇది అగ్రవర్ణాలకే పరిమితంకాదు. కె. ఇ. కృష్ణమూర్తికూడ ఎన్టీఆర్‌తో తగవుపడిన తరువాతే వెనుకబడ్డవర్గాల నాయకుడయ్యాడు అంతవరకు ఆయన కర్నూలుజిల్లాలో హత్యలకు పేరుపడినంతగా వేరే దేనికీ పేరు పడలేదు.

"కుల ప్రయోజనం" అనేది ఒకటివుందనే భ్రమ సామాన్యజనంలో ఉండబట్టే ఇది సాధ్యం అయింది. అగ్రకులాలకు చెందిన కొందరు వ్యక్తులు పదవులో ప్రాముఖ్యతో సంపాదించుకుంటే అది తమకే వచ్చినట్టు ఆ కులాలకు చెందినసామాన్య జనం సంబరపడే పరిస్థితి- వాళ్ళతో "ఐడెంటిఫై" అయ్యే పరిస్థితి- ఇవ్వాళ వుంది. అది వున్నంతకాలమే పాలకవర్గాల రాజకీయాలు కులంపేరిట మాట్లాడగలవు. ఈ తప్పుడు చైతన్యం పోరాటక్రమంలో దానంతట అదే పోదు అందుకు విరుద్ధంగా, అది పోరాటక్రమానికి అవరోధంకూడ కాగలదు. పోరాటక్రమంలో దానిని ముఖాముఖి ఎదుర్కొని పోగొట్టాలి. కులాన్ని గురించి మాట్లాడడానికి బిడియపడడం మానేయక పోతే ఇది సాధ్యంకాదు. ఈ విషయం ఇంకొంచెం వివరంగా క్రింద చూద్దాం.

2. ఏ వ్యవస్థాగతమయిన సంక్షోభం పాలకవర్గాల ఐక్యతను నాశనంచేసిందో అదే సంక్షోభం వ్యవస్థలోని కసీసప్రజాస్వామిక లక్షణాలను ధ్వంసం చేసింది. అణచి

వేతనూ వర్గసంఘర్షణనూ పెంచింది. ఈ అణచివేతకు కులం ఒక సాధనంగా ఉపయోగపడుతోంది.

సాంస్కృతికమైన అణచివేతకోసం బ్రాహ్మణభావజాలాన్ని బాగావ్యాపింపజేస్తున్నారు గతంలో ఎన్నడూ లేనంత బాహాటంగా ఇది జరుగుతోంది. అన్యాయాన్ని అసమానతనూ ఆమోదింపజేసే కులధర్మం ఈ బ్రాహ్మణభావజాలంలో అంత ర్లీనంగావుండి పునర్వ్యాప్తి చెందుతూవుంది. కులం ప్రస్తావన వచ్చినప్పుడల్లాదానిని వ్యతిరేకించినట్టు కనిపిస్తూ బ్రాహ్మణభావజాలంలో భాగంగా దానిని వ్యాపింపజేయడం మనదేశ పాలకవర్గాలు బాగా అభ్యసించిన విద్య.

ఈ ఆధ్యాత్మికదాడులతోబాటు భౌతికదాడులకు కూడ కులంఒకసాధనంగా ఉపయోగపడుతూ వుంది. గ్రామీణభూస్వామ్య పెత్తందారీవర్గంమనదేశపాలకవర్గాలలో ఒక ప్రధానమయిన వర్గం. గత నలభైఏళ్ళ "అభివృద్ధి" వల్ల ఈ వర్గం బాగా ప్రయోజనం పొందింది. కొందరు "హరితవిప్లవం" వల్ల బాగుపడితే కొందరు కాంట్రాక్టులూ, సినిమాలూ సారాయివ్యాపారంవల్ల బాగుపడ్డారు. గ్రామీణబ్యాంకులూ పంచాయితీలు సహకారంగమూ అందరికీ ఉపయోగపడ్డాయి. ఈ వర్గం ఒకవైపు గుత్తపెట్టుబడిదారీ వర్గంతో దేశవ్యాపితంగా తలపడుతూ మరొకవైపు గ్రామీణ రాజకీయార్థిక వ్యవస్థపైన తన ఆధిపత్యాన్ని నెలకొల్పాలని ప్రయత్నము చేస్తోంది. ఇందులో భాగంగానే గ్రామీణపేదలమీద దాడులు జరుగుతున్నాయి. పేదలు సంఘటితంగా వున్నచోట వాళ్లకు "తీవ్రవాదులు" అన్న ముద్రవేసి పోలీసు యంత్రాంగం సహాయంతో అణచివేత ప్రయోగిస్తే, వాళ్ళు అసంఘటితంగా వున్న చోట కులంపేరుమీద సామాన్యరైతాంగాన్ని రెచ్చగొట్టి పేదలపైన దాడులు చేయిస్తున్నారు. కారంచేడునుండి పిప్పరదాకా గత నాలుగేళ్ళలో జరిగిన హత్యాకాండలను జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ వాస్తవం అర్థమవుతుంది. దాడిచేసేవారు ఎక్కువగా సామాన్యరైతాంగ యువకులు. వారివెనుక ఆ గ్రామానికి చెందిన భూస్వామ్యపెత్తందారీ వర్గం ఉంటుంది. మళ్ళీ వారి వెనుక రాష్ట్ర రాజకీయాలలో ప్రముఖస్థానంలోవున్న వున్న వ్యక్తులో గ్రూపులో ఉంటారు. గత అయిదు సంవత్సరాలుగా వేరే ఏ జిల్లాలోనూ జరిగినంతగా చిత్తురుజిల్లాలో దళితులపైన అత్యాచారాలు జరగడానికీ ఆ జిల్లాకు చెందిన చంద్రబాబునాయుడు ముద్దుకృష్ణమనాయుడు రాష్ట్ర రాజకీయాలలో ప్రముఖస్థానంలో వుండడానికీ సన్నిహిత సంబంధం వుందని మనం ఊహించనవసరంలేదు, అక్కడి జనమే చెప్తారు. "మన

వాడు" ముఖ్యమంత్రికి అల్లుడయితే మనకంతా ఏదో ఒరిగిందనే కులాభిమాన భ్రమ జనంలో ఉండబట్టే ఇది సాధ్యం అయింది.

ఈ భ్రమను నేరుగా ఎదుర్కొనటం అవసరం. కులాభిమానం ప్రస్తావన తెస్తే మధ్యతరగతి రైతులు ఉద్యమానికి దూరం అవుతారన్న జంకుతో ఊరుకొంటే అది అంతిమంగా పెత్తందార్లకే ఉపయోగపడుతుంది. చాలా రాజకీయచైతన్యం ఉందనుకొనే గ్రామాలలో సహితం జనం అకస్మాత్తుగా కులతత్వాన్ని ప్రదర్శించడం మొదలుపెడతారు. అయితే ఈ "నేరుగా ఎదుర్కొనడం" అనేది కులవ్యతిరేక ఉద్యమాలరూపంలోకాదు. అవి దళితులకుతప్పే వేరే ఎవ్వరికీ రుచించవు. ఏ పెత్తందారీ వర్గమయితే కులాన్ని ఉపయోగించుకొని సామాన్యరైతాంగాన్ని కూలినాలి జనానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతుందో ఆ పెత్తందారీవర్గానికి వ్యతిరేకంగా అదే రైతాంగాన్నీ కూలిజనాన్నీ ఐక్యంగా సంఘటితపరచిననాడే ఆ వాస్తవం బహిర్గతం అవుతుంది. పెత్తందార్లు గ్రామాలలో భూమి మీద, రాజకీయాలమీద, రుణసంస్థలమీద, మార్కెటింగ్ వ్యవస్థమీద, తమకున్న పెత్తనంలో కూలిజనాన్నేకాక సామాన్యరైతాంగాన్నికూడ అణచివేస్తూవుంటారు. వాళ్ళ నోళ్ళు నొక్కడానికి ఇతర ఆయుధాలతోబాటు "మనవాళ్ళు" అనే కులాభిమానాన్నికూడ వాడుకొంటూవుంటారు. ఆ పెత్తనానికి వ్యతిరేకంగా ఉద్యమం నిర్మించినప్పుడు ఆ కులాభిమానం వర్గస్వభావమేమిటో అర్థం అవుతుంది. ఆ నిర్దిష్టనేపథ్యంలో కులతత్వానికి వ్యతిరేకంగా కృషిచేయటం సాధ్యం అవుతుంది కులతత్వం వర్గపోరాటానికి ఎక్కడ ప్రతిబంధకం అవుతుందో అక్కడ దానితో తలపడడం సరయిన పద్ధతి.

కోస్తా ఆంధ్రవంటి "అభివృద్ధి చెందిన" ప్రాంతాలలో దోపిడీవర్గాలు అనుసరించే పద్ధతులు చాలా సున్నితంగా ఉంటాయి కాబట్టి వాళ్లది వ్యతిరేకంగా గ్రామీణ జనాన్ని ఐక్యం చేయడం చెప్పినంత సులభంకాదు. రైతాంగం ప్రభుత్వంమీదా పెట్టుబడిమీదా ఆధారపడడం అనేది పెరిగేకొద్దీ ఆ పోటీలోనూ సంక్షోభంలోనూ తమ కులానికి చెందిన పెత్తందార్లనూ కూడా కల్పించే భద్రతనూ ఆశ్రయించవలసిన అవసరమూ పెరుగుతుంది. ఆ అవసరాన్ని పెత్తందార్లు తమ ప్రయోజనాలకోసం ఉపయోగించుకుంటారు.

3. ప్రజలు ఒక శ్రామికవర్గంగా సంఘటితపడాలంటే తమనుతాము ఒక వర్గంగా భావించుకోవడం మొదలవ్వాలి అంటే Class-for-themselves కావాలి. దీనికి కులచైతన్యం అడ్డువస్తుంది. అంతదూరం పోనక్కరలేదు. సాధారణ మానవ

స్పందనకు కూడ కుల చైతన్యం అడ్డువస్తుంది. ప్రజలచైతన్యానికి "సామాజిక ప్రాతకికత్వం" అనే లక్షణం వుంటుందని రణజిత్‌గుహ అనే చరిత్రకారుడు ఈ మధ్య అనుకున్నాడు. అంటే భౌగోళికంగా ఒక ప్రదేశాన్నిమట్టుకే "మనదిగా" భావించి నట్టు సమాజంలోకూడ ఒకభాగాన్ని మట్టుకే "మనది" అనుకుంటారు. అయితే కులానికి ఈ లక్షణం ఉందని అంబేద్కర్ చాలాకాలం క్రితం గుర్తించాడు. ఒకగ్రామంలో ఎవరికయినా అన్యాయం జరిగితే సాధారణంగా అది ఆ కులంతప్పవేరే కులాలవాళ్ళకు తెలియనుకూడ తెలియదు. యువకులెవరయినా ఆవేశంతోనో ఆదర్శంతోనో తెలుసుకొని స్పందించినా "నీకెందుకొచ్చిన గొడవరా ఊరుకో!" అని పెద్దవాళ్ళు నోరు నొక్కేస్తారు. అంటే సాధారణమానవస్పందనకు కుల సంస్కృతిలో ఆమోదంలేదు. legitimary లేదు, ఇది గ్రామీణ దోపిడీవర్గాలకు బాగా ఉపయోగపడుతుంది. శ్రామికుల సమస్యలు వృత్తినిబట్టి నూరరకాలుగా ఉంటాయి కనుక ఒక్కొక్కకులాన్ని విడివిడిగా అణచివేయడం సాధ్యం అవుతుంది. తెలంగాణాగ్రామాలలో దొరలు ఈ ఎత్తుగడను చాలా సమర్థవంతముగా అమలుచేసేవారు అయితే రైతు-కూలీసంఘం అనే నిర్మాణరూపము దీనిని ఎదుర్కోగలిగింది. వృత్తితోనూ కులంతోనూ నిమిత్తంలేకుండ శ్రామికులసందరినీ ఒకే సంఘములో ఐక్యము చేయడముద్వారా అది సాధ్యం అయింది.

అయితే నిజమయిన సమస్య ఇదికాదు. ఈ శ్రామికకులాలలోనూ అసమానతలూ హెచ్చుతగ్గులూ స్వాతంత్ర్యాభావము ఉండడము అసలయిన సమస్య. యీ అసమానతలను పోగొట్టడము ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలలో ఒకటికాగా, అసమానతలు ఉండడమువలన విప్లవసంఘటన, చైతన్యము బలహీనపడతాయి. ఇదికులవ్యవస్థకేకాక మొత్తం రాజకీయచైతన్యానికి అడ్డుపడే కుటుంబవ్యవస్థకుకూడ వర్తిస్తుంది. కుటుంబము అనేది భవిష్యత్తులో ఉంటుందా పోతుందా అనే చర్చకంటే కుటుంబవ్యవస్థలోని ఈ అణచివేత లక్షణాన్ని ప్రతిఘటించవలసిన అవసరము చాలా ఎక్కువ.

కులవ్యవస్థను నేరుగా ప్రతిఘటించకుండా వదిలేస్తే ప్రజాతంత్ర విప్లవోద్యమము చాలా చైతన్యాన్ని చొరవనూ కోల్పోతుంది. ఉద్యమము "మనది" అని ప్రజలంతా అనుకున్న మేరకే చైతన్యముతో కదిలివస్తారు. కులవ్యవస్థను బాహాటముగా వ్యతిరేకించని ఉద్యమములో నిమ్నకులాలు "మమేకము"కావు ("ఐడెంటిఫై" కావు). పురుషాధికత్యత విధించే శ్రమవిభజనను వ్యతిరేకించని ఉద్యమముతో స్త్రీలు మమేకం కారు. దానిని తమదిగా భావించరు.

స్పష్టతకోసం అన్వేషణ

ఎన్. వేణుగోపాల్

"ఈ కవిత్వం కొన్నిసార్లు శక్తివంతమైనదే; కాని కేవలం ఒకనిజాయితీతో కూడిన ఉద్వేగ ఆర్తనాదం వలె మాత్రమే. అది అందమైనది కూడ కావచ్చు; కాని కేవలం ఫ్లాబర్టు అభివర్ణించినప్పుడు కుష్ఠువ్యాధికి కలిగే అందంలా మాత్రమే ఈ కవిత్వం ఒకానొక వ్యక్తిత్వం ఎటువంటిదంటే, జీవితానికీ సృజనాత్మకతకూ నిజమైన వనరు అయిన ప్రజలతో సజీవ సంబంధపు స్పృహను హృదయం లోలోపల అణచి వేసుకున్నది"

—గోర్కీ

మనుషులు ప్రపంచాన్ని అర్థం చేసుకునే క్రమంలో కొన్ని ప్రత్యయాల్ని

ఈ విషయాలను కమ్యూనిస్టు పార్టీలు ఎప్పుడూ పట్టించుకోలేదనడం న్యాయం కాదు. పార్టీల నాయకులు అగ్రకులాలకు చెందిన మగవాళ్ళు కావడం వల్ల ఈ విషయాలను పట్టించుకోక పోవడం అనేది కుట్ర పూరితంగా జరిగిందనే ఆరోపణ వాస్తవమూకాదు అయితే ప్రజల మధ్య వుండే అసమానతను చర్చకు పెడితే అదిప్రజలలో చీలికకు దారితీస్తుందన్న భయం మట్టుకు నిజంగానే వుండింది. ఇప్పటికీ వుంది ఇవన్నీ "పోరాటక్రమంలో" పోతాయన్న సూత్రీకరణ ఈ భయాన్ని సిద్ధాంతీకరించింది. దానిఫలితంగా తమకు నిత్యం ఆచరణలో ఎదురయ్యే ఈ సమస్యలను సిద్ధాంత స్థాయిలో గుర్తించి వర్గపోరాట అవగాహనతో జోడించలేకపోయారు. దానిని వైఫల్యంగానే గుర్తించాలి. ప్రజలకూ పాలకవర్గాలకూ మధ్యనున్న వైరుధ్యం చుట్టూ పోరాటాన్ని నిర్మిస్తూ, తదనుగుణ్యమైన పోరాట రూపాలకూ నిర్మాణ అవసరాలకూ ప్రాధాన్యం ఇచ్చేటప్పుడు, ప్రజల మధ్యనున్న అసమానత గురించి అప్రమత్తంగా ఉండకపోతే అది ప్రజా చైతన్యానికి ప్రతిబంధకం కావడమేకాక, ఆ అసమానతలు ప్రజా ఉద్యమాలలో పునరావృతం అయ్యే ప్రమాదం వుంది. ప్రజా సంఘాలలోనూ పునరావృతం అయ్యే ప్రమాదం వుంది అది ఏమేరకు జరుగుతుందో ఆమేరకు సామాజిక విప్లవంలో ఈ అసమానతల పరిష్కారం క్లిష్టతరం అవుతుంది. ఆ మేరకు ప్రజాతంత్ర విప్లవం అసంపూర్తిగా ఉండడమేకాక, తిరోగమనానికి పునాది కూడ ఏర్పడే ప్రమాదం వుంది.

—o—

సమకూర్చుకున్నారని తత్వశాస్త్రం చెపుతుంది. అధిభౌతిక పద్ధతిలోనూ, గతితార్కిక పద్ధతిలోనూ కూడ ప్రత్యయాలు ఉన్నాయి. ప్రత్యయాల అభివృద్ధి ఉంది. ప్రకృతి చలన సూత్రాలను, సామాజిక చలన సూత్రాలను కనిపెట్టడంలో ఈ ప్రత్యయాలు ప్రముఖమైన పాత్ర వహించాయి.

ఈ మధ్యకాలపు తెలుగు కవిత్వ విమర్శ కూడ కొన్ని ప్రత్యయాల్ని సమకూర్చుకుంటున్నది. ఐతే ఈ ప్రత్యయాలు కవిత్వాన్ని, ఆ కవిత్వానికి మూలమైన సమాజాన్ని ఇంకా ఎక్కువ అనవగాహనకు, దురవగాహనకు దారితీస్తున్నాయా పరిశీలించవలసి ఉంది.

అస్పష్టత - స్పష్టత, సంక్లిష్టత - సరళత్వం, అనిర్దిష్టత - నిర్దిష్టత అనే ఈ ద్వంద్వాలు ఇవాళ తెలుగు కవిత్వ విమర్శలో సర్వ సాధారణంగా కనబడుతున్నాయి. ప్రత్యయంలోని ద్వంద్వాల మధ్య పరస్పర సంబంధాన్ని అర్థం చేసుకోలేని అధి భౌతిక పద్ధతే మన విమర్శలో ప్రాబల్యంలో ఉంది గనుక, ఈ ద్వంద్వాలలో ఏదో ఒక దాన్నే ప్రధానం చేసి ఏకైకం చేసి మాట్లాడే శిబిరాలు ఏర్పడుతున్నాయి. నిజానికి ఈ ప్రత్యయాలు ఎక్కువగా కవిత్వశిల్పం చుట్టూనే తిరుగుతున్నాయి. వస్తుచర్చను రూపం దాదాపుగా మరుగు పరుస్తున్నది గనుక అసలు ఈ చర్చ, శిబిరాల ఏర్పాటు పూర్తిగా అనవసరం. కాగా, ఈ శిబిరాల మధ్య పట్టువదలని చర్చలో అనవసరమైన సిద్ధాంతాలు, సూత్రీకరణలు రలెత్తి అసలైన వస్తుచర్చ, సామాజిక నేపథ్యం గురించిన చర్చ రంగం మీదికే రావడం లేదు. అస్పష్టతను, సంక్లిష్టతను సమర్థించుకోవడానికి మన వాతావరణంలో మన సాహిత్య సాంప్రదాయంలో లేని, మన నేలలో అంటుకట్టడానికి వీలులేని ప్రమాణాలను ఎరవు తెచ్చుకోవడం చాల ఎక్కువగా జరుగుతోంది.

ఈ పూర్వరంగంలో ఈ చర్చను సమీక్షించి కవిత్వంలో అస్పష్టత, సంక్లిష్టత, అనిర్దిష్టత సమస్యలను అర్థం చేసుకోవలసి ఉంది.

కవిత్వ విమర్శలో ప్రధానంగా చర్చలో ఉన్నది అస్పష్టత. కవిత్వం అర్థం కావడం లేదని, కవి ఉద్దేశిస్తున్న దేమిటో పాఠకులమనసుకు అందడం లేదని విమర్శ చాల ఎక్కువగా వస్తున్నది "ఏ ప్రయత్నమూ చేయనిబద్ధకస్తులు" మాత్రమే కాక సీరియస్ కవిత్వ పాఠకులు కూడ ఈ విమర్శ పెడుతున్నారు. ఒక కవితలో కొన్ని పద చిత్రాలు అందకపోవడం, అసలు ఏ ఒక్క పదచిత్రమూ అందక పోవడం, పద చిత్రాలన్నీ తెలిసినట్లే ఉండి కవిత మొత్తం మీద ఏమి చెపుతున్నదో

అర్థం కాకపోవడం, కవితలో కొన్ని పదాలు అర్థమై వాటి మధ్య అన్వయం కుదరక పోవడం వంటి అనేక రూపాలలో ఈ అస్పష్టత వ్యక్తమవుతున్నది. పాఠకులూ కవులూ కూడ ఇట్లా అస్పష్టత ఉన్న సందర్భాలను స్పష్టంగానే చూపుతున్నారు. ఈ విమర్శకు కవుల నుంచి, కవుల అభిమానుల నుంచి జవాబులు వెలువడుతూ గత రెండు మూడు సంవత్సరాలుగా చర్చ వేడెక్కుతున్నది. ఈ సమయంలో సాహిత్య విమర్శకులు అస్పష్టతకు అనుకూలంగా మాట్లాడడమో, మౌనంగా ఉండడమో జరుగుతూ ఉండడంతో క్రమ క్రమంగా "అస్పష్టతా వాదం" ఒకటి తెలుగు సాహిత్య విమర్శలో ప్రవేశించి బలపడుతోంది.

"వివిధ మార్గాలలో సాధ్యమైనంత వరకు స్పష్టతను సాధించుకోవటమే పాఠకులు చేసుకోవలసింది సాధారణ వచనంలాగా కవిత్వం మరీ స్పష్టంగా ఉండా లన్న నియమమెక్కడా లేదు పాఠకుల శక్తికి అందుబాటులో ఉన్నంత వరకు అస్పష్టతకు కవిత్వంలో లెజిటిమసీ ఉంది" అనీ "ఎనభయ్యో దశాబ్దిలో కవితా రచనకు ఉపక్రమించిన కవుల్లో ముఖ్యులైన వాళ్ళు ప్రబోధ కవిత్వం రాయడం లేదు. తమ అనుభవాలను కవిత్వంలో పొదుగుతున్నారు. ముఖ్యంగా మూడ్స్ చిత్రణ ఎక్కువగా జరుగుతున్నది. భావ కవిత్వం లాగ అంతర్ముఖీన కవిత్వం రాస్తున్నారు ప్రకృతిలో వస్తువుల ద్వారా, దృశ్యాల ద్వారా ప్రకృతి తత్వాన్ని, తమ తాత్విక చింతననీ వ్యక్తం చేస్తున్నారు. ఈ కవిత్వం చదవగానే చప్పున మనసుకు పట్టదు. పాఠకుడు ఈ కవిత్వపు "మూడ్" కోసం సంసిద్ధంగా ఉండాలి. తర్వాత తన ఆలోచనకు పదును పెట్టాలి భావనకు తలుపులు తెరవాలి అప్పుడే ఆ కవిత్వం పూర్తిగా అర్థమైనట్లు" అనీ అన్నారు చేరా.

ఈ సమస్యను పది సంవత్సరాల కిందనే ప్రస్తావించారు. ఇస్మాయిల్: "సంక్లిష్టమైన జీవితానుభవాల అంతరాళాన్ని ఆవిష్కరించటమే సాహిత్య ప్రయోజనం ఈ పని మన యువకవులు చాలా శక్తిమంతంగా నిర్వహిస్తున్నారని తలుస్తున్నాను. విషయమే సంక్లిష్టం కనక, కవిత్వం సంక్లిష్టంగా గోచరించవచ్చు. ఈ తప్పు కవుల్ది కాదు. జీవితానిది. గోప్యత ఉందంటే ఒప్పుకోను. కవిత్వం దాయటానికి కాదు; వెల్లడి చెయ్యటానికి, అస్పష్టత అంటారా? మనకు పరిచయం లేనివీ కొత్తవీ మొదట్లో అస్పష్టంగా ఉన్నట్లు అనిపిస్తాయి. అది కొత్తదనం తప్ప అస్పష్టత కాదు" అన్నారు. ఇస్మాయిల్.

"ఒక కవికి సంబంధించిన "అభివ్యక్తి శ్రుతి", ఆ కవిని చదవదలుచుకున్న పాఠకుడికి ఉండితీరాలి'' అనీ, ''ఆధునిక కవిత్వము అర్థము చేసుకోవడానికి సెన్సిబుల్ రీడర్స్‌కి ఇవాళ కావలసింది కావ్యపరిభాషలు కావు ఓపెన్ మైండ్-విస్తృత మనోద్వారము కావాలి" అనీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ అన్నారు. "మంచికవిత్వాన్ని దూషించడానికి సాధారణముగా ఆంధ్రదేశములో అకవులు, కుకవులు ఏరుకున్న తిట్లు, ఎత్తే ఆయుధాలు ప్రధానముగా రెండు- ఒకటి అర్థము కావడములేదు, రెండు రొమాంటిక్ పొయిట్రీ లేక ఆత్మాశ్రమ కవిత్వము'' అని గుంటూరు శేషేంద్రశర్మ అన్నారు.

"నేను నాకుకాని స్థితిలో, సమాజానికి ఎవరికీ కాని స్థితిలో ఓ శూన్య గోళాన్ని ఊహించుకొంటూ అనుభవిస్తున్న స్థితిలో భాషని సంభాషణకోసముకాక డైలాగ్‌గాకాక Duelogueగా వుపయోగించుకున్నప్పుడు ఈ అక్షరాలను నేనేం చేసుకోను అనుకొనేప్పుడు నేను కవిత్వములాంటి అక్షరాల్నేవో రాస్తాను. అవి నాకూ అర్థమవ్వవు" అని వేగుంట మోహనప్రసాద్ అన్నారు.

"కవి ఎప్పుడూ "కవిత్వము కోసముపడి చచ్చే" పాఠకులకోసమే రాయడు. అది సామాజికమైనా, వైయక్తికమైనా ముందస్తుగా కవి తనకోసమే రాసుకుంటాడు. పెల్లుబికివచ్చే ఆలోచనాస్రవంతినీ చెలియలి కట్టదాటివచ్చే ఆవేశపు జలపాతాన్ని అదిమిపట్టి తప్పనిసరి పరిస్థితుల్లో అక్షరబద్ధము చేస్తాడు. అది విప్లవమూ కావొచ్చు. ప్రణయమూ కావొచ్చు- విషాదమూ కావొచ్చు. మనకు కావలసినది మనము గ్రహించి అవసరములేని వాటిని వదిలెయ్యడమే ఉత్తమ పాఠకుని కర్తవ్యము. అంతేకాని నువ్వు ఫలానా విధముగా ఎందుకు రాయలేదు అని ప్రశ్నించే అధికారము ఏ పాఠకునికీలేదు" అని శిఖామణి అన్నారు.

ఉద్రేకముతోనో, ఉక్రోషంతోనే యువకవులు తమ కవిత్వములోని అస్పష్టతను సమర్థించుకొంటూ, అస్పష్టతను కీర్తిస్తూ, కవిత్వీకరిస్తూ రాసిన మాటలను అంతగా పట్టించుకోనక్కరలేదు. కాని ఈ క్రమములో అస్పష్టత గురించి సిద్ధాంతాలు, తాత్విక సమర్థనలు, "పాఠకుడి సోమరి మనస్తత్వం"పై, పాఠకుడు అలవరచుకోవలసిన కవిత్వాస్వాదన సాధనాలపై ప్రబోధాలు చెలరేగుతున్నాయి.

ఈమధ్యనే పాపినేని శివశంకర్ అస్పష్టత, సంక్లిష్టతల గురించి ఒకసంక్లిష్ట తాత్విక వ్యాసము రాశారు. ఒక రచనను అర్థము చేసుకోవడానికి పాఠకుడికి అంత

ర్గత జ్ఞాపికా చట్రము, బాహ్యజ్ఞాపికా చట్రము అనేవి ఉంటాయని, ఈ చట్రాలు విఫలమైనప్పుడు, కవి, పాఠకుడు కలుసుకొనే సమానక్షేత్రము అదృశ్యమవుతుందని, అప్పుడే అస్పష్టత తలెత్తుతుందని శివశంకర్ సూత్రీకరించారు. అస్పష్టతను వస్తుగత మైనదిగా, రూపగతమైనదిగా ఆయన విభజించారు. అస్పష్టతా బీజాలను వివరిస్తూ పాఠకుడి ప్రయత్నలోపమువల్ల ఏర్పడే అస్పష్టతను కవి గందరగోళమువల్ల ఏర్పడే అస్పష్టతను, ప్రయోగవాదమువల్ల ఏర్పడే అస్పష్టతను, కవి కొత్త మానవాను భవాల్ని, వైయక్తిక సంఘర్షణను ఆవిష్కరించేటప్పుడు ఏర్పడే అస్పష్టతను ఆయన వివరించారు. పరాయీకరణలోనే అస్పష్టతపునాదులు ఉన్నాయని అన్నారు.

అధునిక కవులలో అస్పష్టత గురించి విమర్శను ఎదుర్కొంటున్న వారిలో ముఖ్యులు శివారెడ్డి. అయన తన కవిత్వములో అస్పష్టతలేదని, ఉంటే సంక్లిష్టత ఉంటుందని చర్చను మరొకమలుపు తిప్పారు. "ఏ కవికైనా జీవితము ముఖ్యము. నగరజీవితము సంక్లిష్టమైంది. నగరకవి పరిస్థితివేరు. అతడు నిలుచున్న జీవనసంద ర్భము వేరు. సంక్లిష్టత అంటే అస్పష్టతకాదు. వాచ్యప్రాధాన్యముకాక, సారాన్ని దర్శించి, ప్రతీకలద్వారా అనేక అంశాల్ని అందించే ప్రయత్నములో కవితసంక్లిష్టము అవుతుంది, గాఢతరమవుతుంది. విస్తృతమవుతూ లోతునీ, గాంభీర్యాన్నీ కవితసంత రించుకొంటుంది. ఒక ప్రత్యేకవస్తువు ప్రేరణకలిగించినా, దాని సందర్భముగా పలు అంశాల్ని పదచిత్రాల ద్వారానూ, పదబంధాల సహాయముతోనూ వితానమయము చేస్తూ ముందుకుసాగి కవితమొత్తంగా ఒక ఎఫెక్ట్‌నీ, ఒక అనుభూతినీ, ఒక వివేచననీ కలిగి స్తుంది" అని శివారెడ్డి అన్నారు.

ఈ చర్చ అంతటిలోనూ రెండు మూడు ముఖ్యమైన అంశాలు ప్రస్తావనకు కూడ రాకపోవడమువల్ల నాలుగయిదేళ్ళుగా చర్చతీవ్రాతితీవ్రముగాసాగి కూడ ఫలితం లేకపోయింది. నిజానికి ఇప్పటికయినా అంతిమ నిర్ధారణ ప్రకటించే సమయము రాక పోయిఉండవచ్చునుగాని కనీసము చర్చకు మరికొన్ని అవసరమైన ప్రాతిపదికలు సమ కూరితే చర్చ అర్థవంతమవుతుంది. కవిత్వ ప్రయోజనములాంటి గతములో పరిష్కా రము అయిపోయిన, దాదాపు అందరూ అంగీకరించే అంశాలపైన చర్చ సాగించవల సిన అవసరము ఉండదు.

ఇప్పటివరకు సాగినచర్చలో ప్రస్తావనకు రావలసిన ప్రాతిపదికలు రాక పోగా, స్పష్టంగా ఉండాలని వాదించేవారికి కవితాశిల్పముపట్ల వ్యతిరేకత ఉన్నట్టు

అస్పష్టత గురించి ఏమాత్రము అనుకూలముగా మాట్లాడినా వస్తువుపట్ల నిబద్ధతలేనట్టు దురభిప్రాయాలుకూడ వ్యాప్తిలోకి వచ్చాయి. నిజానికి యీ చర్చాక్రమములోగాని, చర్చలో పాల్గొన్న వారిలోగాని ఇంత స్పష్టమైన విభజనరేఖలు గీయగల, సూత్రీకరించ గల స్పష్టత ఉన్నట్టు కనిపించదు. మొత్తంమీద అస్పష్టత గురించిన చర్చ అస్పష్టంగానే సాగుతూ వస్తోంది.

కవిత్వములో అస్పష్టత గురించిన చర్చ నిజానికి కవిత్వములో నిర్దిష్టత, అనిర్దిష్టత అనే రూపములో జరిగితే ఎక్కువ ప్రయోజనకరముగా ఉండేది. ఒక కవిత అస్పష్టముగా ఉన్నదనో, సంక్లిష్టముగా ఉన్నదనో అనిపించడము స్వీయమానసిక భావన కావచ్చు. ఒక సామాజిక చైతన్యరూపము గురించి స్వీయమానసిక భావనల ప్రమాణాలతో చర్చించడము సరైనదికాదు. దానికన్న కవిత్వములో నిర్దిష్టత అనే ప్రమాణము ఆధారముగా చర్చసాగితే, ఆ చర్చలోకి భౌతిక వాస్తవికత, దానిపట్ల స్వీయమానసిక భావాలు కూడ వస్తాయి. కవిత్వము అనిర్దిష్టమైనదికాదని, కాడ్వెల్ వివరముగానే చర్చించి ఉన్నాడు. ప్రస్తుతం తెలుగుకవులలో అస్పష్టత, సంక్లిష్టత ఉన్నదనిపించుకొంటున్న కవులందరూ ఏదో ఒకస్థాయిలో తమ కవిత్వాన్ని నిర్దిష్టకవిత్వం కాకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఆ అవకాశము లేదుగనుక తాము గందరగోళపడి, పాఠకులను గందరగోళ పెడుతున్నారు.

ఐతే యీ అస్పష్టత సంక్లిష్టతలను పూర్తిగా కవులమీదకి నెట్టివేయడం అన్యాయమే అవుతుంది. విమర్శకు గురవుతున్న కవిత్వపు స్థలకాలాలు. కవుల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యాలు, పాఠకుల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక స్థాయీభేదాలు, కవిత్వప్రాచుర్యంలో పత్రికలపాత్రలాంటి అనేక అంశాల్ని చర్చలో భాగం చేసినప్పుడే సరైన నిర్ధారణలకు రాగలుగుతాము. ముఖ్యముగా కవిత్వాన్ని టెక్స్ట్ ఆధారముగా మాత్రమేకాక కాంటెక్స్ట్ ఆధారముగా విమర్శించగల ప్రమాణాల్ని తయారుచేసుకోవాలి. ఇది కష్టసాధ్యమైన పని కావచ్చునుగాని అసాధ్యమైన పని మాత్రముకాదు.

గతకొద్ది సంవత్సరాలుగా, మరీ ముఖ్యంగా 1985 తర్వాత కవిత్వములో అనిర్దిష్టత పెరిగిపోయింది. అనిర్దిష్టత భావనాత్మక ప్రత్యయమే. దానికి స్థలకాలాలు లేవు, అంతకన్నా ముఖ్యముగా రూపములేదు. కాని కవిత్వము ఎప్పుడైనా నిర్దిష్టంగా- స్థలకాలాలతో, అనుభూతికి అందగల స్పష్టమైన ఆకృతితో, ఊహకు అందగల పద చిత్రాలతో- ఉన్నప్పుడే అర్థమవుతుంది. కనుక కవి అనిర్దిష్టత వైపువేసే ప్రయాణము కవిత్వాన్ని అస్పష్టము చేస్తుంది.

ఆకలి, మానసిక వేదనలాంటి ప్రత్యేక, వయ్యక్తిక అనుభవాలు నిర్దిష్టమైనవి. ఒక నిర్దిష్టసమాజంలో, ఒక నిర్దిష్టకాలములో ఒక నిర్దిష్టవ్యక్తి అనుభవించే ఆకలి అమూర్తమైనది కాజాలదు. ఆ అనుభవాన్ని మరొకవ్యక్తిలో పలికించాలంటే అది నిర్దిష్టముగా వ్యక్తం కావలసిందే. కాని దాన్ని అనిర్దిష్టం చెయ్యదలచుకున్నప్పుడు ఎన్ని పదచిత్రాలలో వివరించినా ఆ అర్థబాహుళ్యము అస్పష్టతకే దారితీస్తుంది. ఏమంటే, ప్రతిపాదమూ ఎన్నెన్నో అర్థాలు ఇచ్చి, ఆ అర్థాలమధ్య అన్వయంకుదరక కవితలో ధార తెగిపోతుంది. కవిత విడివిడి దృశ్యాల సమాహారంగా ఉంటుంది. కవి ఆయా దృశ్యాలను పాఠకుడికి ప్రదర్శించి అంతిమముగా ఏమి చెపుతున్నాడో ఏమి చెప్పదలుచుకున్నాడో గ్రహించడములో పాఠకుడు విఫలమవుతాడు

ఇలా పాఠకుడు విఫలం కావడానికి కారణం మూడ్‌కోసం సంసిద్ధంగా ఉండకపోవడమో అభివ్యక్తి శ్రుతిలేకపోవడమో విస్తృత మనోద్వారం లేకపోవడమోకాదు. ఆధునిక కవులు ఎక్కువగా మూడ్స్ చిత్రణను ఎంచుకోవడం వల్లనో, అంతర్ముఖీన కవిత్వం రాయడంవల్లనో కూడ ఈ సమస్య రావడంలేదు.

అభివ్యక్తి శ్రుతి,విస్తృత మనోద్వారంలాంటి మాటలు వినడానికి బావుంటాయి గానివాటి అర్థం ఏమిటి? ఒక్కొక్కరికి ఒక్కొక్క అభివ్యక్తి ఉంటుంది. భౌతికవాస్తవిక తన చైతన్యంలో ప్రతిఫలించినతీరును ఇతరేతర స్మృతులతో, విశ్లేషణలతో కలగలిపి కవి తన రచన సాగిస్తాడు. ఒక్కొక్క రచనలోనూ ఆయా వస్తువులు తగిన అభివ్యక్తిని వెతుక్కుంటాయి. సాధనమీద ఒక్కొక్కకవి ఒక్కొక్కరకమైన అభివ్యక్తి సంవిధానాన్ని స్వీకరించుకుంటాడు, ఐనా ప్రధానంగా వస్తువే అభివ్యక్తిని వెతుక్కుంటుందిగాని రేడియో స్టేషన్‌లాగ ఒక కవి ఎప్పుడూ ఒకే అభివ్యక్తిని ప్రసారం చేస్తూ ఉండడం అసాధ్యం మాత్రమే కాదు,హాస్యాస్పదం కూడ.

ఇక విస్తృత మనోద్వారం అంటే ఏమిటి? ప్రాచీన ఆలంకారికులు విమర్శకులకూ పాఠకులకూ ధర్మంగా చెప్పిన సహృదయతలోనైనా విమర్శకు అవకాశం ఉంది. కాని మన ఆధునిక ఆలంకారికుల దృష్టిలో విస్తృత మనోద్వారం అంటే కేవలం సమర్థన మాత్రమే. ఏమాత్రం విమర్శవున్నా 'విస్తృత మనోద్వారం' లేనట్టే.

పాఠకుడు మూడ్‌కు సంసిద్ధంగా ఉండటం అనేది మరొక విచిత్రమైన ఊహ. ఫలాని కవి కష్టంగా ఉంటాడు-అని మొదటే వినడంవల్ల పాఠకుడు కష్టపడుతూ కవిత్వంలో లేని అర్థాలు వెతుకుతూ ఇబ్బంది పడతాడని టి. ఎస్. ఇలియట్ చెప్పిన మాటకు ఇది మరొక కొస. ఐతే ఈ ఊహ వాస్తవంలో పూర్తిగా అసాధ్యమైపోతుంది. అనుకోకుండా ఎక్కడో ఒక కవిత చదివిన పాఠకుడు కవితకు అవసరమైన మూడ్‌కు సంసిద్ధంగా ఉండడాన్ని ఊహించలేం. అంతకన్న ముఖ్యంగా ఒక సంపుటంలో

వివిధ కవుల సంకలనంలో పాఠకుడికి ఏకకాలంలో అనేక మూడ్స్ అవసరమవుతాయి. ఉదాహరణకు వైతాళికులులో బసవరాజు అప్పారావుగారి పటపత్రికాయి, విశ్వనాథ సత్య నారాయణగారి సీ రథము, శ్రీ శ్రీ మహాప్రస్థానం వరసగా ఉన్నాయి. పాఠకుడు మూడ్‌కు సంసిద్ధంగా ఉండాలంటే ఈ మూడు కవితలూ ఒకేసారి చదవటానికి వీలు లేదన్నమాట.

మూడ్‌కు సంసిద్ధంగా ఉండాలి అనడంలో మరో ఇబ్బందేమంటే ఏ మూడ్‌కు సంసిద్ధంగావుంటే ఆ కవిత అర్థమవుతుందో ఆ కవిత చదివితేగాని మనకు తెలియదు. ఆ కవితను చదవబోతామా, మూడ్ లేదుగనుక మనకది అర్థంకాదు!

పాఠకుడి మూడ్ గొడవ అలా ఉంచి కవి మూడ్స్‌ను చిత్రించడంవల్ల అంత ర్ముఖీన కవిత్వం రాయడంవల్ల అస్పష్టత తలెత్తుతున్నదనే వాదన చూద్దాం.

కవిత్వంలో మూడ్స్‌ను చిత్రించడం అంతర్ముఖీన కవిత్వం రాయడం కొత్త కాదు. అది ఈ దశాబ్దంలోనే మొదలూకాలేదు. భౌతిక వాస్తవికతపట్ల కవిలో కలిగే స్వీయ మానసిక అనుభూతుల వ్యక్తీకరణే కవిత్వమని అంగీకరిస్తే ఆ భౌతిక వాస్తవి కతలో మానసిక ప్రపంచంకూడ వున్నదని భౌతిక వాస్తవికతకు స్వీయానుభూతు లకు మధ్య సంబంధం ఏకముఖంకాదని, పరస్పర చర్యగలదని అంగీకరిస్తే అంతర్ము ఖీన కవిత్వం, మూడ్స్ కవిత్వం దానికదిగా అస్పష్ట కవిత్వం అయిపోదని కూడ అంగీకరించాలి. సంక్షుభిత సమాజంలో కవికి తన అంతర్ముఖీన కవిత్వాన్ని, మూడ్స్ కవిత్వాన్ని రాసుకునే అధికారం ఉన్నదా అనేది వేరే చర్చ. ఇక్కడ అసలు అటు వంటి కవిత్వం అస్పష్టం అయిపోవడం సహజమూ అనివార్యమూ అనే వాదనను విశ్లేషిద్దాం. ఎంకి పాటల్లో మూడ్స్ ఉన్నాయి. కృష్ణశాస్త్రి కవిత్వంలో మూడ్స్, అంతర్ముఖత్వం ఉన్నాయి. శ్రీ శ్రీలో కూడ అంతర్ముఖత్వం, మూడ్స్ ఉన్నాయి. కాని వాళ్ళ గురించి అస్పష్టంగా ఉన్నారనే ఆరోపణ ఎప్పుడూ రాలేదు. ఒకవేళ వచ్చినా అది కేవలం కాలగమనంలో వెనుకబడిన వాళ్ళు చేసిన ఆరోపణ లాటిదే.

ఇప్పుడు చూస్తే, అస్పష్టతారోపణకు గురవుతున్న కవులు "భావకవుల లాగ" రాస్తున్నారని విమర్శకులే అంగీకరిస్తున్నారు. కనుక వీళ్ళు ద్రష్టలై, పాఠ కులు వాళ్ళను అందుకోలేక పోవడం అనే సమస్యేలేదు.

ఈ కొత్తకవులు ద్రష్టలు కాకపోయినా, "కొత్తదనాన్ని" తెస్తున్నారని మరొక సమర్థన. ఈ కవుల అభివ్యక్తిలో కొత్తదనం ఉన్నమాట నిజమే. ఐతే రూపంలో కొత్తదనం, కొత్త పద చిత్రాల సృష్టి, అలంకారాల పట్ల మోజు కవి

త్వం విస్తృతం కావడానికి తోడ్పడాలా? అది ఇంకా ఇంకా తక్కువ మందికి మాత్రమే అర్థమైన పాండిత్యంగా మిగలాలా? కొత్తదనం దానికదిగా ఎప్పుడూ అస్పష్టత కాదు. జ్ఞానంలో ఎప్పుడూ అసమగ్రత నుంచి సమగ్రతవైపు ప్రయాణం సాగుతూనే ఉంటుంది. కొత్తదనం అనేది ఈ ప్రయాణంలో మనం నిరంతరం సాధించే ఫలం అది అస్పష్టత కాదు. కొత్తదనం ఆకర్షిస్తుంది. ఆసక్తి కల్గిస్తుంది. అస్పష్టత విసుగెత్తిస్తుంది. భయపెడుతుంది.

కవిత్వంలో అస్పష్టత గురించిన చర్చలో హఠాత్తుగా సంక్లిష్టత కూడ చొరబడింది. కవిత్వం ప్రతీకల మీద, పద చిత్రాల మీద, ఉద్వేగాల మీద ఆధారపడుతుంది గనుక సంక్లిష్టంగా ఉండక తప్పదేమో, అది ఒక కవితా లక్షణమేమో అని కొన్ని దశాబ్దాలుగా ఉన్న సందేహాలను 70ల తర్వాత నిరలంకార కవిత్వం బద్దలు చేసింది. స్వయంగా టి. ఎస్. ఇలియటే అన్నట్టు ఉద్వేగాలు కూడ స్పష్టంగానూ, అస్పష్టంగానూ ఉండవచ్చు అందుకే ఉద్వేగాలన్నీ అస్పష్టతకే దారి తీయాలన్న నియమం లేదు. స్పష్టమైన ఉద్వేగాల్ని, బహుజనా మోదం పొందిన పద చిత్రాలతో, ప్రకృతిలోంచీ, సామాజిక జీవితంలోంచీ ప్రతీకల్ని ఏరుకుని, స్పష్టమైన రాజకీయలక్ష్యంతో కవిత్వాన్ని రచించడం ప్రారంభమైన తర్వాతసంక్లిష్టతవెనుకడుగు పట్టింది. అసలు నిజానికి మానవ జీవితం రోజురోజుకూ సంక్లిష్టమవుతున్నదని, దాన్ని వివరించడం, దాని సారాన్ని గ్రహించి గ్రహింపజేయడం రచన లక్ష్యమని అంటారు. చివరికి ఇస్మాయిల్‌గారు కూడ ఈ అంశాన్ని ఒప్పుకుంటూనే "విషయమే సంక్లిష్టం గనుక, కవిత్వం సంక్లిష్టంగా గోచరించవచ్చు" అనీ అంటారు. సంక్లిష్ట మానవానుభవాన్ని వివరించే కవిత్వం తనకు తానే సంక్లిష్టమైపోతే దాని ఉనికినే అది నిరాకరించుకున్నట్లు కాదా?

సంక్లిష్ట కవిత్వానికి సమర్థనగా ఈ మధ్య వచ్చిన వాదన నగర జీవితం సంక్లిష్టమవుతున్నదనేది. తెలుగుసీమలో నగరాలే లేవు. మన ఏకైక నగరం హైదరాబాదు ఇంకా అచ్చమైన నిజాం హవేలీయే. అక్కడక్కడా నగరం కాటేస్తున్న జాడలు కనబడతాయిగాని కింది నుంచి వెంటనే గ్రామం పోలికలూ తలెత్తుతూనే ఉంటాయి. జీవితం సంక్లిష్టం కావడమంటే జీవితంలో వేగం,ఆందోళన, అనిశ్చితత్వం, భద్రతారాహిత్యం భయం మొదలయిన లక్షణాలు పెరగడం, మనుషుల మధ్య దూరం పెరిగి పోవడం, ఆర్ద్రత లోపించడం, ఎవడికి ఎవడూ పట్టని ఏకాంత ద్వీపాల సమూహంలా సమాజం కుళ్ళిపోతూ ఉండడం ఇటువంటి లక్షణాలు ఒక

న్యూయార్క్‌లో ఉంటాయి, ఒక షికాగోలో వుంటాయి, ఒక లండన్‌లో ఉంటాయి. పెట్టుబడి విస్తరించిన చోటికి విస్తరిస్తాయి. హైదరాబాద్ ఆ జాబితాలోకి ఇంకా ఎక్కలేదు.

సరే, హైదరాబాదు నగరమే అనుకున్నా, సంక్లిష్ట జీవితానుభవాన్ని సంక్లిష్టంగానే చిత్రిస్తే మధ్యలో కవి చేస్తున్నదేమిటి? ఒంటరితనం ఒక సంక్లిష్ట అనుభవంగానే కవికిఅందుతున్న దనుకుందాం. ఆ ఒంటరితనాన్ని అందించిన "నగరాన్ని" "నాగరికతను"ను కవి ద్వేషించనయినా ద్వేషించాలి ప్రేమించనయినా ప్రేమించాలి. ద్వేషిస్తే ఒంటరితనం ఎట్లా మానవతకు శత్రువు అవుతుందో, దాన్నెట్లా కూలదోయాలో వివరించి చెప్పాలి. ప్రేమిస్తే ఒంటరి తనం ఎంత మంచిదో "ఏకాకవియోగ గీతిక" అంటూ వివరించాలి. కాని అదీ ఇదీ కాక కేవలం ఒంటరితనాన్ని వివరిస్తూ పదచిత్రాలల్లడం వల్ల ప్రయోజనం ఏమిటి? నిజానికి ఒంటరితనాన్ని వర్ణించడంతో సంతృప్తిపడని కవులు క్రమక్రమంగా ఒంటరితనాన్ని కీర్తించడంలోకి ప్రయాణిస్తున్నారు. ఒంటరి తనం పట్ల వ్యతిరేకత ఉన్న, సామూహిక కార్యాచరణను, సామాజిక పరిణామాన్నీ కోరుకునే శక్తులు ఈ కవిత్వంమీద దండెత్తడంసహజమే. ఆ దండయాత్రలో సరైన ఆయుధాలు లేక పోవడం వల్ల "అస్పష్టంగా ఉంది" అనేది కూడ ఒక ఆయుధమవుతోంది.

నిజానికి,"మీరు రాయవలసిన విషయాలు రాయడంలేదు మీ బాధ్యతలను గుర్తించడంలేదు. అద్భుతమైన మీ శక్తిని, ప్రజలకోసం వినియోగించడంలేదు. మీ ఒంటరి కష్టాలపాటల కింద మా జీవన్మరణ సంఘర్షణలు నలిగి పోతున్నాయి" అని ప్రకటించవలసి ఉంది.

ఐతే సరిగ్గా ప్రజల జీవన్మరణ సంఘర్షణలు నలిగిపోయిన చారిత్రక సందర్భమే ఇటువంటి కవితా ధోరణుల ఆవిర్భావానికి కారణమైందనడం ఒక వాస్తవం. డాక్టర్ రామనాథం హత్య తెలుగు సమాజంలోని ఆలోచనా పరుల ముందు ఒక స్పష్టమైన సవాల్‌నే విసిరింది. దాని జవాబులే అస్పష్టంగా ఉన్నాయి. ప్రజల పక్షం వహించే మేధావి పట్లనయినా, ఉదార ప్రజాస్వామిక వాది పట్లనయినా రాజ్యహింస కనికరం చూపదని డాక్టర్ రామనాథం రుజువు చేశారు. తెలుగు నేల మీద ఆట, పాట మాట బంద్ అయిపోయిన ఒక భయానక పాలన నెలకొంది.

ఇటువంటి బీభత్స రాజ్యంలో సామాజిక చైతన్య రూపాలపాత్ర ఎప్పుడూ పూగిసలాటతోనే వుంటూ వస్తున్నదని చరిత్ర చెపుతుంది సాగుతున్న దుర్మార్గానికి వ్యతిరేకముగా ప్రజలను సమీకరించవలసిన, ప్రజలలో భవిష్యత్తుపట్ల ఆశను, ధైర్యాన్ని నింపవలసిన కళారూపాల-ముఖ్యముగా మధ్య తరగతి కళారూపాలు-తమ కర్తవ్యాన్ని విస్మరించడం, వీలయినంత అనిర్దిష్టంగా రాసి ఏ అన్వయానికయినా అవకాశం మిగుల్చుకోవడం ఎప్పుడూ జరిగేదే తెలుగు నేలమీది కవిత్వములో అనిర్దిష్టతకు ఇదీ ఒక కారణం కావచ్చును.

కాగా మన వచన కవులందరూ మధ్య తరగతి "భద్రలోగ్" వర్గానికి చెందిన వాళ్లే కావడం, విస్తృతమైన కవితా, సాహిత్య పరిచయం, అధ్యయనం లేకుండానే "సర్టిఫికెట్లు" పొంది వుండడం, మన సమాజములో కవికివున్న గౌరవం మొదలైన కారణాలు కవులు తమను తాము పరీక్షించుకోకుండా అడ్డంపడుతున్నాయి. ఈ సందర్భములో వాళ్ళను విమర్శకులయినా, పాఠకులయినా చెక్ చేయాలి. కాని ఈ కవులు చాల స్పష్టంగా తమను అర్థంచేసుకుని, అంచనా కట్టగల విమర్శకులు లేరని, పాఠకులు తమను అర్థంచేసుకునే ప్రయత్నం చేయడంలేదని ప్రకటిస్తున్నారు.

తెలుగు సాహిత్య విమర్శ స్థాయిపట్ల, సాహిత్య విమర్శకులపట్ల కవుల చిన్నచూపువల్ల కవులను అస్పష్టతనుంచి కాపాడే పనిని విమర్శకులు చెయ్యలేరు.

మన కవితా పాఠకులు ప్రధానముగా మధ్య తరగతికి, ఇప్పుడిప్పుడే మధ్య తరగతిలోకి ఎదుగుతున్న విద్యాధిక, ఉద్యోగ వర్గాలకు చెందిన వాళ్ళు. వీళ్ళలో అత్యధిక సంఖ్యాకులు మౌన పాఠకులు. వాళ్ళు ఏం కోరుకుంటున్నారో, కవిత్వం గురించి ఏమనుకుంటున్నారో తెలుసుకునే మార్గంలేదు. ఇక వోకల్‌గావున్న పాఠకులలో కవుల దురభిమానులు, తీవ్ర వ్యతిరేకులు తప్ప సమ్యగ్ దృక్పథంతో కవుల్ని, కవిత్వాన్ని, అస్పష్టతను అంచనావేసేవాళ్ళు లేనట్టు కనబడుతుంది.

ఐనా ఇది నిరాశకు వేళకాదు. సామాజిక పరిణామ క్రమంలో తలెత్తే అన్ని వైపరీత్యాలను పరిష్కరించగల శక్తి ప్రజలకు వుంటుంది సమాజం తాను పరిష్కరించ గలిగిన సమస్యలనే తన కర్తవ్యముగా సృష్టించుకుంటుందని మార్క్స్ అందుకే అన్నాడు. ఒకానొక సామాజిక చైతన్యరూపం అనవసరమైన రాద్ధాంతానికో, భయానికో, గందరగోళానికో, నిర్లిప్తతకో గురయి వున్నప్పుడు ఆ సమస్య లన్నిటినీ పరిష్కరించే అవకాశమూ శక్తి సమాజానికి వుంటాయి. ఐతే ఈ సంక్షోభ సమయంలో విడివిడిగా కవులు తమ తమ కళాస్త్ర పుణ్యాన్ని ప్రదర్శించాలి. తెలుగు కవిత్వానికి అభివ్యక్తిలో కొత్త కోణాలు చూపించారు. గోర్కీ అన్నట్టు

స మీ క్ష :

గురజాడ గొప్ప

అకవి అని కొందరూ, కాదు, మహాకవి అని మరికొందరూ గురజాడ గురించి భిన్నమైన అంచనాలు కట్టారు ఇది ఆయన బతికుండగానే మొదలయింది. నిందను సరసమైన హేళనతోనే తాను తోసివేశాడు. "గాడిదలు" అంటూ ఎదురుదాడి చేస్తున్నాడు శ్రీ శ్రీ ఇదంతా ఆ గురజాడ కవిత్వాన్ని మాత్రమే పురస్కరించుకొని వచ్చిందేమీకాదు. ఆయన ప్రకటించిన నవ్యతత్వం వికటించిన వాళ్లే గురజాడ సాహిత్యాన్ని, అందులోనూ కవిత్వాన్ని మరీ పరిహసించారు, నిరసించారు, ఈసడించారు. అది నవీనయుగానికి అనుగుణమైన ప్రజాస్వామిక తత్వమని ఎంచినవాళ్ళు దాన్ని మెచ్చారు, మిన్నులకెత్తారు. సాహిత్యరంగంలోకూడా ప్రతిఫలించక తప్పని వర్గ పోరాటమే దీనంతటికీ మూలం.

భావకవిత్వ పంథానుంచి తప్పుకొంటూ వచ్చిన సంక్రమణ దశలోని శ్రీ శ్రీ కి గురజాడ సాహిత్యంతో తొలి పరిచయం.కేవలం ముఖపరిచయమే ఏర్పడింది. టైఫాయిడ్ జ్వరంతో మంచంపట్టి వుండిన ఆలనాటి నవ యువకుడి దృక్పథం తీవ్రంగా మార్పుచెందడానికి ఈ పరిచయం పోను ఎక్కువగా పనికివచ్చింది. కాల్పనిక వైఖరినుంచి వాస్తవిక వైఖరికి చెయ్యిపట్టి నడిపించి "శ్రీరంగం శ్రీనివాసరావు (కవితా సమితి)" నుంచి శ్రీశ్రీ ఇలా బయల్పడ్డాడు. ఇంకా గ్రాంధిక శైలివదలని 1982నుంచి ("కన్యాశుల్కములో స్త్రీ వ్యక్తులు")1980లదాకా ("కామ్రేడ్ గురజాడ" గురజాడ సాహిత్యం తాలూకు అనేక కోణాల గురించి రాస్తూ వచ్చాడు. "వారం-వారం" శీర్షిక నిర్వహించేప్పుడు రాసినవే ఎక్కువ ఉదయినికి రాసిన ముత్యాలసరం-ఒకకృషి పరిశోధనాత్మక వ్యాసం. ఇంతకంటే గొప్పదిమొదటఆకాశవాణిలో ప్రసారమై

"రూపం మరింత సునిశితమూ, మరింత విలువైనదీ అవుతోంది. పదజాలం మరింత నిర్లిప్తమూ, నిస్సారమూ అవుతోంది ఉద్వేగంలో నిజాయితీ లోపిస్తోంది. మేల్కొలుపు లేదు." ఇందుకు కారణం మళ్ళీ గోర్కీ మాటల్లోనే చెప్పాలంటే "కళానైపుణ్యం వ్యక్తికి వుంటుంది, కాని సృజనాత్మకత సాధ్యమయ్యేదిమాత్రం సమాజానికే."

మనం చేయవలసిందల్లా ప్రజల సృజనాత్మకత వ్యక్తమయ్యే మార్గాల్ని సుగమం చెయ్యడమే. అస్పష్టతలు, సంక్లిష్టతలు, అనిర్దిష్టతలు ఆ సృజన వెల్లువలో కొట్టుకుపోతాయి.

తర్వాత 'తెలుగు స్వతంత్ర'లో అచ్చుపడిన 'గురజాడ అధిక్యానికి కారణాలు'. మొత్తం 15 చిన్నా పెద్ద వ్యాసాలతో 'మన గురజాడ' ఇప్పుడు వి.ర.సం. ప్రచురణగా వెలువడింది. ఎక్కడెక్కడివో వెదికిపట్టి ఒకచోటికి తెచ్చి అవసరమైన వివరణలు రాసిపెట్టినందుకు చలసాని ప్రసాద్‌ను అభినందించాలి.

బసవరాజు అప్పారావు తప్ప తక్కిన ఏ భావకవీ గురజాడ సాహిత్య మూర్తిని కన్నెత్తి నిండుగా చూడలేదు. ముత్యాల సరాల ఛందస్సును తీసుకొని దానిలో తమ భావాలను ప్రకటించుకొన్నవాళ్ళే ఎక్కువ. నమస్కార బాణాల్లాంటి అరాకొరా ప్రశంసలు తప్పితే ఆయన సాహిత్యాన్ని నిజంగానే పట్టించుకోలేదు. గురజాడ సాహిత్యానికి గల విశిష్టతను గుర్తించిన ఆనాటి రచయితలలో చింతా దీక్షితులు ముఖ్యుడు. దాంపత్య వ్యవస్థలో స్త్రీకి కలుగుతూన్న దురన్యాయం విషయమై గురజాడ ప్రకటించి వుండిన భావాలలోని సత్తాను గ్రహించింది చలం. ఈ అనాదరణకు కారణమేదీ లేకుండా పోలేదు. 'నవ్య' కవిత్వం తీరే వేరు. దాని ప్రమేయాలే వేరు. దాని పద్ధతే వేరు. ఆత్మాశ్రయ ధోరణిని, తెలుగు కవిత్వంలో అది ప్రకటించిన ప్రేమతత్వాన్నీ, ఇంకా అది అంటి పెట్టుకున్న అక్షర గణఛందస్సులనీ, గురజాడ ఆవిష్కరించనూ లేదు, అనుసరించనూ లేదు. వాస్తవిక ధోరణినీ, మానవ ప్రేమతత్వాన్నీ, మాత్రాచ్ఛందస్సులనీ ఆయన అవలంభించాడు. సాహిత్య రూపాలలో కథనూ నాటకాన్నీ తీర్చిదిద్ది, కావ్యాలకుగల అతిశయ బాహుళ్యానికి పోటీగా రచన ప్రాముఖ్యాన్నీ స్థాపించాడు. పసిగట్టుకొని తన కావ్యరచనలలో మిగిలి వుండిన గ్రాంథిక శబ్ద రూపాలను వ్యావహారికానికి అనుకూలంగా సంస్కరించుకొంటూ పోయాడు. గిడుగువాదాన్ని తన సృజనాత్మక సాహిత్యంలో నిలబెట్టాడు. వీటినన్నిటినీ అభిమానించే రచయిత ననుసరించినప్పుడే గురజాడ సాహిత్య భాష్యం మొదలయింది. గురజాడా శ్రీ శ్రీ "గురుశిష్యులు" అయింది ఇలాగే అయితే కవిత్వానికి సంబంధించి శ్రీ శ్రీ గురజాడ చూపిన దారిలోనే నడవలేదు. ఇక వచనంలో, గురజాడ నడుము దగ్గరకు గూడా రాడు శ్రీ శ్రీ. మరి, గురుశిష్యులెలా గయ్యారంటే, గురజాడ సాహిత్యంలోవి ప్రజానుకూలమైన వైఖరి శ్రీ శ్రీ సాహిత్యంలో మరింత ప్రస్ఫుటమయింది, మరింత పరిపూర్ణమయింది. గురజాడ సాహిత్యాన్ని ఏ మంచి కారణాలకోసం మెచ్చాలో తనకు తెలిసివచ్చాకనే

శ్రీశ్రీ నుంచి "వెధవాయత్వం" క్రమ క్రమంగా దూరమయింది. ఈ మార్పు ఎలా జరుగుతూ వచ్చిందో ఈ వ్యాసాల ద్వారానే శ్రీశ్రీ అప్రయత్నంగా తెలియపరిచాడు.

తనకూ అదుద్రాదులకూ కంఠపాఠమైపోయిన 'కన్యాశుల్కం' శ్రీ శ్రీ ప్రశంసను ఎక్కువగా చూరగొన్నది అదే గురజాడను "మహాకవి" చేసిందంటాడు. అయితే, అది మాత్రమేనా? 'ముత్యాలసరం' అనే కమనీయమైన ఛందస్సును గురజాడ ఆవిష్కరించాడని అన్నప్పటికీ, దాన్ని దక్షతతో నిర్వహించలేకపోయాడని శ్రీ శ్రీ విశ్వసనీయంగానే నిరూపించాడు. గురజాడ కావ్య రచనలలో అక్కడక్కడ మాత్రమే "కవిత్వ స్ఫులింగాలను" శ్రీ శ్రీ చూడగలిగాడు. ప్రమాద ఫలితాలూ అలక్ష్య ఫలితాలూ వ్యాకరణ దోషాలూ బహుళంగా కనిపించాయి. గురజాడ కవిత్వం మహోత్తమమైనదని అననక్కరలేదుగాని ఈ లోపాలను కప్పివేయగల "మహత్తర భావాలు" మాత్రం అందులో పుష్కలంగానే ఉన్నాయని చెప్పాలి. తన నాటకంలో ప్రకటించిన జీవితతత్వమే ఈ గేయాలకు ఉత్కృష్టతను ఆపాదిస్తుంది. వీటన్నిటిలో శ్రీ శ్రీకి చాలా బాగా నచ్చి అతిశయోక్తులు పలికించింది "దేశభక్తి" గేయం ఒకటే. సామాజిక వ్యవస్థలో మొదలైన మార్పుకు అనుగుణంగా దేశపురోగమన దిశను సూచించే ఆగేయం, కవికిగల గాఢమైన ప్రజా ప్రమేయాన్ని వాచ్యం చేసింది. నిర్దిష్టమైన మరొక సామాజిక ఆర్థిక నిర్మితి తాలూకు లక్షణాలను ఇదమిద్ధంగా పేర్కొంది, అప్పటికి అదే భవ్యమనిపించింది. ప్రభుసమ్మితమో, కాంతా సమ్మితమోగాని, తన వస్తువు మూలంగానే ఆ గేయం ప్రశస్తమయింది. ఈ ఉత్కృష్టమైన వస్తువే గురజాడ ఇతర గేయాలనూ ప్రకాశింపజేస్తుంది. శ్రీ శ్రీ కోరిన "మహత్తర భావాలు" వీటిలో ఉండికూడా ఇవి "మహత్తర విధం"గా రూపొందకపోయేసరికి "ఉత్కృష్ట కవిత్వం"గా నిలవలేకపోతున్నాయా? తన కొత్త ఛందస్సులో గురజాడ చేసిన ప్రయోగాలు అనేకం. వాటిలో కొన్నిటినే సాపు చేసి మెరుగుపెట్టాడు, మరి కొన్నిటిని అలాగే వదిలేశాడు. కవిత్వ గుణ నిర్ణయంలో రూపానికీ వస్తువుకూ సమప్రాముఖ్యం ఉన్నదని అంగీకరిస్తూనే, రూపైకవాదం అనుచితమని మాత్రం చెప్పాలి. కవిగా కూడా గురజాడ అధికుడే కనీసం తన సమకాలికుల కంటె ఎంతో అధికుడు.

గురజాడ కథల విషయంలో కూడా శ్రీశ్రీ లోతులకు వెళ్ళలేదు. "మీ పేరేమిటి?" అనే కథ యోగ్యతను బట్టి శ్రీశ్రీకి బాగా నచ్చింది. నిజంగానే అది గొప్పది. అయితే, ఆద్యంతాలలో గల చమత్కారాన్ని బట్టి తప్ప మరొకందుచేత-

వేశ్యాలోలుడైన భర్తను సంస్కరించే భార్య ప్రయత్నం— 'దిద్దుబాటు' గాని, సంస్కరణవాదిగా అచరణలో నెగ్గలేక భంగపడిన ఒక విద్యాధికుడి దురవస్థను నిరూపించే 'సంస్కర్త హృదయం' గాని, శ్రీశ్రీ విమర్శాదృష్టిని ఆకట్టుకోలేదు. ఇదంతా ఎందుకు, గురజాడ జీవితతత్వమే శ్రీశ్రీ మది కెక్కవలసినంతగా ఎక్కలేదనడానికి ఈ వ్యాసాలలో కనిపించే దాఖలాలు తక్కువే. గురజాడ సాహిత్యాన్నంతటినీ ఉద్భాసింపజేసేది ఇదే. ఒక వ్యాసంలో, కందుకూరి, గిడుగు, గురజాడలది కేవలం సాహిత్య దృక్పథమే గాని, "దాన్ని ఆ విధంగా తీర్చిదిద్దిన ఆర్థిక కారణాల వైపు" వారి ఊహలు ప్రసరించనే లేదని శ్రీశ్రీ రాశాడు. ఆర్థిక, తదితర అంశాల ప్రస్తావనగాని చిత్రణగాని సాహిత్యంలో నేరుగా మొరటుగా దూరదు. సమాజ జీవితాన్ని పరిణామాత్మక గతిక్రమంగా అనుభూతుల పరంగా చిత్రించేప్పుడు, సాహిత్యానికి వెనక నిలిచేదల్లా ఈ అంశాల కన్నిటికీ సంబంధించిన జీవితావగాహనే. ఇది గురజాడకు పట్టు బడినంతగా మరొకరికి పట్టుబడలేదు. గురజాడ ఆధిక్యానికి కారణం ఇదే.

ఒకవైపు బ్రిటిష్ 'రేడికలిజం' ప్రభావం వుంది. ఆగస్టికోంట్ 'పాజిటివిజం', ను, గాడ్‌స్టన్ తరహా 'లిబరలిజం'ను దాటుకొని ముందుకు వచ్చాడు. మరొకవైపు, భారత జాతీయతావాద ప్రభావం వుంది వీటికితోడు తన మానవ పారిసర్యాన్ని నిశితంగానూ లోతుగానూ విమర్శించుకొని స్వకీయమనదగిన ఒక సామాజిక వైఖరిని రాబట్టుకొన్నాడు. 'కన్యాశుల్కం' గొప్ప నాటకమైందంటే, శ్రీశ్రీ అనుకొన్నట్టుగా అది జీవితమంత విశాలమైంది కావడంవల్ల కాదు. నిజానికి ఏదీ అంత విశాలం కాలేదు కూడా. నిర్దిష్టమైన ఒక జీవిత శకలాన్ని చేబట్టి దాన్ని అన్ని కోణాలనుంచీ పరిశీలించి, మనస్సు లోతులను ముట్టి చూచి, ఆ పరిస్థితులలో ఏ తరహా మనుషులు ఏ విధంగా ప్రవర్తిస్తారో ఆ విధంగా చిన్నా పెద్దా పాత్రలచేత నాటకంలో ప్రవర్తింపజేశాడు. నాటకకర్తగా గురజాడ గొప్ప, "విశ్వతోముఖత్వం", "సర్వజనీనత" విడిగా, నిర్దిష్టతకు అతీతంగా ఉండవు పైగా, "మానవుడు మహాకవి అయినప్పుడు అతీంద్రియజ్ఞానంతో పనిచేస్తాడు" వంటి మాటలకు గూడా స్థానం ఉండదు. భూస్వామిక వ్యవస్థకు మరణదశ ఆసన్నమై దాని వ్యవస్థలూ సంస్థలూ సంక్షోభంలో పడిన పరిస్థితిలో, ఆ వ్యవస్థ తాలూకు భావాలను మూర్తీభవించే వ్యక్తుల నమూనాను పాత్రలుగా నిలిపినప్పుడు, వాటి విషాదాంత బీభత్స రూపాల గురించి శ్రీశ్రీ సరిగా చెప్పాడు. మారుతూన్న సమాజం గురించీ, ఆర్థిక-రాజకీయ విపరిణామాల గురించీ

గురజాడకిపూర్తి స్పృహ ఉందన్నమాట. సామాజిక పరిణామాన్ని మంచితెన్నులో, భవిష్యత్తుమీద ఆశతో, "వేగవంతం" చెయ్యడానికి గురజాడ సంకల్పించుకొన్నాడని ఇందుకే రాశాడు శ్రీశ్రీ

అయితే, చలసాని ప్రసాద్ రాసినట్టుగా, వలసాధిపత్యం తాలూకు దుష్టలక్షణా లను సరిగా గుర్తించలేకపోవడం గురజాడ ముఖ్యమైన లోపం. విద్య, కళలు వంటి వాటి విషయంలో మాత్రం వలసాధిపత్యం గురించిన స్పృహ ఆయనకు ఉన్నట్టు తెలుస్తుంది. రాజకీయంలోనూ కొత్త ధోరణులను మెచ్చగలిగాడు. అయితే రాజభక్తి భావాలను ప్రకటించాడు. ఇది వైరుధ్యం. కాకుంటే, అప్పట్లో ఎవ్వరూ దీనికి అపవాదం కాదు. తామూ బానిసలమే నన్న స్పృహ అప్పటి బుద్ధిజీవులకు లేకుండా పోవడానికి కారణం, వాళ్ళ కుహనా చైతన్యం(false consciousness). ఏ దోపిడి చట్రానికి లోబడి తాము జీవిస్తూ వచ్చారో,భావిస్తూ వచ్చారోఆ చట్రాన్నే ఆరాధిస్తూవచ్చారు కూడా. తాము స్వతంత్రులమనే భ్రమపడ్డారు. అయితే, సాంప్ర దాయికతనూ మూఢ విశ్వాసాలనూ క్రూర సామాజిక పద్ధతులనూ ఎదుర్కోవడంలో వీరికి, వలసాధిపత్యం మూలంగా సంక్రమించిన నవీన పాశ్చాత్య భావజాలం అయు ధంగా పనికి వచ్చింది. "వస్తుతత్వము" గురించి తనకు గలిగిన కొత్త పరిజ్ఞానం విష యంలో ఇంగ్లీషువారికి తన కృతజ్ఞతను ప్రకటించుకొన్నాడు గురజాడ. ఇది శాస్త్ర పరిజ్ఞానమేగాని మరొకటి కాదు. గురజాడ జీవిత తత్వంలోనే వున్న లోపాలు, ఒక వ్యాసంలో శ్రీశ్రీ రాసినట్టుగా, "గురజాడ కూడా మానవమాత్రుడే అని మనకు మరోసారి జ్ఞాపకం చేస్తాయి." అయితే అవి ఆ తత్వాన్ని మొత్తంగానే కొట్టి వెయ్యగలంత తీవ్రమైనవి కాదు.

"సామాజిక చారిత్రక పరిణామ గమనంలో కవి యొక్క సాహిత్యస్థానం నిర్ణీతమవుతుంది. కవి ప్రగతిశీలి, ప్రతిభాశాలి అయితే ఆ గమనాన్ని అతడు మరింత వేగవంతం చేస్తాడు. సామాజిక పరిణామానికి విప్లవ పంథాలో వేగం సాధించిన మహాకవిగా గురజాడ అప్పారావుకి నేను నమస్కరిస్తున్నాను".

ముచ్చటగా అచ్చుపడిన ఈ పుస్తకం కూర్పు విషయంలోనూ మంచి ప్రమా ణాన్ని నెలకొల్పగలగడం విశేషం. నోట్సు దీని విలువను ఇంకా పెంచుతున్నాయి. అయితే ఇంకాకొంచెం శ్రద్ధ అవసరం. "తల్లావఝుల" ఇంకోవిధంగా అచ్చు

రెక్కింది. (పు. 34) కవి చౌడప్ప కందపద్యాన్ని నిర్దుష్టంగా ఉద్ధరించడం జరగ లేదు. (పు. 37). "ఆయఃపిండం" రూపు చెడింది (పు. 38).

పరిశీలకుడు మహాకవి. పరిశీలనా వస్తువు మరొక మహాకవి.

— కె. వి. ఆర్.

మన గురజాడ రచన : శ్రీశ్రీ కూర్పు : చలసాని ప్రసాద్ ప్రచురణ : విరసం వెల : 10 రూపాయలు ప్రతులకు : సి. ఎస్. ఆర్. ప్రసాద్ (132, యస్. వి నగర్, గుంటూరు-6)

సమీక్షా వ్యాసం :

స్వేచ్ఛ - మరొక దృక్పథం

వి. కవిత

"ఒక మహాత్మాజీ తెరవడానికీ
ఒక మాతాజీ మూసెయ్యడానికీ
ఒక పితాజీ మళ్ళీ తెరవడానికీ
స్వేచ్ఛ దుకాణం కాదు
పర్వాల కావల విశాలాకాశం వినిపించే సంగీతం స్వేచ్ఛ
హిమాలయాల కన్న బరువైన మరణం స్వేచ్ఛ
పసిఫిక్ కంటె లోతయిన బతుకు స్వేచ్ఛ"

—మలయాళీ కవి సచ్చిదానందన్

ఓల్గాగారు రాసిన 'స్వేచ్ఛ' చర్చకు పెట్టిన అంశాల దృష్ట్యా తప్పనిసరిగా ఆహ్వానించవలసిన నవల. కథనం చాల ఆసక్తిదాయకంగా, కదిలించేలా సాగింది. అనేక మంది పాఠకులు నవలలోని పాత్రలతో, సన్నివేశాలతో తాదాత్మ్యం చెందారు. ఆ ఐక్యత ఆధారంగానే నవల గురించి అభిప్రాయాలు ఏర్పరచుకున్నారు. నవల ప్రకటించిన అవగాహనలను, ప్రతిపాదించిన విలువలను, వాటికి పాఠకుల మీద ఉండగల ప్రభావాన్ని లోతుగా గుర్తించలేని పరిశీలకులు కూడ నవలను పైపైన చదివి ఇటువంటి స్వీయ మానసిక "విశ్లేషణ"ల్ని ప్రకటించారు మొత్తం మీద నవల గురించి జరగవలసిన పద్ధతిలో చర్చ జరగలేదు. తెలుగులో వస్తున్న అతితక్కువ సీరియస్ సాహిత్యంలో భాగమైన ఈ నవల మీద సీరియస్ విశ్లేషణ జరిగినట్టు కనబడడంలేదు. పరిధిలో, పరిమాణంలో చాల ఎక్కువగానే జరిగినట్టు అనిపించిన చర్చంతా కూడ పైన చెప్పినట్టు స్వీయ మానసిక అభిప్రాయాల చుట్టూనే తిరిగింది. కాని లోతయిన, నిశితమయిన, వస్తుగతమయిన చర్చ జరగవలసిన స్థాయిలో మాత్రం జరగలేదు. కనుక నవలను నిర్నిబంధంగా అంగీకరించి, ఆరాధించే బృందం ఒకటి, ఏ మినహాయింపులు లేకుండా కొట్టివేసి, తిరస్కరించే బృందం ఒకటి తయారయ్యాయి. ఈ పరిస్థితిలో నవలను సీరియస్‌గా విశ్లేషించవలసిన అవసరం మరింత పెరుగుతోంది. నవల వస్తు శిల్పాలను వాటి సారాంశాన్ని, ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని విశ్లేషించవలసి ఉంది. ఈ విశ్లేషణకు తోడ్పడే ప్రతిపాదనలలో కొన్నిటిని ముందుకు తేవడమే ఈ వ్యాసలక్ష్యం.

స్వేచ్ఛ నవల గురించి చేసే చర్చ ప్రధానంగా స్వేచ్ఛా భావన, కుటుంబ విచ్ఛిన్నం (రద్దు), సంఘటిత కార్యాచరణ అనే మూడు అంశాలను విశ్లేషిస్తూ సాగాలి. ఎందుకంటే నవల ఈ మూడు అంశాలను గురించి కొన్ని కచ్చితమైన అవగాహనలను ప్రకటించింది. కొన్ని పరిష్కారాలను చూపించింది. కొన్ని సందేశాలిచ్చింది ఆయా పరిష్కారాలు అనివార్యమైనవనో, ఏకైకమయినవనో అనిపించేలా ఆయా అంశాల అభివృద్ధి క్రమం సాగింది. అవి ఒక క్రమ పరిణామంలో సహజమైన ముగింపులను పొందాయి. కనుక చర్చ ఆయా అంశాల క్రమ పరిణామాన్ని కూడ గమనంలోకి తీసుకోవాలి.

ఒక విద్యావంతురాలయిన ఆధునిక యువతిలో స్వేచ్ఛాకాంక్ష ఎటువంటి పరిణామాన్ని పొందుతుందో నవల చిత్రించింది. విద్యార్థి దశలోని స్వేచ్ఛా భావన నుంచి, గృహిణిగా, ఉద్యోగిగా, తల్లిగా, సామాజిక బాధ్యతను గుర్తించి ఆచరణలో పాల్గొన్న వ్యక్తిగా ఉన్నప్పటి స్వేచ్ఛా భావన వరకు అరుణకు స్వేచ్ఛ పట్ల గల అవగాహన పరిణామం చెందింది. ఇది స్వేచ్ఛాకాంక్ష కాదని, అభిమానం మాత్రమే ననే పరిశీలన కొంతవరకు నిజమే గాని అరుణ ఎదుగుదలలో అభిమానం, స్వేచ్ఛాకాంక్ష, వ్యక్తిత్వం కోసం, సృజనాత్మకత కోసం తపన కలగలిసి ఉన్నాయి. వాటన్నిటినీ స్వేచ్ఛాకాంక్ష గానో, వ్యక్తిత్వం కోసం తపన గానో వివరించవచ్చును.

వ్యక్తిత్వం, సృజనాత్మకత అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఏ మనిషిలోనైనా ఏదో ఒక మేరకు స్వేచ్ఛాకాంక్ష వికసిస్తూ ఉంటుంది. ఏ మనిషయినా ఒక వ్యక్తిగా ఎదిగే క్రమంలో, అంటే ఒక రక్తమాంసాల జీవి సామాజిక వ్యక్తిగా ఎదిగే క్రమంలో రక్తం, కుటుంబం, కులం, మతం, జాతివంటి అనేకానేక బంధనాల్ని వదుల్చుకుంటూ సాగిపోవలసి ఉంటుంది. ఈ ఘర్షణలో, పరిణామంలో వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. వర్గరహిత సమాజంలో తప్ప, మరి ఏ ఇతర సమాజంలోనూ మనుషులు పూర్తి వ్యక్తులుగా, అంటే సృజనాత్మక, సామాజిక వ్యక్తులుగా ఉండే అవకాశం లేదు. కాని ఆ సమాజం ఏర్పడడానికి చాల ముందునుంచే, వేల ఏళ్ళ ముందునుంచే మానవులలో సహజమైన సంఘజీవితాకాంక్ష బంధనాలను రద్దుచేసే ఆచరణగా, స్వేచ్ఛకోసం తపనగా వ్యక్తమవుతుంది.

అంటే స్వేచ్ఛ ఒక హఠాన్నినాదం కాదు. మానవులు వ్యక్తిత్వం కోల్పోయి పరాయీకరణ చెందడానికి కారణమైన సామాజిక, ఆర్థిక, చారిత్రక సంస్థలే ఆ మానవుల స్వేచ్ఛను కూడ కొల్లగొట్టాయి. అంటే బంధనానికి, స్వేచ్ఛకు చరిత్ర ఉంది,

ఒక క్రమ పరిణామం ఉంది. స్వేచ్ఛను ఈ చారిత్రక నేపథ్యంలో అర్థం చేసుకోక పోతే దాని గురించి విచిత్రమైన భావనలు కలగక తప్పదు. స్వేచ్ఛను ఒక సామాజిక, చారిత్రక అంశంగా కాక వయ్యక్తిక, నైతిక అంశంగా చూసినప్పుడు దాని సాధ్యాసాధ్యతల బదులు ఆయా వ్యక్తుల సాహసమో, పిరికితనమో కనబడుతుంది. దాని అనివార్యత, సహజత్వం బదులు దాని మంచిచెడులు కనబడతాయి. దానికి సమాజంపై ఉండగల ప్రభావం బదులు వయ్యక్తిక సౌకర్యం కనబడుతుంది.

సరిగ్గా స్వేచ్ఛలో అరుణ కూడ స్వేచ్ఛా భావనను, ఇట్లాగే వయ్యక్తికంగా, నైతికంగానే గుర్తించింది. ఐతే అందుకు అరుణను తప్పు పట్టనవసరంలేదు. అరుణ ఆ విషయాల సారాంశాన్ని అర్థం చేసుకోగలిగిన వ్యక్తి కాకపోవచ్చు.

అరుణను మానవ సమాజంతో పోలిస్తే, మార్క్సిజం రంగం మీదికి వచ్చే వరకూ మానవ సమాజం తన విముక్తి గురించి ఎన్నెన్ని ఆలోచనలు చేసిందో అరుణ కూడ అన్ని ఆలోచనలు చేసినట్టు కనబడుతుంది. ఇది స్వేచ్ఛ గురించి సరిగ్గా తెలియకపోవడంకాదు, బంధనం గురించే సరిగ్గా తెలియకపోవడం. బంధనాలను సారాంశం దాకా వెళ్ళి పరిశీలించలేనప్పుడు కనిపించిన పలుపుతాడును తెంపుకోవడమే స్వేచ్ఛ అనిపిస్తుంది. ఆ చర్యకూడ ప్రగతిశీలమైనదేగాని అసలు పరిష్కారం మాత్రంకాదు. మానవ సమాజం ఇట్లాగే మోక్షం నుంచి ఊహాజనిత సోషలిజం వరకు తన పలుపుతాళ్ళను తెంచుకునే ఊహలెన్నిటినో చేసింది. కాని ఈ పైపై పలుపుతాళ్ళను ఎన్నిటిని తెంపుకున్నా కనబడని పలుపుతాడు అలాగే ఉండిపోయింది.

"ఆ రోజు నేను కోరుకున్న స్వేచ్ఛకు అర్థం లేదేమో ఇంట్లో వాళ్ళు నన్ను కట్టడి చేస్తున్నారని, సినిమాలకీ, షికార్లకీ తిరగనివ్వడం లేదనే కోపం తప్ప మరింకో ఆలోచనలేదు. స్వేచ్ఛ అంటే అప్పుడు నా దృష్టిలో నా కిష్టమైన చీరలు కట్టుకోవటం, సినిమాలకూ, స్నేహితులతో షికార్లకూ ఎవరి ఆజ్ఞలకూ లోబడకుండా తిరగటం. అంతే. అవన్నీ ప్రకాశాన్ని పెళ్ళి చేసుకుంటే కుదురుతాయనుకున్నాను. అవి కుదిరాయి కూడా. కాకపోతే ఇంటి పనిలో, పిల్లల పెంపకంలో కూరుకుపోయి జీవనోత్సాహం పోగొట్టుకుంటానా అనే అనుమానం ఉండేది. అది ప్రకాశంతో మాట్లాడాను. కానీ ఇప్పుడు స్వేచ్ఛ అంటే ఏమిటో నాకింకా బాగా అర్థమైంది. స్వేచ్ఛ ఎందుకో, దాని విలువేమిటో బాగా తెలిసింది" అంటుంది అరుణ ప్రకాశంతో విడిపోయాక. అంటే కొన్ని బంధనాలు వదుల్చుకున్నాక.

"ప్రకాశంకోసం, ప్రేమకోసం, స్వేచ్ఛకోసం కన్నవారిల్లు వదిలినప్పుడు

ఎంతో సంతోషంగా, ధైర్యంగా, ఉత్సాహంగా ఉంది. అప్పటికీ ఇప్పటికీ ఏమిటీ తేడా? ఇప్పుడు ప్రకాశం లేడు. ప్రేమలేదు.

స్వేచ్ఛ మాత్రం ఉంది. అనంతమైన శూన్యం నిండా పరుచుకుని ఉన్న స్వేచ్ఛ. ఏమిటీ స్వేచ్ఛకు అర్థం? ఏమిటీ స్వేచ్ఛ గమ్యం? ఎలాంటిదీ స్వేచ్ఛ నాకు?" అనుకుంటుంది.

"నా బతుకు మాత్రమే నేను బతకటానికయితే నాకీ స్వేచ్ఛ అక్కర్లేదు. నా స్వేచ్ఛకు ఒక అర్థం ఉండాలి. ఆ అర్థంకోసం అన్వేషించటమే ఇప్పుడు నా పని" అన్న అరుణ మాటలతో నవల ముగుస్తుంది.

ఈ స్థితిని అరుణ స్వేచ్ఛ అనుకుంటున్నదన్నది స్పష్టం. నవల అక్కడ ముగిసిపోవడం ద్వారా అరుణ స్వేచ్ఛ పొందిందని పాఠకులు భ్రమపడే అవకాశం కలిగింది. ఓల్గా మార్క్సిస్టు రచయిత. నవల గురించి, స్త్రీ సమస్య గురించి ఆమెకు నిర్దిష్టమైన అభిప్రాయాలున్నాయి. ఈ నవలను సీరియస్ చర్చకోసం ఆమె ఉద్దేశించారు. అటువంటప్పుడు స్వేచ్ఛాభావన గురించి ఈ ముగింపుతో నవల ముగియడం అర్థం కావడంలేదు.

నవలకు ఈ ముగింపు ఉండడానికి గల కారణాలను వెతికితే, 1) అరుణ నిజంగానే స్వేచ్ఛ పొందిందని రచయిత చెప్పదలచుకుని ఉండాలి. లేదా, 2) వ్యాపార పత్రిక పరిధికోసం రచయిత వస్తువును అసమగ్రంగా చిత్రించి ఉండాలి లేదా 3) ఒక క్రమ పరిణామంలో కొంత భాగాన్నే రచయిత చిత్రించదలచుకుని ఉండాలి. ఈ మూడింటిలో ఏ కారణంగా ఆ నవల ముగింపు అట్లా ఉన్నప్పటికీ అవి ఆలోచించ వలసినవే.

స్వేచ్ఛంటే ఏమిటి? అరుణ నిజంగానే స్వేచ్ఛను పొందిందా? ప్రకాశంతో విడిపోవడమే స్వేచ్ఛ అవుతుందా? స్వేచ్ఛ పొందానని అంటూనే దానికి అర్థం వెతుక్కోవాలని అంటే ఏమిటి? అంటే అర్థంలేని స్వేచ్ఛ కూడ ఉంటుందా?

స్వేచ్ఛ ఒక ఉదాత్తమైన భావన. సమాజం సృజనాత్మకంగా, సమానత్వంతో ఎదగడానికి అవసరమైన స్థితిని స్వేచ్ఛ కల్పిస్తుంది. మానవ సహజమైన సంఘ జీవితాకాంక్ష దాని పునాది. అది తొలిదశలో పెట్టుబడిదారీ విధానం నుంచుకు

తెచ్చిన విలువ అయినప్పటికీ, దానిలో అంతకన్న ఉన్నతమైన మానవ సహజమైన ఆకాంక్ష ఉంది. అందువల్లనే స్వేచ్ఛ ఒక వ్యక్తిగత, మానసిక చర్య కాదు. అయి ఉంటే ప్రతి మనిషీ స్వేచ్ఛ పొందావని అనుకోవచ్చు. కాని స్వేచ్ఛను అడ్డుకునే, నిర్ణయించే, సాధించే శక్తులు వేరు. అవి ఉత్పత్తి విధానపు స్థాయి సమాజంలో గతకాలపు భావజాలాల ప్రభావం. మనుషులు స్వేచ్ఛగా ఉండకుండా అడ్డుపడుతున్న ప్రధాన శక్తి స్వంత ఆస్తి. సమాజంలోని మనుషులందరూ సమాజ మానవులుగా కాక వర్గ సమాజ దోపిడీ భావజాలంతోను, దోపిడీ ఉత్పత్తి విధానంలో మరలు గాను ఉన్నప్పుడు వాళ్ళెవరూ పూర్తి స్వేచ్ఛను పొందలేరు. ఆ స్వేచ్ఛను పొందే ప్రయత్నంలో భాగంగా వ్యక్తులు తమమీద తాము ధీరమైన పోరాటం చేసుకోవలసి ఉంటుంది. వ్యవస్థమీద పోరాటంలోను, తమ మీద తాము జరిపే పోరాటంలోను పూర్తిగా విజయం సాధించిననాడే మనుషులు స్వేచ్ఛాజీవులు కాగలుగుతారు.

స్వేచ్ఛ లేదని వగచే బదులు మనుషులు ఈ పోరాటంలో భాగం కావడం ద్వారా స్వేచ్ఛవైపు ప్రయాణం ప్రారంభించవచ్చును. ఇవాళ్టి సామాజిక స్థితి ఏ వ్యక్తికైనా నిజాయితీగా నిజమైన స్వేచ్ఛను పొందే అవకాశం ఇవ్వదు. కాకపోతే డబ్బో, అగ్రకులంలో పుట్టుకో, పురుషుడు కావడమో, అగ్రజాతి కావడమో, మెజారిటీ మతం కావడమో ఒక మనిషికి ఇష్టారాజ్యంగా ప్రవర్తించే హక్కును, అవకాశాన్ని ఇవ్వవచ్చు. కాని ఇష్టారాజ్యమే స్వేచ్ఛ కాదు. స్వేచ్ఛ అనేది సంఘజీవులయిన మనుషుల మధ్య సృజనాత్మక బుద్ధి వికాసానికి, మానవ సంబంధాల అభివృద్ధికి, మానవ జీవన పురోగమనానికి దోహదం చేసే ఒక వాస్తవిక అంశం. అంటే స్వేచ్ఛకు ఇతరుల స్వేచ్ఛనుగాని, సృజనాత్మకతను గాని, మొత్తంమీద మానవ సంబంధాల వికాసాన్నిగాని అటంకపరిచే విధ్వంసం ఉండదు, ఉండడానికి వీల్లేదు.

కాని వర్గ సమాజ భావజాలం ఫలితంగా సమాజంలో పెద్దఎత్తున తప్పుడు చైతన్యం కొనసాగుతోంది. సమాజంలో ఇప్పటికి సమీకృతమైన జ్ఞానంకూడ పూర్తి స్థాయిలో అందరు మానవులకు అందడం లేదు. అందువల్ల కొంతవరకు ప్రతి "అనుభవం" గురించి, ప్రతి "జీవిత సత్యం" గురించి ఎన్నెన్నో రకాల అవగాహనలకు అవకాశం ఉంటోంది. స్వేచ్ఛ గురించి వేరు వేరు భావనలుండడానికి కూడ కారణం అదే.

మరి సాహిత్యం సమాజానికి ప్రతిఫలన మన్నప్పుడు ఈ తప్పుడు భావాలన్నిటికీకూడ సాహిత్యంలో స్థానం దొరుకుతుంది గదా అంటే నిజమే. కాని సామాజిక

బాధ్యత గుర్తించిన రచయితలు సాహిత్యాన్ని సమాజానికి కేవలం అనుకరణగా, ఫొటోగా, నివేదికగా భావించరు. విస్పష్టంగా కనబడనప్పటికీ ఆ సమాజంలో వైరుధ్యాలున్నాయని వాళ్ళు గుర్తిస్తారు. వెలికి పట్టుకుంటారు. సామాజిక వైరుధ్యాలను, సామాజిక చలన సూత్రాలను గుర్తించి, పాఠకులతో గుర్తింపచేయడం తమ బాధ్యతగా ఎంచుకుంటారు

అట్లని ఈ వైరుధ్యాల గురించి, చలన సూత్రాల గురించి సిద్ధాంత గ్రంథాలలో ఉన్న విషయాలనే సాహిత్యంలో ఏకరువు పెట్టాలని ఎవరూ అనరు. నిజానికి సిద్ధాంతం అనేది సాధారణీకరించిన జీవిత సత్యం. జీవితాన్ని - ఒంటరి జీవితాన్ని కాదు, సామాజిక జీవితాన్ని నిశితంగానూ, లోతుగానూ పరిశీలిస్తే, దాని చలన సూత్రాలను, దాని గత వర్తమాన భవిష్యత్తులను సక్రమంగా అవగాహన చేసుకుని యథాతథంగా చిత్రిస్తే జీవిత సత్యాలు వెల్లడవుతాయి. వాటిని మానవీయ సన్నివేశంలో, కళాత్మకంగా చిత్రిస్తే సాహిత్యమనీ, వ్యాసరూపంలో, తాత్విక రూపంలో చిత్రిస్తే సిద్ధాంతమనీ పిలుస్తున్నాం. నవల వేరు, సిద్ధాంతం వేరు అన్న మాట రూపరీత్యా నిజమేగాని, సారాంశంలో రెండింటికీ పునాదిగా ఉన్నదీ, ఉండేదీ, ఉండవలసినదీ జీవిత సత్యాల సముదాయమే.

'స్వేచ్ఛ'లో సమాజంలో స్వేచ్ఛ గురించి ఉన్న భావనలలో సరైనదాన్ని మినహాయించి దాదాపు మిగతావన్నీ చిత్రణలోకొచ్చాయి. వాటిలో దేన్నయినా నిజమైన స్వేచ్ఛాభావన అని రచయిత అనుకుంటున్నారో లేదో తెలియదుగాని అన్నీ చెప్పి అసలైన స్వేచ్ఛాభావన గురించి చెప్పకపోవడం మాత్రం బాధ్యతా రాహిత్యమే అవుతుంది.

వర్గ సమాజంలో స్వేచ్ఛ నిజమైన అర్థంలో సాధ్యం కాదు అన్నప్పుడు అసలు స్వేచ్ఛా తపనే ఉండదని కాదు. వర్గ సమాజాన్ని కూలదోసే ఆచరణే అప్పుడు ఆ స్వేచ్ఛాతపనకు సరైన వ్యక్తీకరణ అవుతుంది. చలన సూత్రాలను కనిపెట్టి వాటిమీద అధికారం సంపాదించడమే, అవశ్యకతను గుర్తించడమే స్వేచ్ఛ అంటే అర్థం అదే. కాని 'స్వేచ్ఛ'లో స్వేచ్ఛకోసం నిజంగా న్యాయంగా తరతమ స్థాయిల్లో తపన పడిన పాత్రలన్నీ కూడా స్వేచ్ఛను అధిభౌతికంగా అర్థం చేసుకున్నాయి. లేదా అమాయకంగా అర్థం చేసుకున్నాయి. స్వేచ్ఛను ఒంటరిగా సాధించగలమనుకున్నాయి. స్వేచ్ఛకోసం సంఘజీవితం నుంచి, సంఘటిత ఆచరణ నుంచి దూరం కాదలచుకున్నాయి. కాని వ్యక్తులు ద్వీపాలుగా

మారడం ద్వారా స్వేచ్ఛను సాధించలేరు. (రాబిన్‌సన్ క్రూసో అనుభవించినది స్వేచ్ఛేనా ?) స్వేచ్ఛ, వ్యక్తిత్వం అవిభాజ్యమైన అంశాలు. వ్యక్తిత్వం సమాజం లోనే, సామాజికంగానే రూపుదిద్దుకుంటుంది. స్వేచ్ఛ కూడ సమాజంలోనే, సామాజిక ఆదరణ నుంచే ప్రభవిస్తుంది.

స్వేచ్ఛమీద వ్యక్తిగత అధికారం అనే భావనవల్లనే నవలలో కుటుంబంపట్ల సంఘటిత ఆచరణపట్ల అభిప్రాయాలు కూడ రూపొందాయి.

నవలలో అరుణ ప్రకాశం కుటుంబం, కేశవరావు కుటుంబం, ఉమ-సుధీర్ సహజీవనం మూడిటినీ పరిశీలిస్తే కుటుంబ వాస్తవికత గురించి, కుటుంబంలో తలెత్తుకున్న వైరుధ్యాల గురించి, కుటుంబం రద్దు గురించి రచయిత సమాజంలో ఉనికిలో ఉన్న తప్పుడు అభిప్రాయాలనే ప్రతిఫలించారని అర్థమవుతుంది.

కేశవరావు కుటుంబం దౌర్జన్యం, అధికారం ప్రాతిపదిక మీద కొనసాగుతోంది. స్నేహం, స్వేచ్ఛ ప్రాతిపదికగా కుటుంబం నెలకొల్పాలనుకున్న అరుణ కుటుంబాన్ని రద్దు చేసుకోవలసి వచ్చింది స్నేహం, స్వేచ్ఛ, వ్యక్తిత్వం, పరస్పర గౌరవం ప్రాతిపదికగా సహజీవనం గడపదలుచుకున్న ఉమ-సుధీర్‌లు అంతిమంగా సహజీవనాన్నే రద్దు చేసుకున్నారు. స్త్రీ పురుషుల సహజీవనాన్ని ఒకానొక వ్యక్తిక వాంఛగా మాత్రమే చూశారు. దాని సామాజిక స్వభావాన్ని నిరాకరించారు.

దాంపత్య కుటుంబం ఉనికిలోకి వచ్చిన నాటినుంచీ దౌర్జన్యంమీద, స్వామి-దాసి సంబంధం మీదనే కొనసాగుతోంది. ఇటువంటి దుర్భరమైన సంబంధంలో భర్తకుగల అపరిమిత అధికారాల వల్ల స్త్రీ పురుష సంబంధాలలో భయంకరమైన అంశాలెన్నో వచ్చి చేరాయి అతి బలవంతుడైన ప్రభువును స్వీయ సమర్పణ ద్వారానో, కాన్కల ద్వారానో, బానిసత్వం ద్వారానో సంతృప్తి పరచడానికి ప్రయత్నించడంలో స్త్రీ వ్యక్తిత్వం చచ్చిపోయింది. మరొకవైపు స్త్రీలు అసంఘటితంగానైనా, అస్పష్టంగానైనా ఈ పలుపు తాడును తెంపుకోవడానికి, అసలు గుర్తించకుండా ఉండడానికి ప్రయత్నాలు చేశారు అవి భూస్వామ్య భావజాలంలో మునిగిపోవడంగా, గయ్యాళితనంగా, అవినీతిగా కూడ వ్యక్తమయ్యాయి. భర్త ఏ పనులు బహిరంగంగా చేయగలడో, చేయడం అతనికి కీర్తికారకమో ఆ పనులే స్త్రీ కూడా రహస్యంగా చేయడం ఏదో ఒక స్థాయిలో ప్రారంభమైంది. అంటే దాదాపుదాంపత్య కుటుంబం ఏర్పడ్డ నాటినుంచే అంతర్గత కారణాల వల్లనే దాని విచ్ఛిన్నం కూడ ప్రారంభమైంది. భూస్వామ్య, పెట్టుబడిదారీ పాలక వర్గాలు తమ ప్రయోజనాలకోసం

ఒకవైపు కుటుంబాన్ని మౌలిక సామాజిక, ఆర్థిక యూనిట్‌గా బలంగా ఉంచడానికి ప్రయత్నిస్తూనే, మరోవైపు దాని విచ్ఛిన్నానికి కారణమయ్యాయి. కుటుంబం దానితో పాటే వ్యభిచారాన్ని తీసుకొచ్చింది. మరొక వంక ఉత్పత్తి క్రియలో స్త్రీలు ఎక్కువగా పాల్గొనవలసి వచ్చింది. ఈ రెండు కారణాలూ కలిసి వందలాది ఏళ్ళుగా కుటుంబాన్ని విచ్ఛిన్నం చేస్తూనే ఉన్నాయి. విడివిడి సంఘటనలలో దాంపత్య సంబంధాన్ని రద్దు చేస్తూనే ఉన్నాయి.

కాని కుటుంబం రద్దు అంటే ఏమిటి ? అది జరగవలసింది ఈ రూపంలోనేనా ? మరి పెట్టుబడిదారీ విధానం అమలుచేసే కుటుంబం రద్దుకూ, కమ్యూనిస్టు సమాజంలో అమలయ్యే కుటుంబం రద్దుకూ ఏమీ తేడా లేదా ? అర్ధ వలస, అర్ధ భూస్వామ్య ఉత్పత్తి సంబంధాల ప్రభావం వల్ల జరిగే కుటుంబం రద్దుకూ, ఉన్నత మానవ సంబంధాల గురించి ఆలోచించేవాళ్ళ కుటుంబం రద్దుకూ ఏమీ తేడా లేదా ?

కమ్యూనిస్టులు ప్రకటించే ఏ రద్దుకైనా, ఏ విధ్వంసానికైనా తప్పనిసరిగా మరొక ప్రత్యామ్నాయం, నిర్మాణం ఉంటాయి. కమ్యూనిస్టులు ఒక ఉన్నత మానవ సంబంధాన్ని ప్రతిపాదిస్తూ, నిర్మిస్తూ కుళ్ళిపోయిన మానవ సంబంధాన్ని విధ్వంసం చేస్తారు. కమ్యూనిస్టుల విధ్వంసం విధ్వంసం కోసం మాత్రమే కాదు.

ఒక కుటుంబాన్ని, ఒక కప్పు కింద సహజీవనాన్ని రద్దు చేస్తున్నామంటే 'ఎల్ల లోకములొక్క ఇల్లయి' ఉండడానికే. మౌలిక సామాజికార్థిక యూనిట్‌గా కుటుంబాన్ని తొలగిస్తున్నామంటే ఆ స్థానంలో కమ్యూన్, వసుధైక కుటుంబం ఏర్పడడానికే. మరి కమ్యూన్ అనేది, స్త్రీ పురుషుల మధ్యగాని, ప్రపంచ మానవులందరి మధ్యగాని ఉన్నత మానవ సంబంధాన్ని ఏర్పరచడమనేది ఒక దీర్ఘకాలిక ప్రక్రియ గద, అప్పటివరకు కుటుంబంలో పెరిగే సంక్షోభాన్ని పరిష్కరించకుండా కూచుందామా అనే ప్రశ్న వస్తుంది. నిజమే, ఒక్క కుటుంబంలో మాత్రమే కాదు, సకల రంగాలలోనూ సంక్షోభం వ్యాపిస్తోంది. కుటుంబంలో ఈ సంక్షోభం చాల తీవ్రమైన స్థాయిలో కూడ ఉంది ఈ సంక్షోభాన్ని పరిష్కరించే ప్రయత్నమయినా ఇప్పటికిప్పుడే ప్రారంభించక తప్పదు.

కుటుంబ వ్యవస్థలోని సంక్షోభాన్ని పరిష్కరించాలంటే, దాని చరిత్రను అవగాహన చేసుకోక తప్పదు. ఒక భార్యా భర్తల సంబంధం కేవలం వాళ్ళ మంచి

చెవుల వల్ల మాత్రమే సంక్షోభానికి గురికావడం లేదు. వాళ్ళమీద కొనసాగుతున్న పితృస్వామిక భావజాలం, వాళ్ళ చుట్టూవున్న, వాళ్ళను నిరంతరం ప్రభావితం చేస్తున్న సమాజం ఇందుకు కారణాలు. కనుక సంక్షోభ పరిష్కారంలో ఆ ఇద్దరు వ్యక్తుల వయ్యక్తిక స్వభావాలతో పాటు ఇతర కారణాలను కూడ దృష్టిలో ఉంచుకోవాలి.

ఒక ప్రత్యేక సంఘటనలో ఆ దాంపత్య సంబంధం రద్దు చేసుకోవడమే ఆ ఇద్దరు వ్యక్తుల, (లేదా అణచివేతకు గురవుతున్న వ్యక్తి) సృజనాత్మక వికాసానికి, వ్యక్తిత్వానికి దోహదం చేస్తు దనుకుంటే ఆ పరిష్కారాన్ని సూచించవచ్చు. కాని అప్పుడయినా ఆ పరిష్కారం వీలయినంతవరకు ప్రజాస్వామిక చర్చ ఆధారంగా రూపొందడం సరైన పద్ధతి అవుతుంది.

కాని మొత్తం సామాజిక స్థాయిలో తీసుకున్నప్పుడు ఈ స్వభావాల కొలతలు తీసుకుని పరిష్కారాలు వెతకలేం. అప్పుడు గతపుభారం, సమాజ ప్రభావం ప్రధానమైన వవుతాయి. వాటిని తొలగించే క్రమమే, అంటే సంఘటిత వర్గపోరాటమే కుటుంబ సంక్షోభాన్ని కూడ రద్దు చేస్తుంది. ఐతే కుటుంబ సంక్షోభాన్ని రద్దు చెయ్యడమంటే కుటుంబాన్ని రద్దు చేయడం కానవసరం లేదు. మానవులు సంఘ జీవులు. వాళ్ళ సంఘ జీవితాకాంక్ష కేవలం సహజాతం మాత్రమే కాదు. ఉత్పత్తి క్రమం సామాజికం గనుక, శ్రమ సామాజికం గనుక, పంపిణీ సామాజికం గనుక మానవులు ద్వీపాలుగా బతకడం అసాధ్యం. కుటుంబంలో సారాంశంగా ఉన్నది, సరైనది ఈ సంఘ జీవితాకాంక్షే. దాని మీద వర్గ సమాజం కప్పిన కల్మషాన్నంతా కడిగేసి మళ్ళీ ఆ సహజత్వంతో, అనివార్యతతో మానవుల మధ్య సంబంధాన్ని పునర్నిర్మించాలి. ఆ సంబంధాన్ని ఆ యా వ్యక్తులు కుటుంబం అని పిలుచుకుంటారా లేదా అన్నది అంత ముఖ్యం కాదు.

నవలలో పైన చెప్పిన మూడు జంటలలోను సంక్షోభం ఉంది. కేశవరావు ఆ సంక్షోభాన్ని గుర్తించడం లేదు. దౌర్జన్యం ద్వారా, అధికారం ద్వారా అసలు, ఆ సంక్షోభం లేదనిపించేలా తయారుచేసి పెట్టాడు

అరుణ ఆ సంక్షోభాన్ని మొదట గుర్తించింది. ఒక సంక్షోభం ఎదింతా మీదికి వచ్చినపుడు ఒక అధికారి ఎట్లా ప్రవర్తిస్తాడో ప్రకాశం సరిగ్గా అట్లాగే ప్రవర్తించాడు. ఆ సంక్షోభం ఇక పరిష్కరించక తప్పని స్థితిదాకా ఎదిగింది. ఆ

సంక్షోభం వల్ల స్త్రీగా అరుణ ఎక్కువ అణచివేతకు గురైంది కనుక సహజంగానే తన ఇష్టప్రకారం ఆ సంక్షోభాన్ని పరిష్కరించుకుంది.

ఉమ, సుధీర్‌లు అటువంటి సంక్షోభం వస్తుందని గుర్తించారు. అందువల్ల ఆ సంక్షోభానికి తావివ్వకుండా విడివిడిగా జీవిద్దామనుకున్నారు. తద్వారా సంక్షోభం నుంచి తప్పించుకోగలమనుకున్నారు.

ఇవాళ సమాజంలో మొదటి రెండు రకాల ఉదంతాలే ఎక్కువ. కాని ఎంత చెదురు మదురుగా ఉన్నప్పటికీ మూడో ఉదంతమే వివరంగా చర్చించవలసినది.

ఇక్కడ ఉమ, సుధీర్ ఇద్దరూ కూడ కుటుంబ సంక్షోభానికి చాల అమాయక మైన కారణాలు వెతుక్కుంటున్నారు. ఇరవైనాలుగు గంటలు కలిసి ఉండడమే ఇద్దరు వ్యక్తుల మధ్య భేదాభిప్రాయానికి, అప్రజాస్వామిక సంబంధానికి కారణమవు తుందా ? విడివిడిగా ఉండి కలవాలనిపించిన ఏ పాపుగంటో కలిసినప్పుడు వాళ్ళ మీద సమాజ ప్రభావమేమీ ఉండదా ? అంటే వ్యక్తులుగా వాళ్ళు ఆ కొద్దిసేపటిలో తిరస్కరించగలిగిన విలువలనే, కేవలం కలిసి ఉన్నందువల్ల మాత్రమే ఆచరించవలసి వస్తుందా ?

నిజానికి ఉమ, సుధీర్‌ల మధ్య పరస్పర గౌరవం మాట ఏమోగాని పరస్పర విశ్వాసం కూడ లేదు, ఒక సహజీవనంలో అవతలి వ్యక్తితో ప్రజాస్వామికంగా వ్యవ హరించగలమా లేదా, అవతలి వ్యక్తి వ్యక్తిత్వాన్ని గుర్తించగలమా లేదా అన్నదే ప్రధానమైన అంశం. ఆ సంబంధం ఎంత దృఢంగా ఉంటుందీ, ఎంత స్థిరంగా ఉంటుందీ అన్నది ఈ అంశం మీదనే ఆధారపడి ఉంటుంది. ఐతే ఇవాళ్టికివాళ ఎవరూ పూర్తిగా ప్రజాస్వామికంగా మారిపోలేరు. అది ఒక క్రమం. వర్గసమాజంలో ఏ ఒక్క వ్యక్తికీ తన జీవితకాలంలో పూర్తయ్యే క్రమం కూడ కాదు. ఏ వ్యక్తయినా, ఎంత ప్రజాస్వామికంగా, అవతలివాళ్ళ వ్యక్తిత్వాలను గౌరవిస్తూ ఉండే వ్యక్తయినా ఏదో ఒక క్షణంలో నిరంకుశంగా, అహంకారంతో ప్రవర్తించవచ్చు. తన మీద తాను చేసుకొనే పోరాటంలో ఆ వ్యక్తి ఎంత నిజాయితీతో ఉన్నారనే దానిపై ఇది ఆధారపడుతుంది

అటువంటప్పుడు ఉమ, సుధీర్ ఇద్దరూ కూడ అవతలివాళ్ళు ప్రజాస్వామికంగా వ్యవహరించరేమోనని అనుమానించడంలో తప్పులేదుగాని ఆ కారణంవల్ల వ్యక్తులు విడివిడిగా బతకడం పరిష్కారమేనా ? కాని బదులు, తప్పుల్ని ఒప్పుకునే వినయం,

కొత్త విషయాలు నేర్చుకునే సహనం కూడ ప్రజాస్వామిక స్వభావంలో భాగమని గుర్తించి వాటిని అలవరచుకోవడానికి ప్రయత్నిస్తూ సహజీవనం సాగించడం సరైన పరిష్కారంకాదా ?

ఇది ఒక వయ్యక్తికమైన సమస్య అని, ఎవరికి వాళ్ళు పరిష్కారాలు వెతుక్కోవలసిందేనని అనడం సరైనది కాదు. ఎందుకంటే సాంస్కృతిక విప్లవం ఒక పక్కనుంచి స్వార్థంమీద పోరాటాన్ని ప్రకటించిన తర్వాత, మరోపక్క నుంచి పాశ్చాత్య ఫెమినిస్టు ఉద్యమం 'వయ్యక్తికమైనదికూడ రాజకీయమే' అనే నినాదం లేవదీసిన తర్వాత తనమీద తాను జరుపుకునే పోరాటమూ, వ్యవస్థమీద జరిపే పోరాటమూ ఒకే మహత్తర పోరాటంలో అంతర్భాగాలని తేలిపోయింది. అందుకే కుటుంబంలో సంక్షోభం ఏకకాలంలో వయ్యక్తిక సమస్యగాను, సామాజిక సమస్యగాను కూడ ఉంటుంది. అంటే పరిష్కారం కూడ రెండు రంగాలలోను ఉంటుంది. ఐతే సామాజిక ప్రభావానికి ఉన్న బలంవల్ల సామాజికాంశమే ప్రధానమైనదవుతుంది.

అంతేగాక, సహజీవనానికి ఒక స్త్రీ, ఒక పురుషుడు కలిసి ఉండడానికి, చివరికి కుటుంబానికి కూడ కేవలం వయ్యక్తిక వాంఛలే పునాది కాదు. ప్రతి మానవ సంబంధమూ ఒక సామాజికాంశం. దాని చుట్టూ అనేకానేక సామాజిక బాధ్యతల వలయం ఉంది. ఈ అంశాన్ని విస్మరించడం నిహిలిజమే అవుతుంది. తప్పుడు విలువల్ని ధ్వంసంచేసే పేరుమీద అసలు విలువలను నిరాకరించడం సారాంశంలో నిహిలిజమే.

ఇట్లా ఒక నిర్మాణంలో తప్పులు జరుగుతున్నాయి గనుక ఆ నిర్మాణాన్నే పూర్తిగా రద్దుచేయాలనే దృక్పథమే కొనసాగి, నవల సంఘటిత నిర్మాణాలకు వ్యతిరేక దృక్పథాన్ని ప్రకటించింది. వెలుగు సంస్థ, కేశవరావు, మరెవరయినా తప్పులు చేస్తూ ఉండవచ్చును. ఒక ఆదర్శం కోసం పనిచేస్తున్న నిర్మాణంలో ప్రతి వ్యక్తి ఆదర్శజీవి కాకపోవచ్చును. ఆ వ్యక్తి వ్యవస్థమీద పోరాటంలో అగ్రభాగాన నిలిచినందువల్ల ఆ స్థానానికి చేరి ఉండవచ్చు. కాని ఇంకా తన మీద తాను పోరాటం చేసుకోవాలని గుర్తించి ఉండకపోవచ్చు. గుర్తించినా తనమీద తనకుండే ప్రేమవల్ల ఆ పోరాటాన్ని మొదలుపెట్టకపోయి ఉండవచ్చు.

కాని ఆ కారణంవల్ల ఆ ఆదర్శం తప్పుడు ఆదర్శం అయిపోదు. ఆ సంస్థ బహిష్కరించవలసినది అయిపోదు. ఇవాళ ఉన్న సంక్లిష్ట సామాజిక స్థితిలో ఉత్తమా

దర్శాలను దుర్మార్గులు కూడ ప్రకటిస్తున్నారు. అటువంటప్పుడు ఆ దుర్మార్గుల చేతి నుంచి ఆ పతాకాన్ని లాక్కోవడమే ఆదర్శజీవుల, ఆదర్శజీవులు కాదలచుకున్న వాళ్ళ కర్తవ్యమవుతుంది. 'అధికారపీఠాన్ని బద్దలు గొట్టడమనే' విలువ కూడ సంఘటిత కార్యాచరణ నుంచి ఉద్భవించిందే.

ఐతే ఒక ఆదర్శం కోసం జరిగే పని ఎటువంటి వాళ్ళతో జరగాలి? కచ్చితంగా ఆకాశంలోంచి ఊడిపడిన దేవతలెక్కడా దొరకరు. ఉన్న వాళ్ళలోనే వ్యవస్థతో తమతో ఏకకాలంలో పోరాడుకోవాలనే జ్ఞానం కలగజేస్తూ ముందుకు సాగాలి. ఎందుకంటే ఏ ఆదర్శమైనా, ఎంత చిన్నపాటి ఆదర్శమైనా సంఘటితమైన, ఉమ్మడి కార్యాచరణ లేకుండా సాధించడం అసాధ్యం. సామాజికమైన పనిదేన్నయినా యుగకర్తలు, ఒంటరి వ్యక్తులు చేయలేరు. ఉమ్మడి కార్యాచరణలో ఉన్న ఇబ్బందులను గుర్తిస్తూ, అవిగమిస్తూ, అధిగమించడానికి ప్రయత్నిస్తూ ఉమ్మడి కార్యాచరణలో ఉండడమే ఏకైక మార్గం.

కాని నవలలో అరుణ ఉమ్మడి కార్యాచరణ నుంచి విడిపోయింది. భారతి, సుజాతకూడ ఆమెతో పాటు ఉమ్మడి ఆచరణ నుంచి బైటికొచ్చారు. వాళ్ళు మళ్ళీ ఒక ఉమ్మడి ఆచరణలోకి రావచ్చుననే ఆశావహమైన ముగింపు నవలలో ఉంది. కాని కేశవరావు పితృస్వామ్య భావజాలం ఉన్నట్టుగానే, స్త్రీలలో కూడ పెద్దఎత్తుననే పితృస్వామ్య భావజాలం ఉంటుంది. అటువంటి వాళ్ళతో ఐక్య కార్యాచరణ కుదరదనే నియమం పెట్టుకుంటే స్త్రీల ఉమ్మడి కార్యాచరణ మాత్రం నిలుస్తుందా?

స్త్రీలకు విడిగా నిర్మాణాలు చాలా అవసరం. తద్వారా స్త్రీల సృజనాత్మక, ఆలోచనా, వాదనా, పటిమ, చొరవ పెరుగుతాయి. కాని ఆ నిర్మాణాలు ఏ దిశగా ఏర్పడాలి? అవి "పురుష సంస్థల" పెత్తందారీ తనానికి వ్యతిరేకంగా ఏర్పడవలసిందేనా? స్త్రీ పురుష భేదాన్ని ప్రధానాంశంగా చూపే సంస్థలు కావాలా? తరతరాలుగా అణగిపోయిన శక్తి పాటవాలను వెలికితెచ్చే ప్రయత్నంలో, బెరుకును పోగొట్టడానికి ఏర్పడ్డ ప్రత్యేక సంస్థలుగా ఏర్పడి ఒక క్రమంలో తమ ప్రత్యేకతలను రద్దు చేసుకుని మానవ సంబంధాలను ఉన్నతీకరించే సామాజిక సంస్థలుగా ఉండాలా? ఆ క్రమంలో అవి పురుష సంస్థలకు సమాన, అనుబంధ సంస్థలుగా ఉండాలా?- ప్రత్యామ్నాయ సంస్థలుగా ఉండాలా?- ఈ ప్రశ్నలన్నిటినీ 'స్వేచ్ఛ' రేకెత్తిస్తుంది. సామాజిక పరిణామం దృష్టితో చూసినప్పుడుఅసంతృప్తి కలిగించే సమాధానాలనే అందజేస్తుంది.

ఐతే ఒకానొక సమయంలో సరైన జవాబులు చెప్పలేనప్పటికీ సరైన ప్రశ్నలు అడగడమైనా ఆహ్వానించదగినదే అవుతుంది. కాని ఆ అర్థంలో కూడ నక్సల్బరీ తర్వాత, సాంస్కృతిక విప్లవం తర్వాత వీటిలో కొన్ని ప్రశ్నలు అనవసరమైనవవు తాయి.

ఈ నవల ఎందుకిటువంటి విలువలను ప్రతిపాదించిందనే ప్రశ్న వేసుకుంటే, స్త్రీ సమస్యను విడివిడి వ్యక్తులవైపు నుంచి మాత్రమే అర్థం చేసుకున్నప్పుడు, స్త్రీ సమస్యను సామాజిక, చారిత్రక సమస్యగా గుర్తించనప్పుడు ఇటువంటి లోపం తప్పదు. ఆ విడివిడి వ్యక్తులకు ఉన్నటువంటి అనుభవాలే సమాజంలోని అందరు వ్యక్తులకూ ఉండవచ్చును. ప్రపంచంలోని ప్రతి ఒక్క స్త్రీ జీవిత చరిత్రను రాసినా, సమస్యను సామాజిక, చారిత్రక సమస్యగా చూస్తున్నట్టు అవదు. ఒక ఉదాహరణ చెప్పుకోవాలంటే మోసం, హింస, దౌర్జన్యాల గురించిన సాహిత్యం విరివిగా వస్తున్నది. ఆ సాహిత్యంలోని ఎన్నో సన్నివేశాలు ఎందరికో అనుభవంలో ఉన్నవే. అందువల్ల ఆ సన్నివేశాలలో మనం తాదాత్మ్యం చెందవచ్చును గాని ఆ సమస్య స్వరూప స్వభావాలు, పరిష్కారం మనకేమీ అర్థం కావు.

'స్వేచ్ఛ'కూడ సరిగ్గా అదే పద్ధతిలో స్త్రీ సమస్యను చర్చించింది. ఐతే స్త్రీ సమస్యను విడదీసి, నిర్దిష్టంగా చూసినందువల్ల చిత్రణలో పటిష్టత చేకూరింది. ఆ సమస్య విస్తృతివల్ల సాధారణ పాఠకులలో విపరీతమైన ఆసక్తిని రేకెత్తించింది. నవలా రూపంలో సమర్థతవల్ల పఠనీయంగా రూపొందింది. ఇష్టారాజ్యమే స్వేచ్ఛకు నిర్వచనమనే అరాచకత్వం, కుటుంబం రద్దు అనే భావన కలిగించే ఆకర్షణ, ఉమ్మడి కార్యాచరణలోని అటుపోట్లను తట్టుకుంటూ ముందుకు సాగలేని అసహనం ఈ నవలకు మరికొందరు ఆరాధకులను సంపాదించి పెట్టాయి. సాహిత్యాన్ని లోతుగా చదవనవసరం లేదనుకునే పాఠకుల సంఖ్యకూడ మనలో ఎక్కువే.

ఒక రచన ఒక భావప్రకటన. దానితో మన స్నేహం మన భావాలకూ ఆ భావాలకూగల ఏకీభావమే అవుతుంది. భావాల్ని కలిగి ఉండడం, భావాల్ని ప్రకటించడం, ఇతర భావాలతో ఐక్యతను ప్రకటించడం, విభేదాన్ని ప్రకటించడం ఒక సీరియస్ బాధ్యత అని గుర్తించి ఈ నవల మీద చర్చ సాగడం ఇప్పటికయినా అవసరం.

[రచనా కాలం మార్చ్ 1987]

(లోపల పేజీ తరువాయి)

3) ఊరపిచ్చుక చెంతకొస్తే గూడుకట్టుకొని ఇస్తం
మా జంట వీడిపోకుండా కంటపేము కనిపెడతం
ఆ ఊరపిచ్చుక గుడ్డు లౌతరా మా బిడ్డలా
ఆ గుడ్డులో మా బిడ్డలౌతరా ,,

4) తల్లిలేని మేకపిల్లను పెంచి సాది పెద్దజేస్తము
మీ సొంతు బువ్వ మరువకుండ దానిసొంతు దానికెడతం
ఆ కుక్కపిల్ల సేతులౌతారా మా బిడ్డలు
మాకు సేతండ ఇచ్చిపోతారా

5) జోడు కోడిపుంజూలాకు తోడు కోడిపెట్ట నేస్తం
తొలిసూరు గుడ్డు పెడితె మీ పేరు మీద పొదిగేస్తం
గుడ్డు తొలుసుకోని పుట్టిన కోడిపిల్లకు నీరు పెడతాం
గద్దడేగలు తన్నపొస్తె తల్లికోడై కాపలుంటాం
మా రొక్కలల్లో దాచుకుంటాము మా బిడ్డలు
తల్లి మమత తీర్చుకుంటాము

6) కట్టినా ఆ పిల్ల ఆవును కంటిపాపల చూసుకుంటం
పచ్చగడ్డి పిండిపెట్టి ప్రాణమోలె పెంచుకుంటం
పురిటి నొప్పులు దానికొస్తే కాన్పుజేసి కాపలుంటం
తల్లి వ్యాగను నాకుతుంటే తల్లి ప్రేమ గురుతుకొచ్చు
మా పురిటి నొప్పులైయ్యి వొస్తారా మా బిడ్డలు
మీరు మళ్ళీ జన్మై మాకె పుడతారా ,,

7) ఇంటిముందు పెరడులోనా జొన్నసేనై పేము పుడతం
సొంటి కాలుమీద నిల్చి కొడుకు నిమ్మని వ్రతం పడతం
మీరు జొన్నకంకులయ్యి పుడుతారా మా బిడ్డలు
మా సంకలల్లో బిడ్డలౌతారా ,,

) దసర పండుగ దగ్గరుంది దర్జీవాళ్ళు కుట్టరాని
తమ్మునీకి ప్యాంటు తెస్తం నీకు షర్టు తెస్తమంటే
ఏదీ వద్దని (జిద్దు) బెట్టుచేస్తివి అలిగి అన్నం తినకపోతివి
తెల్ల ప్యాంటు ఎర్రషర్టు తెచ్చి కుట్టిపెట్టినాము
పాలపిట్ట చూసిపోతారా మా బిడ్డలూ
మీరు జెంబి ఆకై కలసిపోతారా ,,

SRJANA Telugu Monthly January 1990

ఆర్థిక, హార్దిక సహకారాన్నందించి సృజనను ఆదుకోండి

నిర్బంధం, నిర్వహణా సమస్యలు, ఆర్థిక సమస్యలు కలిసి సృజన ప్రచురణను ఇన్నాళ్ళూ కష్టసాధ్యం చేశాయి. ప్రస్తుతం ఈ సమస్యలను అధిగమించి సృజనను కొనసాగింపజేయాలని సాహితీ మిత్రులు ఆకాంక్షిస్తున్నారు ఆ ఆకాంక్ష సఫలం కావడంలో మీ అందరి తోడ్పాటునూ సాహితీ మిత్రులు కోరుకుంటున్నారు.

సృజనపై నిర్బంధాన్ని ఖండించండి!

సృజనకు విరివిగా రచనలు పంపండి! అచ్చయిన రచనలపై మీ నిర్మొహమాటమైన అభిప్రాయాలు రాయండి.

సృజనకు చందాలు చెల్లించండి! మీ మిత్రులను చందాదార్లుగా చేర్పించండి; సృజనకోసం విరాళాలు పోగు చెయ్యండి! సృజనకు మీ మీ ప్రాంతాలలో నమ్మకమైన ఏజెంట్లను కుదిర్చి పెట్టండి.

సృజన మీ పత్రిక! సృజనను నిలబెట్టే బాధ్యత మీదే!

సంవత్సర చందా రు. 40, విడి ప్రతి రు. 4.

చందాలు, రచనలు పంపవలసిన అడ్రస్ :

సృజన,
ఫ్లాట్ 3, బ్లాక్ 14,
ఎంఐజిI, పింక్ క్వార్టర్స్,
బాగ్‌లింగంపల్లి
హైదరాబాద్-500 044